# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక

జూన్ 2024

వెల: రూ. 25/-





# శ్రీవేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక

**సంపుటి: 17** **సంచిక: 6**

**సలహాదారులు, స్ఫూర్తిదాత, కర్త, కర్మ, క్రియ మా ప్రభు తిరుమల శ్రీ వేంకటేశ్వరుడు**

ప్రధాన సంపాదకులు:
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

గౌరవ సంపాదకులు:
**డా॥ టి. గౌరీశంకర్**

ఫొటోగ్రాఫర్:
**పత్తి సుబ్రమణ్యం,** శ్రీనివాస మంగాపురం

డి.టి.పి & డిజైన్: **సాయినాథ్, రమేష్**



**Email:** srivenkatesham@gmail.com
namo_venkateshaya@yahoo.com
**Website:** www.srivenkatesham.org
**E-Magazine:** www.readwhere.com
Phone: **040–27175050**
Cell: **9348212354**


**లోపలి పేజీల్లో**


| | |
|---|---|
| శ్రీ వేంకటేశ్వర స్తుతి | 4 |
| ముక్తిమార్గం | 5 |
| భక్తి ముక్తి దాయకం గజేంద్రమోక్షము | 6 |
| తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశ... | 9 |
| ధ్యానం ఆవశ్యకత | 18 |
| మహాభారతంలోని మహోపాఖ్యానాలు | 22 |
| జగద్గురువు శ్రీ ఆదిశంకరాచార్యులు | 29 |
| జ్ఞాన గుళిక | 33 |
| రామాయణ రత్నాకరం | 36 |
| ముకుందమాల | 40 |
| శ్రీ వేంకటాచల మాహాత్మ్యం | 45 |
| శ్రీకృష్ణ తత్వం | 50 |
| పంచ కృష్ణారణ్య క్షేత్రాలు | 52 |
| శ్రీకృష్ణ లీలలలోని వేదాంత అర్థాలు | 54 |
| త్యాగయ్య జీవితము | 58 |
| మోక్షము నెట్లు పడయ తగును? | 59 |
| సకల శ్రేయోదాయకం జ్యేష్ఠాభిషేకం | 60 |
| పుష్పయాగ మహోత్సవము | 62 |
| మీ ప్రశ్న మా సమాధానం | 63 |
| రాశి ఫలితములు | 65 |
| మీ విజ్ఞానం | 66 |




## భగవంతునిపై దృఢ విశ్వాసం

భక్తికి కొలబద్ద విశ్వాసం. భక్తునికి భగవంతుని పట్ల ఉన్న విశ్వాసాన్ననుసరించి ఆ వ్యక్తి ఎంతటి భక్తుడో నిర్ణయించవచ్చు. జయాపజయాలలో భగవంతుని పట్ల చెదరని విశ్వాసం ఉన్న భక్తుడు ఉత్తముడుగా పరిగణించబడతాడు. కాని మానవుడు ఉత్తమ భక్తునిగా ఎదుగుట చాలా కష్టము. ఎంతో సాధన, పట్టుదల అవసరము. అడుగడుగునా యోగమాయ మనలను భక్తి మార్గము నుండి ప్రక్కకు నెట్టివేస్తుంది. జీవితములో మన ఆసక్తులు, అభిలాషలు జయాపజయాలను ఉపయోగించి భగవంతునిపై గల విశ్వాసాన్ని త్రోసివేస్తుంది. భగవంతుని లీలలను నమ్మవచ్చునా? లేదా? అని అనుమానించే విధంగా తయారు చేస్తుంది. తద్వారా ఆయనపై గల విశ్వాసము ఊగిసలాడుతుంది. ఈ స్థితి సాధారణ భక్తులకే కాకుండా మహాభక్తులకు కూడా వస్తుంది. ఇప్పుడే భక్తుడు తన విజ్ఞతను ఉపయోగించి, స్వామివారికి శరణుజొచ్చి ఈ యోగమాయ ప్రభావం నుండి బయటపడాలి. లేకుంటే భక్తుడు భక్తిమార్గము నుండి భ్రష్ఠుడు కావడం తథ్యం. ఇదే సమయంలో భగవంతుని లీలలు కూడా నమ్మకము, అపనమ్మకము మధ్య ఊగిసలాడే విధంగానే ఉంటాయి. ఈ పరిస్థితి ప్రతి మానవుని జీవితంలో ఏర్పడుతుంది. ఉదా: పూర్వము కంసుడు, చిన్నపిల్లవాడైన శ్రీకృష్ణుని చంపుటకు ఎంతోమంది బలవంతులైన రాక్షసులను ఒకరి తరువాత ఒకరిని పంపాడు. ప్రతి రాక్షసుడిని శ్రీకృష్ణుడు చంపివేశాడు. కాని శ్రీకృష్ణుడే వారిని చంపాడని కంసుడు నమ్మలేదు. కొందరు గుండెపోటుతో, మరికొందరు మరోకారణముతో మరణించారని భావించాడు. ఒకదశలో శ్రీకృష్ణుడు భగవంతుడా? కాదా? అనే అనుమానం ఊగిసలాడింది. అదే సమయంలో కంసుని హృదయంలో శరణాగతి చేయమనే భావాలు స్పష్టంగా వచ్చాయిట. కాని అభిమానము, తన బలముపై విశ్వాసము గల కంసుడు దీనిని లెక్కచేయలేదు. యోగులు, పెద్దల మాటలను కూడా పట్టించుకోలేదు. చివరికి మరణించాడు. ఇదేవిధంగా రావణాసురుని విషయంలో కూడా జరిగింది. శ్రీరాముడు భగవంతుని అవతారమని ఎంతోమంది చెప్పినా వినలేదు. ఎవ్వరిచేత వధింపబడని వీరులు యుద్ధములో చనిపోయినప్పుడు కూడా కనువిప్పు కలగలేదు. నమ్మకము, అపనమ్మకము మధ్య ఊగిసలాడిపోయాడు. చివరికి మరణించాడు. ఇలా ప్రతి వ్యక్తి జీవితము రామాయణము, భారతము లాంటిదే. పరిస్థితులు మనల్ని భగవంతునిపై గల విశ్వాసమును సన్నగిల్లే విధంగా చేస్తాయి. ఈ సందర్భంలో ఎవరైతే భగవంతుని శరణు జొచ్చి గట్టిగా పట్టుకున్నవాడు ధన్యుడు. మానవునికి భగవంతునిపై ఉన్న భక్తి, విశ్వాసాలు నిరూపించుటకు మానవజన్మ నిర్దేశింపబడింది. భగవంతుని కృపను పొందుటకు కేవలము మానవజన్మయే ఉపకరిస్తుంది. ప్రతి మానవుడు భగవంతునిపై అచంచల భక్తి విశ్వాసాలు కలిగి ఉండుట ఎంతో అవసరము. భగవంతుడు కూడా తన యోగమాయతో లీలావిలాసము చేస్తూ ఈ సృష్టిని నడుపుచున్నాడు. సృష్టిలో జరిగే ప్రతి సంఘటన మంచి, చెడు ఏదైనా భగవంతుని కృపతోనే జరుగుచున్నదనే విశ్వాసము కలిగి ఉండాలి. జరిగింది మన మంచికే అనే భావన కలిగి ఉండాలి. భగవంతుని కృప లేకుంటే మనమేమీ చేయలేమనే భావాన్ని కలిగి ఉండాలి. ఈ సృష్టిలో భగవంతుడు ఒక్కొక్క మానవుణ్ణి ఒక్కొక్క విధంగా ఉపయోగిస్తాడు. ఏ ఇద్దరి జీవితము ఒక రకంగా ఉండదు. కాబట్టి ప్రతి మానవుడు పురాణాలను, భక్తుల చరిత్రను చదివి వారి జీవితానికి అన్వయించుకోవాలి. ప్రతి వ్యక్తి తన జీవితానికి తనే నిర్ణేత. సరైన నిర్ణయం తీసుకుని బాగుపడుట మానవుని వంతు. మన చుట్టూ ఎన్నో మార్గాలు ఉన్నప్పటికీ భగవంతుని వైపు ప్రయాణించువారే విజయం సాధించగలరు. సదా భగవంతుని సాధన చేయువారు ఇలాంటి ఊగిసలాట నుండి బయటపడగలరు. భగవంతుడు భక్తప్రియుడు. మనం ఒక అడుగు ఆయన వైపు వేస్తే ఆయన నాలుగు అడుగులు మనవైపు వేసి ఆదుకోగలడు. భక్తుల ఉద్ధరణ కొరకు మాత్రమే వైకుంఠాన్ని వదలి, తిరుమల కొండపై, మనకు అత్యంత దగ్గరగా మనకోసం కొలువై ఉన్నాడు. సదా ఆయన నామస్మరణ చేస్తూ ధన్యులమవుదాము. "నమో వేంకటేశాయ".

నమో వేంకటేశాయ

**వినా వేంకటేశం న నాథో న నాథః ।**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి॥**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు

**పుల్లగూర్ల సాయిరెడ్డి** (గోవిందదాసు)


Editor, Publisher, Printer and owned by **Pullagurla Sai Reddy**. Published at: H.No.1-1-53, Street No:1, Habsiguda, Hyderabad-500007. Printed at: Sai Tirumala Printers, H.No:1-8-556/2, Chikkadpally, Hyderabad-500020. **Editor: Pullagurla Saireddy:** Cell : **93482 12354,** Ph:040-27175050; E.mails: **srivenkatesham@gmail.com**, namo_venkateshaya@yahoo.com

## చందా వివరాలు
(రూ.లలో)


| | |
|---|---|
| ☐ 2 సం॥ | 500-00 |
| ☐ 4 సం॥ | 1,000-00 |
| ☐ జీవిత చందా | 5,000-00 |
| ☐ పోషకులు | 10,000-00 |
| ☐ రాజపోషకులు | 50,000-00 |

**9348212354**
నంబర్‌కు పేటీఎం / ఫోన్‌పే / గూగుల్ పే ద్వారా జమచేసి మీ చిరునామాతోపాటు మాకు తెలపండి.
లేదా
శ్రీ వేంకటేశం పేరుపైన ఎం.ఓ / డి.డి. / క్రాస్డ్ చెక్‌ను
లేదా
**Srivenkatesham**
A/c no. S.B. 11002191002593
(Ifsc Code: PUNB0110010)
Punjab National Bank,
Habsiguda, Hyderabadలో
చేరునట్లు, ఆన్‌లైన్ ద్వారా కాని చెల్లించి మాకు తెలియజేయండి.

పూర్తి పేరు:______________________
______________________
చిరునామా:______________________
______________________
______________________
______________________
______________________
పిన్‌కోడ్:______________________
చందా వివరాలు:______________________

మా చిరునామా:
శ్రీ వేంకటేశం, ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం. 1,
హబ్సిగూడ, హైదరాబాద్-500 007.
ఫోన్: 040-27175050
సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

**చందాదారులకు**
**స్వామివారి పవిత్ర పాదాలు**
**(10"x8") ఉచితం**

# శ్రీ వేంకటేశ్వర స్తుతి

శ్లో॥ త్వత్పాద ధూళి భరిత స్ఫురితోత్తమాంగాః
స్వర్గాపవర్గ నిరపేక్ష నిజాంతరంగాః ।
కల్పాగమాకలనయాఽఽ కులతాం లభంతే
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం – ఓ వేంకటనాథా! నిన్ను సేవించి, నీ పాద ధూళిని తలపై ధరించి, దాని వలన స్వర్గ మోక్షములను కూడా గర్హించిన నీ భక్తులు (దాసులు) కల్పాంతమున నీవు అంతర్ధానమగుదువు అను భయముతో మనోవ్యధను పొందుచున్నారు. శ్రీవేంకటాచలపతే నీకు సుప్రభాతము కలుగు గాక!

శ్లో॥ త్వద్గోపురాగ్ర శిఖరాణి నిరీక్షమాణాః
స్వర్గాపవర్గ పదవీం పరమాం శ్రయంతః ।
మర్త్యా మనుష్య భువనే మతి మాశ్రయంతే
శ్రీవేంకటాచలపతే! తవ సుప్రభాతమ్ ॥

తాత్పర్యం – అనన్య భక్తులకు స్వర్గము లేక మోక్షము లందు ఆశ లేక వేంకటాద్రిపై నున్న శ్రీనివాసునే సేవించి తరించెదమను కోరికతో ఆలయం వాకిట నిలిచి యున్నారని భావము.

– డా॥ కె.వి. రాఘవాచార్యులు

# ముక్తిమార్గము





## శ్రీరాగం

ఏత దఖిలంబునకు – నీశ్వరుండై సకల
భూతములలోనఁ దాఁ – బొదలు వాఁడితఁడు || పల్లవి ||

1. గోపాంగనల మెఱుఁగు – గుబ్బచన్నులమీఁద
చూపట్టు కమ్మ క – స్తురి పూఁత యితఁడు
తాపసోత్తముల చిం – తా సౌధముల లోన
దీపించు సుజ్ఞాన – దీప మితఁడు || ఏత ||

2. జలధి కన్యాపాంగ – లలితేక్షణములలో
కలసి వెలుగుచు నున్న – కజ్జలం బితఁడు
జలజాసనుని వదన – జలధి మధ్యమునందు
అలర వెలువడిన పర – మామృతం బితఁడు || ఏత ||

3. పరి వోని సురతసం – పదల నింపులచేత
వర వధూ తతికి పర – వశమైన దితఁడు
తిరువేంకటాచలా – ధిపుఁడు దానై యుండి
పరిపాలనము సేయ – భారకుండితఁడు || ఏత |



భావము – ఈ సమస్త విశ్వమునకు ప్రభువై సర్వప్రాణి కోట్ల అంతరంగములలో వర్ధిల్లు వాడీ పరమాత్ముడు.,

ఇతడు మెఱుంగు లీను గోపికల గుండ్రని చన్నులపై కనిపించు పరిమళము గల కస్తూరి పూత. ఇతడు మునిశ్రేష్ఠుల ధ్యానములను మేడలలో ప్రకాశించు సుజ్ఞానమనెడు దీపము.

ఇతడు సముద్రుని బిడ్డయైన లక్ష్మీదేవి యొక్క కడగంటి విలాసపు చూపులలో కలిసి వెలుగుచున్న కాటుక. ఇతడు చతుర్ముఖుని ముఖములనెడు సముద్ర మధ్యమునుండి పైకి దేలిన పరమామృతము. అనగా బ్రహ్మ వదనముల నుండి పుట్టిన వేదములలో సారము పరమాత్ముడనుట.

ఇతడు కొఱత లేని సురత సంపదల సమృద్ధులతో కాంతారత్నముల కధీనమైనవాడు. మరియు నితడు తాను శ్రీవేంకటాచల ప్రభుడై యుండి సమస్త లోక పరిపాలన భారము వహించినవాడు.

భావానువాదం:
**శ్రీమాన్ సముద్రాల లక్ష్మణయ్య**

# భక్తి ముక్తి దాయకం గజేంద్ర మోక్షము

– చింతలపాటి శివశంకర శాస్త్రి

**శ్లో|| "అజం వరేణ్యం వర పద్మనాభం**
**నారాయణం బ్రహ్మనిధిం సురేశమ్**
**తం దేవ గుహ్యం పురుషం పురాణం**
**వందేమ్యహం లోక పతిం వరేణ్యమ్"**

అజుడు, వరేణ్యుడు, శ్రేష్ఠుడు, పద్మనాభుడు, నారాయణుడు, బ్రహ్మనిధి, సురేశుడు, దేవగుహ్యుడు, పురాణ పురుషుడు అయిన ఆ దేవాది దేవునికి వందన మాచరించుచున్నాను.

శ్రవణా నక్షత్రంతో కూడిన పూర్ణిమ గల మాసం శ్రావణ మాసం. శ్రవణా నక్షత్రం మహావిష్ణువు జన్మ నక్షత్రం. అందువల్ల మహావిష్ణువుకు అత్యంత ప్రీతిపాత్రమైంది ఈ మాసం. శివకేశవుల ఆరాధనకు ఉపయుక్తమైనది. స్త్రీలకు అత్యంత పవిత్రమైంది శ్రావణమాసం.



శ్రావణమాసమంటేనే శుభప్రదమైన మాసం. ఉపాసనా ప్రధానమైన వైదిక సంస్కృతితో ఈ మాసానికి గల ప్రత్యేకత ఎనలేనిది.

"విష్" అను ధాతువు నుండి విష్ణుపదం పుట్టింది. "విష్" యనగా సర్వత్రా వ్యాపించి యుండటం. అంతటా ఆవరించి ఉండటం. "యద్ విషిలో భావం తద్ విష్ణుర్భవతి" అంతటా ప్రవేశించి ఉండేవాడు విష్ణువు. "వేవేష్టి ఇతి విష్ణుః" అని శంకరాచార్యులవారి వ్యాఖ్యానం. విష్ణువు అన్నిచోట్లా ఉండేవాడు. "భూత భవ్య భవత్ ప్రభుః" అనగా గడిచిన కాలానికి, జరుగుతున్న కాలానికి, రాబోయే కాలానికి కూడా ప్రభువు.

"భూత కృత్, భూత భృత్ భావః – భూతాత్మా భూత భావనః" అనగా అన్ని భూతాలను సృష్టించి, భరించేవాడు, అన్ని జీవులలోనూ ఉండేవాడు. ఒక్కమాటలో చెప్పాలంటే విష్ణువు కాలానికి, స్థలానికి, పదార్థానికి అతీతుడు.

అనంతుడు, అచ్యుతుడు, అప్రమేయుడు, జ్యేష్ఠుడు, సనాతనుడు, ఆశ్రిత భక్తవత్సలుడు, స్థితికారకుడు అయిన శ్రీమహావిష్ణువు సృష్టిలోని సమస్త జీవరాశులను సృష్టించి, పోషించి, లయం చేసుకునేవాడు. జీవులందరిలోనూ ఆత్మగా వెలుగొందే విష్ణువును సహస్ర నామస్తోత్రం "ముక్తానాం పరమాగతిః" మోక్షం కోరేవారికి పరమ గతి అని వర్ణించింది.

పరమ మోక్ష ప్రదాత అయిన శ్రీహరిని ప్రతిఫలాపేక్ష లేకుండా ధ్యానించేవారిని భక్తులు అని పేర్కొందురు. భావన తనే తనే భగవత్ప్రాప్తి. పరమాత్మను చేరే సులభమైన మార్గం భక్తి. జీవునికి పరమేశ్వరునితో అనుసంధానం చేసే సూత్రం భక్తి.

**"భక్తి రే వైనం నయతి భక్తి రే వైనం దర్శయతి, భక్తి రే వైనం గమయతి భక్తి వశః పురుషః భక్తి రేవ భూయసి" –శృతి వాక్యం.**

భక్తి భగవంతుని సామీప్యానికి చేరుస్తుంది. దర్శనం లభింపచేస్తుంది. భగవంతుని జ్ఞానాన్ని కలుగజేస్తుంది. పరమ పురుషుడైన భగవంతుడు భక్తికి వశుడు. భక్తి యోగం చేత భగవదనుగ్రహం లభిస్తుందని శాస్త్రం. ఈ భక్తి యోగాన్ని అవలంబించినటువంటి పాండ్య దేశపు రాజు ఇంద్రద్యుమ్నుడు, అతని యొక్క చరిత్రయే గజేంద్ర మోక్షం అని చెప్పబడుతున్నది. గజేంద్ర మోక్షం తామస మన్వంతరానికి చెందినది.

పాండ్య దేశపు రాజు ఇంద్రద్యుమ్నుడు. శ్రీమన్నారాయణుని యందు అమితమైనటువంటి భక్తి కలవాడు. సర్వ కాల, సర్వావస్థల యందు కూడా శ్రీమన్నారాయణుని యందు భక్తితో అతనిని ధ్యానిస్తూ ఉండేవాడు. అందుచేత ఇతని రాజ్యం సుభిక్షంగా ఉండేది. ఒకనాడు ఇంద్రద్యుమ్నుడు దేవదేవుణ్ణి ధ్యానిస్తూ తాదాత్మ్యము చెందాడు. భక్తి పారవశ్యంలో మునిగాడు. అటువంటి సందర్భములో దుర్వాసమహర్షి అచటకు వచ్చాడు. ఆ రాజు భక్తి విశేషము చేత ఎవ్వరినీ చూడక ధ్యానమగ్నుడయ్యాడు. అది చూసి దుర్వాసుడు కోపించి, గౌరవించవలసిన వారిని గౌరవించక నిర్లక్ష్యము వహించి అవమానించినావు కావున ఏనుగుగా మారమని శాపమిచ్చాడు.

తామర పుష్పాలతో నిండియున్న ఒక కొలనులో ''హూ హూ'' అనే రాక్షసుడు దాగియుండి స్నానానికి వచ్చేవారిని హింసిస్తూ ఉండేవాడు. ఒకనాడు అగస్త్య మహర్షి ఆ తటాకానికి రాగా, అతనిని కూడా హింసించాడు. అందులకు ఆగ్రహించిన ఆ మహర్షి నీవు ఒక మొసలిగా మారిపొమ్మని శాపమిచ్చాడు. అగస్త్యుని శాపానికి గురైన ఆ రాక్షసుడు తన తప్పు తెలుసుకుని శాప విమోచనాన్ని వేడుకోగా శ్రీహరి భక్తుడైన గజేంద్రుడు నీ కొలను సమీపానికి వస్తాడని, ఆ గజేంద్రుని నీవు పట్టుకుంటే నీకు శాపం తీరుతుందని పలికాడు.

అనేక అరణ్యాలతో కూడిన క్షీరసాగర సమీపంలోని త్రికూటమనే పర్వతంపై జరిగిన కథ ఇది. భాగవతంలోని గజేంద్ర మోక్ష ఘట్టం కేవలం కథ కాదు. ఏ ఒక్కరికో కాకుండా జీవులందరికీ వర్తిస్తుంది.

**"స్థానము తప్పి వచ్చునెడఁ దానెటువంటి బలాఢ్యుడున్ నిజ**
**స్థానికుడైన యల్పుని కతంబున నైనను మోసపోవుగా**
**కానల లోపల న్వెడలి గంధ గజం బొకనాడు నీటిలోఁ**
**గానక చొచ్చినన్ మొసలి కాటుకు లోఁబడ దోటు భాస్కరా"**

ఎంత బలము గలవాడైనా, తన స్థానము విడిచి వేరొక చోటికి వెళ్ళినప్పుడు, స్థానబలము గల ఒక అల్పుని చేత మోసగింపబడవచ్చు. పూర్వము ఒక ఏనుగు కొలనులో నీరు త్రాగబోయి ఒక మొసలి చేత చిక్కుపడెను గదా! ఆహా! విధి బలీయమనిన ఇదే గదా! భళి భళి దేవా! బాగున్నదయా నీ లీల. నారాయణ... నీ లీల నవరస భరితము... భక్తి ముక్తి దాయకం.

పాల సముద్రంలో త్రికూటమనే పేరుగల అందమైన పర్వతం కలదు. అది పదివేల అడుగుల పొడవు, అంత వెడల్పు, అంతే ఎత్తు కలిగి విరాజిల్లుతోంది. ఆ పర్వతమునకు బంగారము, వెండి, ఇనుముతో నిండిన మూడు శిఖరాలు ఒప్పుతూ ఉన్నాయి. ఆ పర్వతం పక్కభాగం లోను, శిఖరాలలోను రత్నాల వల్ల, ధాతువుల వల్ల చిత్ర చిత్ర వర్ణములు గలవై దిక్కులు, భూమి, ఆకాశము ప్రకాశిస్తూ ఉన్నాయి. ఆ పర్వతముపై మాదీఫలం, లవంగం, పుల్ల మాదీఫలం, మామిడి, జీడి, పనస, రేగు, తుమ్మ, ఖర్జూరం మొదలైనవి చెట్లతో ఎల్లప్పుడూ నిండి కనులవిందు చేస్తున్నాయి. ఆ చెట్ల కొమ్మలు, రెమ్మలు పెనవేసుకొని కళకళలాడుతున్నాయి. మణులతో కూడిన ఇసుక, రత్నపుటిసుకలు, కలిగి ఇసుక తిన్నెలతో కూడిన నదుల ఒడ్డున పగడపు తీగలు కల విచిత్రమైన గొప్ప ఉద్యానవనాలున్నాయి. ఆ కొండలలో మనోహరమైన బంగారు రంగు నీటి సరస్సులున్నాయి. వాటిలో బంగారు కాంతితో కూడిన తెల్లకలువలు, ఎర్రకలువలు, పద్మాలు ఉన్నాయి. వాటి సమీపంలో శకుంత పక్షులు, కలహంసలు, చక్రవాకాలు, కొంగలు, కొక్కెరలు తిరుగుతూ కోలాహలంగా కూతలు కూస్తూ అలరారుతున్నాయి.

ఆ వనంలో అడవి ఏనుగులు కొన్ని ఇతర జంతువులకు చూడటానికి భయంకరంగా ఉన్నాయి. అవి మదించిన శరీరాలతో దిగ్గజాలను కూడా ఓడించగల బలం కలవి. ఆ ఏనుగులు కొండ గుహ ద్వారాలనుండి స్నేహంతో క్రీడలాడుతూ, నీటి మీది నుంచి వచ్చే చల్లని గాలి తాకి పులకరించినవై సరస్సులో స్నానం చేయడం కోసం బయలుదేరినాయి. భయం గొల్పే విధంగా క్రీడిస్తూ, విహరిస్తూ ఉన్న మదపుటేనుగుల గాలి సోకగానే బెదిరిపోయి, వాటి ధాటికి తట్టుకోలేక వనంలోని మృగాలన్నీ చెల్లా చెదరైనాయి.

ఆ ఏనుగుల గుంపులో ఒక గజేంద్రుడు దారి తప్పి కొన్ని ఆడ ఏనుగులు తన్ను సేవిస్తూ రాగా వాటితో కలిసి మరొక మార్గంలో నడిచాడు. ఆ విధంగా గజేంద్రుడు బలంలో మదించినవాడై పలు అడవులలో సంచరిస్తూ అలసిపోయి, దారి తప్పి, దప్పికకు లోనైన మనస్సుతో తన ఆడ ఏనుగులతో కలిసి ముందుకుపోయి పోయి ఒక చోట పెద్ద నీటి మడుగును చూశాడు.

ఆ మడుగులో అప్పుడే వికసించిన పద్మాలు, ఎర్ర కలువలు ఉన్నాయి. వానిలో ఆడుతున్న తుమ్మెదల గుంపులు ఉన్నాయి. తాబేళ్ళ చేత, చేపల చేత, మొసళ్ళ చేత కూడినదై ప్రవేశించడానికి శక్యం కాకుండా ఉంది. తీవ్రంగా ఎగురుతున్న హంసలు, చక్రవాకాలు, కొంగల సంచారంతో కూడియున్న అందమైన మంచినీటి కాసారాన్ని గజేంద్రుడు చూశాడు. ఆ సరోవరం పద్మాల సువాసనలతో నిండిన చల్లని గాలి, శరీరానికి తగిలి పరవశింపగా వికసించిన పద్మాల సువాసన ముక్కులకు సంతృప్తిని కలిగించగా, తరంగాల నుంచి వచ్చే తుంపరుల వరస దప్పిక తీర్చగా ఆ మదపుటేనుగులన్నీ మడుగులోకి ప్రవేశించాయి. నీటితో

తొండాలను నింపుకొని చెక్కిళ్ళపై చల్లుకున్నాయి. గల గల శబ్దాలు చేస్తూ కడుపులు నిండేలా నీళ్ళు తాగాయి.

గజేంద్రుడు ఆ సరోవరంలో ఎదురు లేనివాడై ఈదులాడుతూ తన ఆడ ఏనుగులతో కలిసి విహరించుచున్న సమయాన గజేంద్రుని విశృంఖల విహారంతో సరోవర శోభ అంతా చెల్లా చెదురైంది. గజేంద్రుడు సరస్సులో మైమరచి క్రీడించే సమయంలో ఆ సరస్సునందలి ఒక మొసలి గజేంద్రుని చూసి సంరంభంలో రాహువు సూర్యుని పట్టుకున్న విధంగా పట్టుకుంది. తన కాలిని పట్టుకున్న మొసలిని తన పొడవైన తొండంతో గట్టిగా గజేంద్రుడు కొట్టాడు. ఆ ధాటికి మొసలి నీటిలో మునిగి, అంతలోనే తేరుకుని వేగంగా వచ్చి ఏనుగు ముందరి కాళ్ళను గట్టిగా పట్టుకుని మడుగులోని నీటిలోకి దిగలాగింది. ఏనుగు మొసలిని నీటి ఒడ్డుకు లాగి వజ్రాయుధం వలె భయంకరమైన దంతాగ్రాలతో మొసలి రొమ్ము పగిలేటట్లు గట్టిగా పొడిచాడు. సింహం వలె హుంకరిస్తూ మొసలి తన పాదాలతో కంఠాన్ని తన్నింది. బలంగా ఢీకొని గజేంద్రుని నీళ్ళలో ముంచింది. తాను మునిగింది. ఒడిసి పట్టుకుని బాధించి గజేంద్రుని క్రుంగదీసింది. గజేంద్రుని పాదాలను గట్టిగా పట్టుకుంది. గట్టిగా పట్టుకున్న పాదాన్ని మొసలి బారినుండి విడిపించుకోలేక, దిక్కుతోచక వాడియైన కోరలకు చిక్కి అలసి పోకుండా, విసుగు చెందకుండా రేయింబవళ్ళు అనక వెయ్యేళ్ళు పోరాడాడు. తన బలాన్ని, శత్రు బలాన్ని తర్కించి, దీనిని గెల్వడానికి, పోరాడటానికి తనకు శక్యం కాదని తర్కించి వాపోయింది. నానాటికి తన బలంపై ఆశలు తగ్గిపోగా, గజేంద్రుడు వాపోవుచూ తనను కాపాడే వారే లేరా? ఎవరిని ప్రార్థించేది? ఎవరిని పిలిచేది? ఈ బలశాలియైన మొసలిని అడ్డగించేవారెవరు? దిక్కుమాలిన నావంటి వారి మొర ఆలకించేవారెవ్వరు? ఈశ్వరా! నన్నెవరు కాపాడుతారు? సమస్త ప్రాణుల మేలు కోరేవారు, మంచి మనసు గలవారు, సాటిలేని వ్రతాలు చేసేవారు ఏ పరమేశ్వరుని పాదాలను సేవిస్తారో, అట్టి భగవంతుడు నాకు దిక్కు అగుగాక! సర్వాంతర్యామియై, అందరి దేహస్థితి తెలిసినవాడు, దయాసముద్రుడు, సృష్టికి మూలపురుషుడు, ఆత్మకు ఆధారమైనవాడు, దుఃఖాలను అంతమొందించువాడు, అన్నిటికీ కారణమైనవాడు అయిన అట్టి భగవంతుని నన్ను కాపాడుట కొరకై నమస్కరిస్తున్నాను. ధర్మార్థ కామముల మీద ఆశలు విడిచిన పండితుల పూజలందుకొని, పురుషార్థాన్ని ప్రసాదించే ఆ మహేశ్వరుని, ఆదిపురుషుని, కంటికి కానరానివానిని, పరిపూర్ణుణ్ణి, మహాత్ముణ్ణి, బ్రహ్మస్వరూపుడు, సూక్ష్మస్వరూపుడు అయిన వానిని రక్షించమని త్రికరణ శుద్ధిగా వేడుకుంటున్నాను. ఆర్తత్రాణ పరాయణుడైన ఆ భగవంతుడు నా మొర వినడా? నా బాధ చూడడా? దయ తలచడా? తొందరగా రాడా? ఈ ప్రపంచాన్ని సృష్టించిన వానిని, ప్రపంచానికి దూరంగా ఉన్నవానిని, ప్రపంచానికి అంతరాత్మ యైన వానిని నేను భజిస్తున్నానని పలికి స్వామీ!

**"లావొక్కింతయు లేదు ధైర్యము విలోలంబయ్యెఁ బ్రాణంబులున్**
**ఠావుల్ దప్పెను మూర్ఛవచ్చె, దనువున్ డస్సెన్ శ్రమంబయ్యెడిన్**
**నీవే దప్ప నితః పరంబెఱుగ మన్నింపదగున్ దీనునిన్**
**రావే ఈశ్వరా! కావవే వరదా! సంరక్షింపు భద్రాత్మకా!"**

నా శక్తి అంతా నశించింది. ధైర్యమంతా తగ్గిపోయింది. ప్రాణములు స్థానాలు తప్పాయి. మూర్ఛ వచ్చింది. శరీరం అలసిపోయింది. నిన్ను తప్ప ఇంకెవ్వరినీ నేను ఎరుగను. దిక్కులేనివాణ్ణి నన్ను క్షమించి నన్ను రక్షించు. రావయ్యా! నన్ను కాపాడవయ్యా! శరణు జొచ్చేవారికి కల్పవృక్షం వంటివాడా! నిర్మలమైన మహిమ గలవాడా! రావా! కరుణింపవా! అని పలికి "స రక్షిత రక్షకుడైన ఈశ్వరుండాపన్నుండైన నన్ను రక్షించు గాక! అని పలికి గజేంద్రుడు ఆకాశం వైపు చూస్తూ నిట్టూర్పులు విడిచాడు.

సమస్త విశ్వానికీ ఆధారమైన వైకుంఠంలో స్వామి శేషతల్పంపై కూర్చుని పరాచికాలాడుతున్న సమయంలో పాహి! పాహి! రక్షించుమని మొరపెట్టే గజేంద్రుని కాపాడడానికి పూనుకొని జ్యోతి కదిలితే కాంతి కదిలినట్లు ఆయన వెంట వైకుంఠంలో ఉండే ఆబాల గోపాలము కదిలాయి. భక్తుణ్ణి రక్షించాలనే సంరంభంతో తన చెంతనే ఉన్న లక్ష్మీదేవికి చెప్పక, శంఖ చక్రాలను తీసుకోకుండా, గరుత్మంతుని పిలవక బయలుదేరినాడు. తనకు మాట మాత్రమైనా చెప్పక హడావుడిగా బయలుదేరిన ఆయన వెనక లక్ష్మీదేవి, శంఖం, చక్రం, గరుత్మంతుడు వస్తున్నారు. ఎవరినీ పట్టించుకోకుండా విష్ణువు ఆకాశవీధిలో వచ్చుచుండగా దేవతలందరూ నమస్కరిస్తూ నిలబడ్డారు.

విష్ణువు దేవతల నమస్కారాలను గైకొనక మహావేగంతో పోయి పోయి కరి మకరములు పోరాడుతున్న సరస్సును చూచి, అలసి సొలసిన కరిని చూచి దయా సముద్రుడై, తన చక్రాయుధాన్ని పంపించాడు విష్ణువు. పంపిన చక్రం వేగముగా పోయి మొసలి తలను నరికి గజేంద్రుని కాపాడింది. గజేంద్రునిలో కొత్త ఉత్సాహము కలిగించింది. గజేంద్రుడు మొసలి పట్టును విడిపించుకుని ఉత్సాహంతో కొత్త సౌందర్యంతో ప్రకాశించాడు. అంతట విష్ణువు తన చేతితో గజేంద్రుని మెల్లగా దువ్వుతూ దుఃఖాన్ని పోగొట్టాడు. శ్రీమహావిష్ణువు యొక్క దివ్యమైన హస్త స్పర్శతో గజేంద్రుని శరీర తాపమంతా పోయింది. శ్రీమహావిష్ణువు కర స్పర్శతో గజేంద్రుని అజ్ఞానం నశించి, దివ్య జ్ఞానమును పొందెను. అంతట శ్రీహరి మందస్మిత వదనారవిందుడై గజేంద్రునికి మోక్షాన్ని ప్రసాదించాడు.

**"నారాయణ నారాయణ జయ గోవింద హరే**
**నారాయణ నారాయణ జయ గోపాలహరే ధ్రువపదం**
**కరుణా పారావార వరుణాలయ గంభీర నారాయణ**
**నారాయణ నారాయణ జయ గోవింద హరే**
**నారాయణ నారాయణ జయ గోపాలహరే ధ్రువపదం"**




15వ భాగము

# తిరుమల శ్రీ వేంకటేశ్వరుని దిశానిర్దేశం స్వామి వారి దివ్య లీలలు

**తెలంగాణలో మరో తిరుపతిగ తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయుటకై తిరుమల శ్రీ వేంకటేశ్వరుని లీలల ధారావాహికం**

శ్రీ వేంకటేశ్వర పాదసేవకుడు
**— గోవింద దాసు**
**(పుల్లగూర్ల సాయిరెడ్డి)**

దిశా నిర్దేశం : సిద్ధిపేటకు 7 కి.మీ. దూరములో ఉన్న చిన్నగుండవెల్లి అనే మా స్వగ్రామంలోని మా తోటబావి వద్ద తిరుమల శ్రీవేంకటేశ్వరుడు తన 'హరినామ క్షేత్రము'ను ఏర్పాటు చేయదలచాడు. కనీసం వెండి వాకిలి వరకైనా తిరుమల ఆలయ ప్రతిరూపమును నిర్మించమన్నారు. తాను స్వయంగా ఈ క్షేత్రంలో స్థిరనివాసమేర్పరచుకొని భక్తులను అనుగ్రహించుదునన్నారు. మరియు వివిధ భక్త బృందాలచే వంతుల వారిగా అఖండ హరినామ స్మరణ జరగాలని సూచించారు. స్వామివారిని తిరుమల నుండి ఆహ్వానించుటకు తగిన యోగ్యత సాధించుటకు వీలుగా కఠిన సాధనతో పాటు భాగవతుల ఆశీర్వాదమును పొందమన్నారు. తన కలల ద్వార ఏప్రిల్ 2000 నుండి శిక్షణ ఇచ్చుట ప్రారంభించి ఏప్రిల్ 2022లో అసలు విషయం తెలిపారు. మరియు ఈ కార్యక్రమములో భక్తులను భాగస్వాములుగ చేయుటకు వీలుగ స్వామివారు ప్రసాదించిన అనుభూతులను ఏప్రిల్ 2023 నుండి ప్రచురించమన్నారు. అందులో భాగంగా ప్రస్తుతపు 15 వ భాగపు లీలల ప్రచురణ. (ఫిబ్రవరి-2005 -ఏప్రిల్ 2005)



## మా ఇంటి నిర్మాణములో స్వామి చూపిన లీల

హైదరాబాద్ లోని హబ్సిగూడ, కాకతీయనగర్ కాలనీలో మా ఇంటి కన్స్ట్రక్షన్ జరుగుతోంది. తేది 18-02-2005 నాడు దశమి, మంచిరోజని భావించి ఇంటి మెయిన్ డోర్ చౌకట్ ను నిలబెట్టాము. ఈ చౌకట్ పైన మధ్యభాగంలో పద్మంలో తిరునామమును పెట్టి ప్రక్కలకు శంఖు చక్రాలను చెక్కించాము. దీనికి పూజ చేసి నిలబెట్టే సమయాన నేను సాక్షాత్ శ్రీవేంకటేశ్వరుని పాదాలను మాత్రమే దర్శించాను. పూజలో నేను వేసే ప్రతి పూవు ఆయన పాదాలపై పడుచున్నట్లు భావన కలిగింది. ఈ ఇంటిలో నాతోపాటు మీరు ఉండాలి, నా తనివితీర మీ సేవ చేసుకోవాలని ప్రార్థించాను. ఇక నా భార్య సురేఖ మాత్రము పూజ చేసేటప్పుడు శ్రీకృష్ణ తులాభారము చిత్రములో, కృష్ణుని తులాభారము చేయించుటకు, కృష్ణుడే ఒక ముసలివాని వేషం వేసుకుని సత్యభామ వద్దకు వెళతాడు. ఆ ముసలివాడు తిరునామాలతో కనబడ్డాడట. ఆమె ఎంతో ఆనందించింది. కనుల వెంట ఆనంద బాష్పాలు రాల్చింది. అంటే స్వామివారు ఆమెను స్వయంగా అనుగ్రహించారన్నమాట. మరియు స్వామివారే మాకు ఈ ఇంటిని ప్రసాదించి లీలలను జరుపుచున్నారని భావం.

ఈ విధంగా మా ఇంటి నిర్మాణపు ప్రతి సన్నివేశంలో స్వామివారి లీలలను అడుగడుగున కన్నాము.


భూ సమస్య : మియాపూర్ ఆస్తి గొడవలు తారాస్థాయికి చేరాయి. నేను స్వామి వారిని రక్షించుమని ప్రార్థించినప్పటికీ లాభం లేకపోయింది. ఈ గొడవలలో ప్రతి మలుపు స్వామివారు సూచించినట్లుగానే జరిగింది. సమస్యలకు భయపడక ముందుకు వెళ్ళమని

స్వామివారు చెప్పుచున్నప్పటికీ నేను భయపడిపోయాను. దీనిని సూచించే కల ఒకటి కన్నాను.

**26-02-05 కల :** ఈ కలలో రెండు సన్నివేశాలను చూచాను. మొదటి దానిలో అప్పుడు నా వయస్సు 20 సంవత్సరాల లోపు. మేము ఊరిలో మా తోట బావి వద్ద వ్యవసాయము చేస్తున్నాము. ఆ సమయాన నేను మా వ్యవసాయ క్షేత్రానికి వెళ్ళాను. మా తోటలను చూచాను. కాని అక్కడ పనివారు ఎవ్వరూ పని చేయక ఒక రూంలో ఏదో మాట్లాడుకొనుచున్నారు. తరవాత నేను, మా పెద్దనాన్న కీ.శే. పుల్లగూర్ల ఉమ్మారెడ్డి గారి వ్యవసాయ క్షేత్రము వద్దకు వెళ్ళాను. పనివారిని కావాలంటే తీసుకెళ్ళమని మా పెద్దనాన్న అన్నాడు (ఈయన 1993లో చనిపోయారు). ఇంతే కల. దీనర్థం తెలియదు. బహుశా దీనర్థం హరినామ క్షేత్రం సాధించే మార్గంలో నేను పయనించుట లేదు కాబట్టి మరింత ఆలస్యమగునని కావచ్చును. లేదా హరినామ క్షేత్రం సాధించుటకు నా ఒక్కడి శక్తి సరిపోదు, మా పూర్వీకుల శక్తి అవసరమని కావచ్చును.

రెండవ సీనులో నేను ఒక నదిలో పవిత్ర స్నానానికని వెళ్ళాను. ఆ నదిలో చాలామంది భక్తులు స్నానం చేస్తున్నారు. నేను నదిలోకి దిగి తక్కువ నీరు ఉన్నవైపు నుండి ఎక్కువ నీరు ఉన్న వైపుకు ఈత కొట్టుకుంటూ వెళ్ళాను. మధ్యలో నీటి అల వచ్చింది. అయినా లెక్కచేయక ముందుకు పోయాను. పిదప తిరిగి వెనుకకు వస్తున్నాను. ఇక్కడ నీటిలోతు ఎక్కువ ఉండవచ్చనే అనుమానంతో భయముచే తడబడిపోయాను. ఇంతలో నా ప్రక్కన 12 సంవత్సరాల వయసున్న నా రెండవ కుమారుడు చి॥ అరవిందు రెడ్డి నిలబడి డాడీ ఇక్కడ లోతు ఇంతేనన్నాడు. అప్పుడు నీరు వాని గదువ క్రింది వరకు మాత్రమే ఉన్నది. దానిని చూచి ధైర్యముతో నిలబడ్డాను. ఆ నీరు తెల్లగా మురుగు లేకుండా పాలవలె ఉన్నది. కల చెదిరింది.

దీని అర్థం ఆ సమయాన నాకు తెలియలేదు. కాని నిజమైన అర్థం ఇలా ఉంది. నీవు ఈ సమస్యల్లో ఇరుక్కున్నావని భయపడకు. అవి నిన్ను ఏమీ చేయలేవు. నీరు స్వచ్ఛంగా మురికి లేకుండా ఉన్నది కాబట్టి ఈ సమస్య భగవంతుడు ఏదో ఆశించి




నా చిన్న కుమారుడు లోతు లేదని సూచించుట

కల్పించిందే అని భావించమన్నాడు. ధైర్యంతో ముందుకు సాగమన్నాడు.

## మా ఇంటి గృహప్రవేశానికి పెద్దవారు వస్తారని సూచించుట

**ఇంటి గురించి :** తిరుమల శ్రీవేంకటేశ్వరుడు ప్రతిక్షణం నా మానసిక స్థితికి అనుగుణంగా లీలలను ప్రసాదిస్తాడు. నేను ఇబ్బందుల్లో ఉన్నప్పుడు ప్రోత్సహించే విధంగా, మరికొన్ని భవిష్యత్తును తెలియజేసే విధంగా లీలలను కల్పించేవాడు. రాబోవు మా గృహప్రవేశానికి పెద్ద వ్యక్తులు రాగలరని ఈ క్రింది లీలను చూపుచు నన్ను ప్రోత్సహించాడు.

నా ఇంజనీరింగ్ విద్య పూర్తగు సమయాన బహుశా నేను లీడర్ కావాలనే ఉద్దేశ్యముతో శ్రీమాన్ నారా చంద్రబాబు నాయుడు గారిని కలిశాను. కాని తరువాత ఆ రంగము నచ్చక వ్యాపారమును ఎంచుకున్నాను. స్వామివారు ఇప్పుడు ఈ సన్నివేశాన్ని ఎంచుకున్నారు.

**13-03-05 కల :** ఈ కలలో నేను ఒక ఇంటి గృహ ప్రవేశము లాంటి ఫంక్షన్ లో ఉన్నాను. మాజీ ముఖ్యమంత్రి శ్రీమాన్ చంద్రబాబు నాయుడు గారు మారుతి 800 కారులో స్వయంగా డ్రైవింగ్ చేసుకుంటూ ఒక్కరే వచ్చారు. ఆయన నన్ను పేరుపెట్టి పిలిచి కలిశారు. నీవు నావద్దకు వచ్చావు కదా, నాకు నీ పేరు గుర్తుంది అని అన్నారు. నేను ప్రస్తుతము 3వ పర్యాయంగా 7 కోట్ల జపసమర్పణ గురించి ఆయనతో చెప్పాను. కొన్ని జప పుస్తకాలు ఆయనకు ఇచ్చాను. ఇంతలో ఆయన వేరే విషయాలు మాట్లాడారు. మధ్య మధ్యలో నేను మళ్ళీ ఈ విషయము లోనికి లాగాను. తరువాత కొంతసేపటికి ఆయన వెళ్ళిపోయారు. కల చెదిరింది.

దీనర్థం మా గృహప్రవేశానికి పెద్దవారు వస్తారని, అది శ్రీవారి ఫంక్షన్ లాగా ఉండునని ఒక అర్థం. నేను సదా స్వామివారి చింతలోనే కాలం గడుపుచున్నానని, గృహప్రవేశం లాంటి ముఖ్యమైన వ్యక్తిగత ఫంక్షన్ లలో కూడా స్వామి సేవా చింతనను మరువలేని స్థితి కలిగిందని మరోరకంగా సూచించాడు.

## నమో వేంకటేశాయ పత్రికకు వెంటనే శ్రీకారం చుట్టుమనుట

**పత్రిక గురించి :** 2003 సంవత్సరంలో స్వామివారు ఒక మాసపత్రికను ప్రారంభించమని ఆదేశించారు. ఆ సమయాన 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేస్తున్నాము, కాబట్టి 2005లో ప్రారంభించుదామనుకున్నాను. ప్రతిక ఎలా మొదలుపెట్టాలో తెలియకపోయినప్పటికీ, స్వామివారు దారి చూపుదురని భావించి 'నమో వేంకటేశాయ' అనే టైటిల్ ను పొంది, డిక్లరేషన్ ను కూడా సమర్పించి సిద్ధంగా ఉన్నాను. పత్రిక ప్రారంభించుటకు సహాయము చేయుదుమన్నవారు జారుకున్నారు. నిజానికి నేను జనవరి-2005 నుండి పత్రికను ప్రారంభించుటకు అన్ని అనుమతులు పొంది సిద్ధంగా ఉన్నాను. కాని ఎలా ముందుకు వెళ్ళాలో తెలియలేదు. ప్రచురించుటకు నావద్ద వ్యాసాలు కాని, వాటిని వ్రాసే రచయితలు కాని లేరు. ఇలా ఆలోచిస్తూ ఇంకా 3 నెలలు గడిచినవి. స్వామివారు ఆజ్ఞ ఇచ్చినప్పటి నుండి మొత్తం 16 నెలలు గడిచినవి. బాధపడ్డాను, ఇది స్వామివారి ఆజ్ఞ కాబట్టి, ఎలాగైనా ప్రారంభించాలనే పట్టుదలతో ఉన్నాను. కాని ఎలా ప్రారంభించాలో తెలియలేదు. పైగా స్వామివారు "నీవు క్రింద పడినా సరే ప్రారంభించు"మని చెప్పినట్లు భావించాను. ఇంతకు ముందు పత్రికలు ప్రచురించిన చాలామందిని సంప్రదించాను. వారు "ఈ ఆధ్యాత్మిక పత్రికలు నడవడం లేదు. ఒక ఆరు నెలల తరువాత మూతపడుతున్నా"యన్నారు. చాలా ధైర్యము, డబ్బులు కావాలన్నారు. ఈ విషయంలో నేను ఆలోచనలో పడ్డాను. ఏమి చేయాలో తోచలేదు. చివరికి 04-03-05 రోజున నా భార్య సురేఖకు ఈ విషయం చెప్పాను. ఆమె ఈ పత్రికను నడుపుదాము, మన సంసార బంధములు తీరి, మన వయస్సు 60 సంవత్సరములు నిండిన తరువాత చేద్దామన్నది. అప్పుడు తీయవలసి ఉంటే ఇంత తొందరగా స్వామివారు ఎందుకు ఆజ్ఞ ఇచ్చారని నేనన్నాను. ఆమె కొంత ఆలోచించి, వచ్చే సం॥లో... లేదా మా ఇల్లు గృహ ప్రవేశం చేసిన తరువాత... లేదా మూడవ జప సమర్పణ సమయంలో... (అంటే సెప్టెంబర్ 2005) పత్రిక ప్రచురించుదామన్నది.


సురేఖ ఈ విధంగా మాట్లాడేసరికి నేను బాగా ఆలోచించాను. ఈ పత్రికను ప్రారంభించమని చెప్పినవారు ఆయనే. కాబట్టి దీనిని ఎప్పుడు ప్రారంభించాలనే విషయమును మనం తర్కించకుండా, స్వామివారికే వదిలిపెడితే బాగుండునని నేనన్నాను. తరువాత మేమిద్దరము ఈ విషయం స్వామివారికి వదిలివేశాము. అంటే ఈ పత్రికను ప్రారంభించు తేదీని స్వామివారు స్వయంగా మాకు చెప్పినప్పుడు, ప్రారంభిద్దామని నిర్ణయించుకున్నాము. ఇప్పుడు బాల్ స్వామివారి కోర్టులో ఉంది కాబట్టి, స్వామిమాటను వినలేదనే బాధ నుండి ఉపశమనం లభించినట్లైంది. ఎంతో సంతోషించాను. ఈ నిర్ణయం ప్రకారం స్వామివారిని ప్రారంభ తేదీని చెప్పమని ప్రార్థించాను.

తేది 11-03-2005 నాడు ఉదయం 10.30 గంటలకు నేను నిర్మించిన ఒక ఇల్లు రిజిస్ట్రేషన్ కార్యక్రమము ఉండగా అది నేను మార్గమధ్యంలో ఉండగా క్యాన్సిల్ అయింది. కాబట్టి సమయం దొరికింది. తిరుమలగిరిలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి ఆలయానికి వెళ్ళి ఆంజనేయుణ్ణి, ఆ వెనుకనే ఉన్న పరమశివుణ్ణి ప్రార్థించాను. హే! ప్రభూ! వేంకటేశ్వరా! మీరు 'నమో వేంకటేశాయ' అనే పత్రికను ప్రారంభించమన్నారు. కాని దానిని

ఎప్పుడు ప్రారంభించాలనే విషయమును చెప్పలేదు. దయచేసి తేదీని తెలుపుమని వేడుకున్నాను. స్వామివారు ఇంత తొందరగా చెప్తుదురనుకోలేదు. కాని ఇదే రోజు రాత్రి ఒక చక్కని లీల ద్వారా వెంటనే ప్రారంభించమని ఈవిధంగా సూచించారు.

12-03-05 కల : ఈ కల నాకు ఉదయం 5 నుండి 5.30 గంటల మధ్యన వచ్చింది. అది ఒక పెద్ద మందిరం అందులోని గర్భగుడి చతురస్రాకారపు హాలు. అందులో దాదాపు 4 అడుగుల శివుడు ధ్యాన ముద్రలో, హాలు మధ్యలో విగ్రహ రూపంలో ఉన్నారు. ఆయనకు 10 అడుగుల ముందు ఒక పెద్ద పొడవాటి కిచెన్ ప్లాట్ఫారమ్ లాగా, 2.5 అడుగుల ఎత్తుగల గోడ ఉంది. ఆ గోడపైన రెండున్నర అడుగుల వెడల్పుతో నల్లని బండ ప్లాట్ ఫామ్ లాగా ఏర్పాటు చేయబడ్డది. భక్తులు స్వామివారిని చూచుకుంటూ ఈ బండపై వ్రాసుకునే విధంగా ఉంది. ఆ మందిరములో పూజలకంటే ఎక్కువగా అక్షరాభ్యాసము చేస్తారట. ఇది అక్షరాభ్యాసానికై వెలసిన ప్రత్యేక మందిరమట. నేను తిరునామం ధరించి, పంచె, కండువాతో తిరుపతిలో స్వామివారి దర్శనమునకు పోవునట్లు ఆలయం లోనికి పోయాను. ఆ దారి తిరుమలలో శ్రీవారి దర్శనమునకు పోవు దారి వలె, మార్బుల్ ఫ్లోరింగ్ కలిగి ఒకవైపు జాలితో ఉంది. నేను తిరుమల శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థం వెళ్ళుచున్నాననే భావనతోనే లోనికి వెళ్ళాను. నాతోపాటు ఒక జంట మూడు నాలుగు సంవత్సరాల వయస్సున్న వారి కుమారుడిని ఎత్తుకొని స్వామివారి ముందు అక్షరాభ్యాసానికని పోవుచున్నారు. నేను కూడా ఇదే పనికి అంటే అక్షరాభ్యాసానికని పోవుచున్నాను. ఈ దంపతులు అక్షరాభ్యాసానికై వెళ్ళుచున్నామని నాతో చెప్పలేదు కాని నా మనస్సులో ఈ భావాలు చాలా స్పష్టంగా వచ్చాయి. కల చెదిరింది.

తెల్లవారి ఈ కలను విశ్లేషించాను. స్వామివారు నన్ను మాసపత్రికను వెంటనే ప్రారంభించమని ఆజ్ఞాపించారని భావించాను. కాని నా వద్ద ఎలాంటి ఆర్టికల్స్ కాని, రచయితలు కాని లేనందున ఎలా ముందుకు వెళ్ళాలో తెలియక బాధపడ్డాను. వీటిని సంపాదించే ప్రయత్నాలు చేశాను.




**నమోవేంకటేశాయ పత్రికకు వెంటనే శ్రీకారము చుట్టుమనుట.**

## రచయితలను సమకూర్చుకొనుట

తేది 11,12,13 మార్చి 2005 హోలీ మరియు ఇతర సెలవులతో భక్తులు అధిక సంఖ్యలో రావడం వలన టిటిడి వారు ప్రప్రథమంగా మహాలఘు దర్శనాన్ని ప్రారంభించారు. ఒకరోజు 70 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. ఇది పేపర్లలో వచ్చిన వార్త. కానీ తిరుపతిలో జనరద్దీ తక్కువగా ఉన్నది. వచ్చి నన్ను తనివితీర దర్శించుకోవా? అని స్వామివారు నాకు ఒక ఆహ్వానాన్ని అందించినట్లు ఒక రాత్రి అనుభూతి పొందాను. ఒకరకంగా ఈ లీలను నమ్మాలా? వద్దా? అని అనుమానించాను. తరువాత ఈ అనుభూతి ఈ విధంగా ఫలించింది.

కీ.శే. శ్రీ వేంకటశర్మ అనే ఒక వ్యక్తి టిటిడి ధర్మప్రచార పరిషత్తులో పని చేసేవాడు. పాలకమండలితో సన్నిహితంగా ఉండేవాడు. నాకు ఆయన పరిచయం. ఆయన మంచి స్వామి భక్తుడు. రచయితల వేటలో ఉన్నప్పుడు ఈయన గుర్తుకొచ్చాడు. వెంటనే తేది 22-03-05 న ఆయనతో మాట్లాడాను. నేను 'నమో వేంకటేశాయ' అనే మాసపత్రికను ప్రారంభించాలనుకుంటున్నాను, కాని రచయితలు కాని అందులో ఏయే అంశాలు చేర్చాలి అనే విషయం కాని తెలియదు. దయచేసి సహాయము చేయమన్నాను. అందులకు ఆయన కూడా ఈ విషయంలో తనకు ఏమీ తెలియదన్నారు. కాని మార్చి 30, 31 తేదీలలో తిరుపతిలో టిటిడి వారు 'శ్రీవేంకటేశ్వర వైభవం' అనే అంశంపై ఒక జాతీయ సదస్సు ఏర్పాటు చేస్తున్నారని, ఈ సదస్సుకు చాలామంది కవులు, రచయితలు, మేధావులు దేశం నలుమూలల నుంచి వస్తున్నారని, కావున నేను కూడా ఈ సదస్సుకు వచ్చినచో ఉపయోగపడునన్నారు. పైగా నాకు టిటిడి నుండి ఒక ఆహ్వానాన్ని కూడా పంపారు. పి.సాయిరెడ్డి, శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్ అనే పేరుతో ఆహ్వానం అందింది. అది నాకు 24-03-2005 నాడు అందింది.

ఈ ఆహ్వానాన్ని చూచి ఒకప్రక్క సంతోషించాను. మరోప్రక్క చింతించాను. నాకు శ్రీవేంకటేశ్వరుని గురించి ఏమీ తెలియదు. చెప్పటానికి అసలే రాదు. అలాంటి నేను స్వామి వైభవంలో ఏమి మాట్లాడగలను? చివరికి నేను రచయితల అడ్రసులను సేకరించుటకే అక్కడికి వెళ్ళుచున్నాను తప్ప స్వామితత్వం చెప్పడానికి కాదని అనుకున్నాను. చివరికి ఎందుకైనా మంచిదని నాకు తెలిసిన కీ.శే. శ్రీ వారణాసి వేంకటేశ్వర శాస్త్రి గారిచే స్వామిపైన ఒక వ్యాసాన్ని వ్రాయించుకుని నాలుగు సార్లు చదువుకుని సిద్ధపడ్డాను.

అనుకున్నట్లుగ తేది 30-03-2005 నాడు తిరుపతిలోని శ్రీవేంకటేశ్వర వైభవం అనే జాతీయ సదస్సుకు హాజరైనాను. ఆ సదస్సుకు వచ్చిన పెద్దల్ని ఎందరినో చూచాను. నా మనస్సు సంతోషంతో నిండిపోయింది. శ్రీవేంకటేశ్వరుని గురించి రకరకాల విషయాలను, వాదనలను విన్నాను. నా జీవితంలో ఇన్ని విషయాలు నా ప్రభు గురించి వినడం ఇదే మొదటిసారి. ఒక్కొక్కసారి నా ఒళ్ళు కంపించేది. ఆ రెండు రోజులు నాకు కాలము తెలియలేదు. అక్కడి కొంతమందితో పరిచయమేర్పరచుకున్నాను. వారి అడ్రసులను వ్రాసుకున్నాను. తరువాత సదస్సులో పాల్గొన్న అందరికీ ఆ సదస్సుకు సంబంధించిన, ఆ సదస్సులో పాల్గొన్నవారు సమర్పించిన వ్యాసములను అందించారు. నాకు కూడా అందించారు. ఈ విధంగా ఈ జాతీయ సదస్సు ఉపయోగపడ్డది.

ఆ తరువాత తిరుపతిలోని సప్తగిరి ఆఫీసుకు వెళ్ళాను. ఎడిటర్ కీ.శే. శ్రీరామ్మూర్తి గారి నడిగి రచయితల అడ్రసులను మరికొన్నింటిని సేకరించాను. పత్రిక ఎలా నడపాలి అనే విషయమై మంచి సలహా ఇచ్చారు. మరియు దీనిని చాలా సంవత్సరాలు నడపవలసిందని కూడా సలహా ఇచ్చారు.

తేది 31-03-2005 నాడు జాతీయ సదస్సుకు హాజరైన అందరికీ స్వామి వారి దర్శనాన్ని టిటిడి వారు కల్పించారు. కాని నేను రచయితల వేటలో ఉండుట వలన ఈ అవకాశమును కోల్పోయాను. చివరికి ఏదోవిధంగా ఆ రాత్రి 7.30 గంటలకు సెల్లార్ టికెట్ పై వెళ్ళి స్వామివారిని దర్శించుకున్నాను. చిత్రమేమిటంటే నేను స్వామివారిని దర్శనం చేస్తున్న సమయాన ఏ ఒక్కరూ నన్ను త్రోసివేయలేదు. జనాలు లేరు. దాదాపు 10 నిముషాలు అక్కడ నిలబడ్డాను. స్వామివారిని ఆయన పాదాల నుండి తల వరకు అణువణువు నిశితంగా దర్శించుకున్నాను. చాలా తృప్తి చెందాను. నేను అక్కడ అదృశ్యంగా ఉన్నానా? అనిపించింది. తెల్లవారి శుక్రవారం అభిషేకం కొరకు గుడిని నీటితో శుభ్రం చేస్తున్నారు. నేను కూడా టిటిడి వారితో కలిసి గుడిని కడిగాను. కాని ఇంతలో ఒకరు గుర్తుపట్టి బయటివారు కడగకూడదని చెప్పి బయటికి పంపారు. మరునాడు కూడా ఉదయం మరోసారి దర్శించుకున్నాను. రద్దీ చాలా తక్కువగా ఉంది. 50 రూపాయల టికెట్ తీసుకుంటే వెంటనే దర్శనం లభించింది.

ఈవిధంగా తేది 20-03-2005 నాటి రాత్రి అనుభూతికి అనుగుణంగా నాకు ఒక ఆహ్వానం పంపి తన దివ్యదర్శనమును తృప్తిగా ప్రసాదించారు. ఆయన చెప్పినట్లు జనరద్దీ తక్కువ వున్నది. మరోప్రక్క పత్రికకు సంబంధించిన రచయితల అడ్రసులను సేకరించగలిగాను.

## సురేఖను ఆనందపరచుట


శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ మరో లీలను చూపెట్టాడు. దీనిని నా భార్య సురేఖకు కల్పించాడు. ఈ లీల ఈవిధంగా ఉంది. నా భార్య సురేఖ, నేను ఇంట్లో లేనప్పుడు మాత్రమే పూజ రూములోనికి వెళ్ళి స్వామివారిని పూజించేది. ఈరోజు అనగా 01-04-

2005 ఉదయం 6.30 గంటలకు పూజ గదిలోనికి వెళ్ళి పూజ చేస్తున్నదట. అప్పుడామె ఒక వింతైన దృశ్యమును చూచింది. హైదరాబాదులో మా ఫ్లాట్ లోని పూజగదిలో ఉన్న ఆమెకు తిరుమల శ్రీవారి ఆలయం కనబడ్డదట. ఆ ఆలయంలో నన్ను చూచిందట. నేను స్వామివారిని దర్శించుకుని జయవిజయులను దాటి రెండు పెద్ద గంటల దగ్గర నుండి నడుచుకుంటూ బయటికి వస్తున్నట్లు కనిపించానట. నేను పంచె మరియు సెల్ల కప్పుకుని ఉన్నానట. ఈ చిత్రమును చూచి సురేఖ ఆశ్చర్యపోయింది. నిజంగా నేను దాదాపు అదే సమయంలో స్వామివారిని దర్శించి అవే బట్టలతో వచ్చాను. శ్రీవేంకటేశ్వరుడు ఈ విధమైన లీలను కల్పించి సురేఖను ఆనందపరచాడు.

## పత్రిక ప్రారంభమునకు శుభాకాంక్షలు తెలుపుట

నేను జాతీయ సదస్సు నుండి 02-4-2005 నాడు తిరిగి హైదరాబాద్ వచ్చాను. ఆ రాత్రి ఒక కల కన్నాను.

**03-04-2005 కల:** నేను ఎస్.వి.డైరీ ఫాంలో పూజ దుస్తులతో ఉన్నాను. నాతోపాటు చాలామంది భక్తులు, ఉద్యోగులు ఉన్నారు. ఇంతలో టిటిడి క్రొత్త ఈవో శ్రీ శర్మ గారు, ఆయనతో పాటు డైరీఫాం సూపరింటెండెంట్ శ్రీమాన్ హరినాథ్ రెడ్డి గారు వచ్చారు. టిటిడి ఈవోను చూచి గౌరవంతో భక్తులు, ఉద్యోగులు ప్రక్కకు కనపడకుండా వెళ్ళారు. నేను ఈఓ గారి




టిటిడి ఈఓ గారు చేతి ముద్రవేసి ప్రారంభించుట.

దగ్గరకు వెళ్ళి ఏదో ఒక దానిని ప్రారంభించమని అన్నాను. ఆ ప్రారంభోత్సవములో భాగంగా అక్కడ ఉన్న ఒక గోడకు తన చేత్తో కొట్టమని అన్నాను. ఆయన అదేవిధంగా కుంకుమ కలిపిన నీటిలో తన అరచేతిని ముంచి కొట్టారు. ఇది చూచి అక్కడున్న భక్తులు కరతాళ ధ్వనులు చేశారు. ఇంతలో నేను ఆ గోడ చివరకు వెళ్ళి లోనకు చూచాను. లోన ఒక చిన్న గోతిలాంటి గుంటలో ఒక గురిగిలోని పాలు పొంగి ఉన్నవి. సంక్రాంతి రోజున గురుగులలో పాలను పొంగించినట్లు పాలు పొంగి ఉన్నవి. ఆ పాలు నా వైపుకు పొంగి ఉన్నవి. కల చెదిరింది.

బహుశా నమో వేంకటేశాయ అనే పత్రికకు స్వామివారు శుభాకాంక్షలు తెలిపారు. ప్రారంభించమన్నారు. పత్రిక చక్కగా జరుగునని సూచించారు. కాని ఆ సమయాన దీని అర్థమును తెలుసుకోలేదు.

## రచయితలకు ఉత్తరాలు వ్రాయుట

ఆ తరువాత నేను సేకరించిన ప్రతి రచయితకు పత్రిక నడుపుటలో నాకు సహకరించుమని ఉత్తరములు వ్రాశాను. శ్రీవేంకటేశ్వర మహామంత్ర పీఠం వారి ఆధ్వర్యంలో, తిరుమల శ్రీవేంకటేశ్వరుని మహాత్మ్యాలను, భక్తులందరికీ తెలియచేయాలనే సంకల్పముతో, భక్తులలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించుటకై, మంచి ఆధ్యాత్మిక రచనలతో పాటు, భక్తుల అనుభవాలను కూడా తెలియజేసే విధంగా ఈ పత్రిక ఉండగలదు. కావున తమరు ఈ పత్రికకు తగిన వ్యాసములను పంపించగలరని అందరినీ ప్రార్థించాను. పత్రిక గురించి వారి ఉద్దేశాలను కూడా తెలుపమన్నాను. దీని ద్వారా చాలామంది రచయితలు వారి వారి రచనలను పంపారు. కొందరు నేను చేయుచున్న కార్యక్రమము మంచిదని కొనియాడారు. మరికొందరు 'నమోవేంకటేశాయ' పేరు చూడగనే ఆనందించామని, సాక్షాత్ స్వామి నుండే ఈ ఉత్తరము వచ్చినట్లు అనుభూతి చెందామన్నారు. మొత్తం మీద 30-35 వ్యాసాలను సంపాదించాను. తిరుపతి నుండి కీ.శే. కె.వి.రాఘవాచారి గారు మమ్మల్ని చాలా ప్రోత్సహించారు. ఇది స్వామివారి ఆదేశం అని దేనికీ భయపడక ముందుకు పొమ్మన్నారు. ఒక్కొక్కరు ఒక్కొక్క విధంగా అభినందించారు.

## పత్రిక సంకల్పాన్ని విరమించుట

ఈ రచనలను ఒక ఫైలులో పెట్టాను. తరువాత ఏమి చేయాలో తెలియలేదు. మళ్ళీ మొదటికే వచ్చాను. పత్రిక నడపగలనా? అనే అనుమానం వచ్చింది. తెలిసిన కొందరి అభిప్రాయము సేకరించాను. వారు వద్దన్నారు. ఈ రచనలు ఒకటి రెండు మాసములకు సరిపోవచ్చు. తరువాత ఏం చేయాలని ఆలోచించాను. తరువాత పత్రిక నడపకుంటే పరువు పోతుందనుకున్నాను. ఇంట్లో నా భార్య కూడా పత్రిక మన వల్లకాదు వద్దంది. మరి కొందరు నీవు జపసమర్పణ కార్యక్రమమును కొనసాగించు, ఈ పత్రికను వదిలిపెట్టమన్నారు. చివరికి నేను కూడా వద్దనుకున్నాను. కాని ఎవరైనా ఒకరిద్దరు వ్యక్తులు వచ్చి వారు ఈ పత్రికను నడుపుదుమన్నచో సహకరించుదునని అనుకున్నాను. స్వామివారిని క్షమించమని వేడుకున్నాను. తరువాత రోజులలో ఈ పత్రిక గురించి పూర్తిగా మరచిపోయాను. నా సొంత పనులలో నిమగ్నమై ఆస్తులను పెంచుకొన ప్రయత్నించుచు జీవించాను. దీని పరిణామం తరువాత అనుభవించాను.

నిజానికి నేను శ్రీవేంకటేశ్వరస్వామివారి ఒక మాసపత్రికను ప్రారంభించుదునని ఏ రోజూ భావించలేదు. అంతటి యోగ్యత కూడా నాలో లేదు. శ్రీవేంకటేశ్వరుడు ఇంతవరకు నాకు ప్రసాదించిన అన్ని సేవలలోకెల్ల ఈ పత్రిక విషయమై నన్ను ఒప్పించుటకు చాలా కష్టపడ్డాడు. పత్రిక నడుపుటలో ధనముతో పాటు, నా వ్యాపారానికి సమయము దొరకదని భావించాను. కాని అన్ని ఆటంకాలను ఒక్కొక్కటి త్రుంచి వేసి చివరికి నేను ఈ పత్రికను ఇష్టంతో ప్రారంభించే విధంగా చేశాడు. ఈ లీలలను తరువాత చూద్దాం.

శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహం లభించినప్పటి నుండి, అంటే 2000 సంవత్సరం నుండి అంచెలంచెలుగా బాహ్య ప్రపంచం నుండి దూరమైపోయాను. నాకు శ్రీవేంకటేశ్వరుడే తోడు, నీడ, బలం అనే స్థితికి వచ్చాను. నిజం చెప్పాలంటే స్వామివారు చూపించే అనుభూతుల బలంతోనే ఈ స్థితిలో ఉన్నాను. వరుసగా 10 రోజులు ఆయన లీలలను చూడక ఉండలేని స్థితి కలిగింది. స్వామి కరుణిస్తున్నాడు కాబట్టి, దీనిని ఆసరాగా తీసుకొని మరిన్ని లీలలను చూడాలనే కోరిక బలంగా ఉండేది. స్వామిని చూడడానికి ఏ చిన్న అంశాన్నీ వదిలేవాణ్ణి కాదు. అందులో కొన్ని ఇలా ఉన్నవి.

1. తిరుపతిలో తేది 21-09-2002 నాడు శ్రీవేంకటేశ్వర దివ్య మహామంత్ర స్తూపాన్ని నిర్మించిన తరువాత స్వామివారిని చూడాలనే కోరిక కలిగింది. వెంటనే "మీరు ఈ స్తూపాన్ని మనస్ఫూర్తిగా స్వీకరించినట్లయితే ఈరోజు నాకు కనబడమ"ని ప్రార్థించాను. దీనికనుగుణంగా స్వామివారు కరుణించారు. తృప్తి చెందాను. ఆనాడు స్తూప ప్రారంభోత్సవ దశలో శ్రీశ్రీశ్రీ జయేంద్ర సరస్వతి స్వామివారు బహూకరించిన మెమెంటోలో ఉన్నట్లు స్వామివారిని దర్శించాను.

2. తేది 14-06-2003 నాడు ప్రథమ 7 కోట్ల జప సమర్పణను కావించాను. దీనిని స్వీకరించినట్లయితే మీ బంగారు పాదాలను చూపమనే బలమైన కోరిక కలిగింది. దీనికనుగుణంగా తొలి ఏకాదశి – 2003 నాడు నన్ను ఒక తూగుటుయ్యాల పైన పడుకోబెట్టి, ఊపుచు, తన బంగారు పాదములను చూపెట్టాడు. ఎంతో తృప్తి చెందాను.

3. తేది 07-09-2004 నాడు రెండవ జప సమర్పణ తరువాత, దీనిని స్వీకరించినట్లయితే మా తండ్రి గారిని చూపమన్నాను. అప్పుడు మా తండ్రి గారిని చూపెట్టారు. అప్పుడు కూడా తృప్తి చెందాను.

ఈవిధంగా నేను స్వామివారికి సేవచేసి, ఆ సేవ తదుపరి స్వామివారి అనుగ్రహానికై ఆశ పడేవాణ్ణి. నిజానికి ఇదే నాకు బలాన్నిచ్చేది. నేను కేవలం భగవంతుని కృపనే ఆశించాను, కాని భక్తుల పొగడ్తలను లెక్క జేసేవాడిని కాదు. ఈ క్రమములో 'నమో వేంకటేశాయ' రథమును తయారు చేసి తేది 11-08-2004 నాడు తిరుపతిలో ప్రారంభించాము. ఈ.ఓతో పాటు అందరూ బాగుందన్నారు. రెండవ జప సమర్పణ సందర్భంగా హైదరాబాద్ నుండి తిరుపతి వరకు రథయాత్ర చేసి, కొన్నివేల మంది భక్తులకు స్వామి కృప అందేవిధంగా చేయగలిగాము. ఈ రథమును తయారు చేసి ఒక పర్యాయం సమర్థవంతంగా స్వామిసేవలో వినియోగించుట కూడా జరిగింది. ఈ రథం తయారులో, రథయాత్ర జరుపుటలో చాలా కష్టపడ్డాను. కాబట్టి దీనికి తగిన ఫలితమును స్వామినుండి పొందాలనుకున్నాను. రెండవ జపసమర్పణ, తేది 07-09-2004 తరువాత నుండి ఈ రథాన్ని స్వీకరించినట్లయితే తన దివ్యదర్శన భాగ్యాన్ని ప్రసాదించుమని వేడుకుంటున్నాను. కాని స్వామివారు కరుణించ లేదు. ఎంతో ప్రయత్నించినప్పటికీ లాభం లేకుండా


తిరుమల శ్రీ వేంకటేశ్వరుని
దిశానిర్దేశము



స్వామివారి 700 దివ్యలీలలు
మొదటి సంపుటము
తెలుగు మరియు ఇంగ్లీష్ భాషలలో లభించును.
12 భాగాలు కల
పుస్తకము ధర : 250/-
ప్రచురణ: శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం
గోవింద దాసు (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం. 1-1-53, వీధి నెం. 1, హబ్సిగూడ, హైదరాబాద్ - 500 007.
ఫోన్: 040-27175050 (10.00 am to 6.30pm)
website: srivenkatesham.org, mail: srivenkatesham@gmil.com
పై అడ్రస్ నుండి పుస్తకమును పొందవచ్చును. లేదా... పోస్టు / కొరియర్ ద్వారా పొందగోరువారు పుస్తకము ధరతో పాటు రూ. 150/- రిజిస్టర్ పోస్టు / కొరియర్ కొరకు కలిపి మొత్తం రూ. 400/- ఫోన్ పే, గూగుల్ పే, పేటిఎం ద్వారా 93482 12354 నంబర్‌కు పంపగలరు. మరియు మీ అడ్రస్‌ను ఇదే నంబర్‌కు వాట్సప్ / మెసేజ్ ద్వారా పంపి పొందవచ్చును.
శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం, హైదరాబాద్


పోయింది. ఇంతకుముందు ప్రార్థించిన వెంటనే స్వామివారు అనుగ్రహించేవారు, కాని ఈసారి మాత్రం అలా జరగలేదు. ఒక దశలో నా సహనం నశించింది. ఏమి చేయాలో తెలియలేదు. ఒకానొక సందర్భంలో శ్రీశ్రీశ్రీ రామచంద్ర రామానుజ జీయర్ స్వామితో ఈ విషయం చెప్పాను. నా ఆస్తి సమస్యలను తీర్చుట లేదని, రథాన్ని స్వీకరించుట లేదని నిరాశభావంతో చెప్పాను. అప్పుడు వారు "తొందరపడకు, సమయం పడుతుందన్నారు" కాని ఇంతవరకు, ఏడు నెలలు గడిచాయి కాని స్వామివారి అనుగ్రహాన్ని మాత్రం పొందలేదు. అంటే 25-04-2005 వరకు పొందలేదు, వేచి చూస్తున్నాను.

**భూ సమస్య :** ఈరోజు 25-04-05 నాడు నా ఆస్తి గొడవల విషయమై ఆ దుండగులతో ఒక సమావేశం జరిగింది. వారు నా బలహీనతను ఆసరాగా తీసుకొని చాలా భూమిని అడిగారు. చివరికి నీకిష్టముంటే ఇవ్వు లేదంటే మేము న్యాయాన్నైనా కొనగలమనే విధంగా మాట్లాడారు. ఒకరకంగా వారు న్యాయముతో పాటు పోలీసు వారితో సంప్రదించి ఉన్నట్లు అనుమానం కలిగింది. చింతతో ఆఫీసుకు వచ్చి స్వామివారిని దీనంగా ప్రార్థించాను. ప్రభూ మీరు నా ఆస్తిని కాపాడుదురని నమ్మి దానిని మీ వద్ద పెట్టాను. కాని మీరు రక్షించలేదు, దుండగులు ఆక్రమించారు. నా పైననే కేసు పెట్టారు. మీ లీలలపై నమ్మకము చెదిరిపోవుచున్నది. నా ప్రార్థనలకు మీరు విలువ నీయుట లేదని బాధపడ్డాను. ఒకప్రక్క ఆస్తిని రక్షించుట లేదు, మరోప్రక్క 'నమోవేంకటేశాయ' రథమును స్వీకరించుట లేదు, ఎంతకాలము ఈ బాధ అని ప్రార్థించాను. నా కళ్ళనుండి నీరు జల జల రాలుచుండగా రకరకాలుగా స్వామివారిని ప్రార్థించాను. చివరికి బాధాతప్త హృదయంతో ఇంటికి పోయాను.

## స్వప్నాలు నిజమే – నిదర్శనాలను చూపిస్తాననుట

మరో ముఖ్యమైన విషయం : నా భూ సమస్య తీర్చనందున స్వామి వారి పట్ల విశ్వాసం రోజు రోజుకూ తగ్గింది. మరోప్రక్క ఎవ్వరికీ లేని ఈ స్వామి లీలలు, స్వప్నాలు నాకు కలగడం నిజమేనా అనే సందేహం కలిగింది. ఈ స్వప్నాలను నమ్మవచ్చా? అనే అనుమానం కూడా ఏర్పడ్డది. నాలోని ఈ భావాన్ని గ్రహించిన శ్రీవేంకటేశ్వరుడు స్వప్నాలు నిజమని నిదర్శనాలను చూపించుదుననే ఒక హృదయాంతర భావం గత రెండు రోజుల నుండి వస్తోంది. "స్వప్నంలో స్వామివారు నన్ను స్పృశిస్తారు. ఆ స్పృశించిన భాగం వచ్చే 2-3 రోజుల వరకు నా శరీరంలోని ఇతర భాగాల కంటే భిన్నంగా ఉంటుంది". ఇది నిదర్శనము. ఈ రకమైన హృదయాంతర భావం వస్తుంది. కాని అప్పటి నా మానసిక స్థితి వల్ల దీనికి ఎక్కువ విలువనీయలేదు.

ఇది ఒక అద్భుతమైన లీల. ఈ లీలలో స్వామి వారి అత్యంత

అనుగ్రహం లభించింది. స్వామివారి అనుగ్రహం పరాకాష్ఠకు వెళ్ళింది. ఎంతగా అనుగ్రహించారంటే గతంలో పొందిన అన్ని అనుగ్రహాలు కలిపినా కూడా దీనితో సమానం కావు. ఈ జన్మ ధన్యమైంది. దీని మొదటి భాగములో నమో వేంకటేశాయ రథమును స్వీకరించుటకు తన వివిధ రూపాలను చూపాడు. వీటి ప్రభావముతో అర్జునుని తరువాత అంతటి అదృష్టవంతుణ్ణి నేనే అని కలలోనే భావించాను. ఈ కల చాలా పెద్దది. ఈ కలలోని రెండవ భాగం నా వ్యాపారానికి సంబంధించింది. దీనిలో పూర్వం ద్రౌపదిని ఏవిధంగా రక్షించాడో నన్ను ఆ విధంగా రక్షించాడు. ద్రౌపది తరువాత అంతటి అదృష్టవంతుణ్ణి నేనేనని కలలోనే అనుకున్నాను. ఇదే కలలో స్వామి లీలలు నిజమని తెలుపుటకు స్వామివారు నన్ను స్పృశించారు. తన చేతి బొటనవేలిపై నా పూర్తి భారాన్ని మోశారు. ఆ తరువాత రెండు మూడు రోజులు స్వామి స్పృశించిన భాగం ఇతర శరీర భాగాల కంటే భిన్నంగా మారింది. అప్పటినుండి స్వామి లీలలు నిజమని, అనుమానించకూడదని భావించాను. ఈ అనుభూతి కూడా 2009 లో నానిపోయింది. కాని 2009లో 'శ్రీవేంకటేశం ఆవిర్భావానికి శ్రీనివాసుని ఆదేశం' ప్రచురించినప్పుడు దీనిని డిటిపి చేసి సిద్ధంగా పెట్టుకున్నందువల్ల చక్కగా వివరిస్తున్నాను. ఈ లీలను వచ్చే సంచికలో చూద్దాం.

**నా దశ :** స్వామివారు మా ఇంటి నిర్మాణములో రకరకాలుగా అనుగ్రహించారు. భూ సమస్యలకు భయపడక ధైర్యంగా ముందుకు వెళ్ళమన్నారు. నమో వేంకటేశాయ పత్రికను వెంటనే ప్రారంభించమన్నారు. తిరుపతికి తీసుకెళ్ళి తన దివ్యదర్శనమును తృప్తిగా ప్రసాదించారు. ఆ తరువాత రచయితల అడ్రసులను సేకరించునట్లు చేశారు. పత్రికను ప్రారంభించమన్నారు. స్తూపాన్ని, ప్రథమ జప సమర్పణను స్వీకరించినట్లు నమో వేంకటేశాయ రథమును స్వీకరించమని ప్రార్థిస్తూ ఆయన అనుగ్రహం కోసం వేయి కళ్ళతో వేచి చూస్తున్నాను.

**భాగవత ఆశీర్వాదము :** తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే కేవలము మీ యొక్క ఆశీర్వాదము పొందుటకని, మరియు స్వామి సంకల్పములో మిమ్మల్ని కనీసం ఆశీర్వాద రూపకంగా నైనా భాగస్వాములుగ చేయుటకు ఈ లీలలను ప్రచురిస్తున్నాము. కావున ఈ లీలలను చదివిన ప్రతి భక్తుడు వయస్సు, లింగ భేదం లేకుండా స్వామి వారిని స్మరించి సంకల్పం నెరవేరాలని ప్రార్థిస్తూ ఆశీర్వదించగలరని ప్రార్థన.

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**గోవిందదాసు** (పుల్లగూర్ల సాయిరెడ్డి)
ఇ.నెం.1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్.
ఫోన్: 040-27175050. Visit: www.srivenkatesham.org

**రచనలకు శ్రీ వేంకటేశం ఆహ్వానం**



'శ్రీ వేంకటేశం' మాస పత్రికలో వివిధ రకాల శీర్షికలకు రచయితల నుండి, కవుల నుండి, పాఠకుల నుండి సరికొత్త రచనలను ఆహ్వానిస్తున్నాము. యాత్రానుభవాలు, భక్తుల అనుభూతులు, దైవసంబంధమైన వ్యాసాలు, కథలు, కవితలు, ఇతర అంశాలను పంపవచ్చు. అయితే ఆయా రచనలతో పాటు అందుకు సంబంధించిన ఫొటోలను వీలైనచో జత చేయండి. పరిశీలించిన తరువాత ప్రచురణకు యోగ్యమైన రచనలను ప్రచురిస్తాం.

రచనలు తిప్పిపంపగోరువారు తగు స్టాంపులు అతికించిన కవరు కూడా జతచేయాలి. ప్రచురించిన ప్రతి రచనకు తగు పారితోషికం ఉంటుంది. రచనలలో అవసరమైతే భాష, శైలిలో మార్పులు, చేర్పులు చేసుకునే స్వేచ్ఛ మా సంపాదక వర్గానికి ఉంటుందని తెలియజేయుచున్నాం.

ఈ పత్రిక ప్రపంచంలోని నలుమూలలలో గల తెలుగు ప్రజలు అంతర్జాలంలో (ఇంటర్‌నెట్) వీక్షించుదురు కావున రచయితలు తగు జాగ్రత్తలు వహించి మంచి రచనలు పంపగలరని మనవి.

మీరు పంపే ప్రతి రచన పాఠకులలో భక్తిభావం కలిగే విధంగా, వారి జీవితమునకు కొంతవరకైనా ఉపయోగకారిగా ఉండవలెనని మనవి. రచనలు తెలిసే విధంగా దస్తూరి స్పష్టంగా ఉండాలి. ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయాలి.

**గమనిక: మీ రచనలను ఆన్‌లైన్‌లో పంపాలనుకునేవారు srivenkatesham@gmail.com మెయిల్ చేయండి.**

రచనలు పంపవలసిన చిరునామా

**శ్రీ వేంకటేశం** ఆధ్యాత్మిక మాసపత్రిక,
(శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం)
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1, హబ్సీగూడ, హైదరాబాద్-07.
ఫోన్: 040-27175050, సెల్: 9348212354
Email: srivenkatesham@gmail.com

# ధ్యానం ఆవశ్యకత

- కుప్పా నారాయణ మూర్తి



## 1.మనస్సు – పరిచయం :

''ఇంద్రియాణాం మనశ్చాస్మి భూతానా మస్మి చేతనా'' భగ–10–22. మానవుని ఏకాదశ ఇంద్రియాలలో సంకల్ప వికల్పాత్మకమైన మనస్సు, దేహేంద్రియ సంఘాతములో నిత్యాభి వ్యక్తమగు బుద్ధి వృత్తియు తానే అని పరమాత్మ వచనం.

''మనస్సు కొన్ని విశ్వాసాలతో నిర్ణయాలతో అనుభవాలతో ఊహలతో కాంక్షలతో కూడి ఉన్నది.

మనస్సు – అంగములు : మనస్సు సంకల్ప వికల్పాత్మకము. మనస్సు నిలకడలేని చంచల స్వభావము కలది. శరీరములోని ఇంద్రియములను విక్షేపము నందించునది. దాన్ని నిగ్రహించుట చాలా కష్టము అని అర్జునుడు పరమాత్మకు విన్నవిస్తూ దీని వలన యోగమందు నిశ్చలత్వము పొందలేకుండా ఉన్నానని తెలియజేశాడు. దానికి సమాధానముగా పరమాత్మ అభ్యాస వైరాగ్యముల చేత మనస్సు యొక్క చంచలత్వము అరికట్టవచ్చునని అనగా జ్ఞానయోగము యొక్క అభ్యాసం చేత దృష్టా దృష్టేష్ట భోగములందు దోష దర్శనాభ్యాసముల వల్ల కలుగు విరాగము చేత నిగ్రహించవచ్చునని తెలియజేశారు.

## 2. మనస్సు సంశయాత్మకం :

మనస్సు ఎప్పుడూ సంశయాత్మకంగా ఉంటుంది. ఉదాహరణ – మనస్సులో ధ్యానం చేయాలని సంకల్పం కల్గుతుంది. ఇందువలన ఏమి ఉపయోగం? అని వెంటనే సంశయం కల్గుతుంది. ఇహ పర సౌఖ్యములు పొందవచ్చునని శాస్త్రములు చెప్పుచున్నప్పటికీ వాటియందు నమ్మకం కుదరదు – ధ్యానం ప్రారంభించి విరమించడమో అసలు ప్రారంభించకపోవటమో పర్యవసానం అవుతుంది. ఇది మన అనుభవంలోని విషయం.

మనస్సు అణుబాంబు కంటే శక్తివంతమైనది. వ్యాధిగ్రస్తుడైన మానవుడు ''నేను రోగరహితుడను. నా వ్యాధులన్నీ నయమైపోయాయి'' అని పదే పదే మనస్సుకు చెప్పుకోవడం రోగ నివారణలో ప్రాధాన్యం వహిస్తుంది. అదే స్వయం సూచన అవుతుంది. దాని ద్వారా రోగ నివారణ అవుతుందని ఋగ్వేదం ద్వారా తెలియుచున్నది.

## 3.మనస్సు – ఆలోచనల మూలము :

''ఆలోచన వచ్చిందని, వచ్చిన తరువాత తెలుస్తుంది. కాని ఎక్కడ నుండి వచ్చిందీ, ఎట్లా వచ్చిందీ తెలియదు. కూర్చుందామనిపించింది; కూర్చున్నాను. ఎవరివల్లో అర్థం కావడం లేదు. ఆ అనంతమైన శక్తిని పరిమితి గల (శరీరం) ఆధారంతో చూద్దామనే గద ప్రయత్నం''. ఆలోచనలెట్లా వచ్చినాయి? ఏదో శక్తి, దైవమే ఒకటి ఏర్పరచాలి''.

చిత్తకాలుష్యముపోవుటకుయోగశాస్త్రమును,వాక్కాలుష్యము పోవుటకు వ్యాకరణ శాస్త్రమును శరీర మాలిన్యము పోవుటకు వైద్యశాస్త్రమును పతంజలి మహర్షి సుమారు ఆరు వేల సంవత్సరాల క్రిందట రచించినట్లు తెలియుచున్నది. చిత్త కాలుష్య నివారణకు మార్గము ''యోగ శ్చిత్త వృత్తినిరోధః'' అను ప్రథమ సూత్రములో పతంజలి సూచించారు. చిత్తమును నిరోధించుట ఎంత కష్టతరమో దానికి ఎన్ని అడ్డంకులు వచ్చునో, ఆ అడ్డంకులను ఏ విధముగా తొలగించ వలయునో తెలియజేస్తూ ''యమ, నియమ, ఆసన, ప్రాణాయామ, ప్రత్యాహార, ధారణ, ధ్యానసమాధులు'' అను అష్టాంగ సూత్రముల ద్వారా వివరించారు. యమ నియమములతో శరీరము క్రమబద్ధము చేసి ఆసనము ద్వారా శరీరమును, శిరస్సునుండి మూలాధారము వరకు నిట్టనిలువుగా ఉండేట్లు కూర్చుని ప్రాణాయామము ద్వారా ఉచ్ఛ్వాస నిశ్వాసములను క్రమబద్ధము చేసి ప్రత్యాహారము ద్వారా ఇంద్రియార్థముల నుండి మనస్సును నిగ్రహించి ఒక లక్ష్యాన్ని మనస్సులో నిలిపి దానిని భ్రూమధ్యమున గాని, నాసికాగ్రమున గాని నిలిపి ధారణ చేస్తే తైలధార వలె అవిచ్ఛిన్నమైన ధ్యానమును మానవుడు పొందగలడని సూచించారు. మానవులలో

ఉండే తరతమ భేదములను బట్టి ఉత్తమాధికారి యైతే "తీవ్ర సంవేగానాం ఆసన్నః" అను సూత్రము ద్వారా తీవ్రతరమైన కృషి చేస్తే అతిత్వరలోనే ధ్యానసిద్ధి కలుగగలదని, మధ్యమాధికారి అయితే "సతుదీర్ఘకాలనైరంతర్య సత్కారా సేవితో దృఢభూమిః" అను సూత్రము ప్రకారము దీర్ఘకాలము నిరంతరం ఆదరముతో ధ్యానప్రక్రియను సాధించవచ్చునని అధమాధికారికి అవకాశమే లేదని తెలియజేశారు.

ధ్యానములో ఏకాగ్రత సిద్ధించుట ద్వారా 36 విభూతులు మానవుడు పొందగలడని సూచించారు. ఆకాశగమనము, పరకాయ ప్రవేశము, ఎదుటి వాడి యొక్క మనోభావములు వగైరా గ్రహించు శక్తి పొందగలడు. శంకర భగవత్పాదులు అట్టి యోగశక్తులు పొందినట్లుగా తెలియుదుము.

అందువల్ల మానవుడు మహర్షి చెప్పిన ప్రకారము అష్టాంగ యోగమును శ్రద్ధతో అనుసరిస్తే ధ్యానములో పరాకాష్ఠ పొందగలడు.

వ్యక్తిగత మనస్సు విశ్వాత్మక మనస్సు. ప్రతి మానవునకు వ్యక్తిగత మనస్సు పరిమిత శక్తి కల్గి ఉంటుంది. ఈ వ్యక్తి యొక్క మనస్సుల యొక్క సమాహారమే విశ్వాత్మక మనస్సు. వ్యక్తిగత మనస్సు ద్వారా మానవుడు పైన చెప్పినట్లు ఆలోచనల ద్వారా సృష్టి, స్థితి లయములలో సాధిస్తూ యింద్రియార్థముల వైపు మనస్సును మళ్ళించి, కామక్రోధాల ద్వారా క్రుంగిపోవుచున్నాడు. అట్టి వ్యక్తి పునర్జన్మ రాహిత్యము కొరకు ధ్యానము చేస్తే ఉత్తమ గతులు పొందగలడు. అంతేకాదు విశ్వాత్మక మనస్సులో సర్వవ్యాపకముగా నుండు శాశ్వత సత్యములను పొంది సర్వజ్ఞుడు కాగలడు. అట్టి వ్యక్తికి భూత భవిష్యత్ వర్తమాన కాలములు మూడును వర్తమాన కాలముగనే భాసిస్తాయి. సృష్టిలో ఉండే సర్వవిధములైన జ్ఞానము కరతలామలకము అవుతుంది. అందువలన మానవునకు ఆ విషయమై ప్రయత్నించుట లక్ష్యము గావలెను.

## మనస్సు – ధ్యానము :

**దుఃఖేష్వ నుద్విగ్నమనాః సుఖేషు విగత స్పృహః**
**వీతరాగభయ క్రోధః స్థితధీ ర్మునిరుచ్యతే**

ఆధ్యాత్మికాధి దైవికాధి భౌతిక దుఃఖములందు క్షోభ చెందక, స్రక్చందనవనితాది సుఖములందు రాగ, భయ క్రోధాదులచే చలించనట్టి మనన శీలుడు స్థితప్రజ్ఞుడు. జీవితాదుల యందు ప్రీతి లేనివాడై మంచి చెడులకు పొంగి క్రుంగిపోవుట ఎవనికి లేదో అట్టివాడు స్థితప్రజ్ఞుడు. ఆ స్థితి రావటం ఎట్లా? దానికి కొంత సాధన అవసరం. శరీరాన్ని కొన్ని కట్టుబాట్లకు అలవాటు చేయాలి. అవి ఏమనగా నిత్యం బ్రహ్మ ముహూర్తములో అనగా ఉదయం నాలుగు గంటల నుండి నాలుగున్నర లోపల నిద్ర లేచి పాదప్రక్షాళనాది కృత్యములు నెరవేర్చి "ఓం" కారం పదకొండుసార్లు, ప్రాణాయామము పదకొండుసార్లు చేయాలి. సత్యం, అహింస, అస్తేయం, అపరిగ్రహము, బ్రహ్మచర్యం పాటించాలి. శౌచం, సంతోషం, స్వాధ్యాయం, తపస్సు, ఈశ్వర ప్రణిధానము అనుష్ఠించాలి.

## ధ్యానము చేయు విధానము :

ఏ వస్తువునైన, ఏ విషయాన్నైన తదేకముగ చింతించడమే ధ్యానం. "ధ్యాసే ధ్యానము" అని జిల్లెళ్ళమూడి అమ్మ చెప్పింది.

ప్రాపంచిక విషయముల చింతన లేకుండా కేవలం పరమాత్మ చింతన గురించి ఎడతెరపి లేని చింతనే ధ్యానము. ధ్యాన సమయము కనీసం రోజుకు రెండుసార్లు చొప్పున తడవకు 15 నిమిషముల పాటు ప్రారంభించి ఇంకా ఎక్కువ కాలము ధ్యానము చేయుటకు వినియోగించుకోవాలి. ఉదయము, సాయంత్రము నిర్ణీత సమయములలో ధ్యానము ఉత్తమ ఫలితాన్నిస్తుంది. వర్ణోచిత, ఆశ్రమోచిత ధర్మములను అనగా సంధ్యావందనాది నిత్య కర్మములను తప్పక ఆచరించాలి. నిత్యకర్మల్లో భాగంగా నీ ఇష్టదైవము యొక్క నామమును రోజుకు కనీసం 1008 సార్లు జపం చెయ్యాలి. నైమిత్తిక కర్మలను ఆచరించాలి.

## ధ్యానములు నాలుగు రకములు :

1.శ్వాస ధ్యానము 2. మూర్తి ధ్యానము 3. నిర్గుణ ధ్యానము 4. ప్రణవ ధ్యానము

**1. శ్వాస ధ్యానము :**

దీనినే హంస ధ్యానము అని కూడా అంటారు. మనస్సులో ఏదీ చింతించక కేవలం నాసికా రంధ్రముల ద్వారా జరుగు ఉచ్ఛ్వాస నిశ్వాసములపై ధ్యాస పెట్టాలి. ఉచ్ఛ్వాస సమయంలో "సో" అనియు నిశ్వాస సమయములు "హం" అనియు "అహం" (నేను) అనియు ఉచ్ఛ్వాస నిశ్వాసములలో భావించాలి. అంటే సః (పరమాత్మ) అనియు, అహం (నేను) అనియు భావన రావాలి. ఈ ధ్యానములో ఉచ్ఛ్వాస నిశ్వాసములను తదేకముగా గమనించి కూర్చోవాలి. కొంతసేపటికి శ్వాసల నిడివి తగ్గుతుంది. అంటే మొదట్లో నిమిషమునకు 40 సార్లు వచ్చే శ్వాస క్రమంగా 30కి లేక 20కి తగ్గిపోతుంది. అప్పుడు ఏకాగ్రత సిద్ధిస్తుంది.

**2. మూర్తి ధ్యానము :**

దేవుని మందిరములో ఒక దేవతా విగ్రహాన్ని కాని, పటమును గాని ఉంచి దానికి ఎదురుగా పీటపై కూర్చుని కండ్లు తెరచి ఆ దేవతా విగ్రహము యొక్క కిరీటము లగాయతు పాదముల వరకు తదేక దృష్టితో రోజుకి కనీసం 2 సార్లు తడవకు 15 నిమిషములు చొప్పున చూస్తూ ఒక నెల గడచిన తరువాత తదుపరి నెలలో దేవతామూర్తిని కండ్లు మూసుకొని ధ్యానిస్తే మన ఆజ్ఞా చక్రమందు (కనుబొమ్మల మధ్య) ఆ మూర్తి యొక్క సాక్షాత్కారము లభించి ఏకాగ్రత సిద్ధిస్తుంది.

**3. నిర్గుణ ధ్యానము :**

కండ్లు మూసుకొని పరమాత్మను ఒక కాంతి స్వరూపముగా భావించి ధ్యానించటం ప్రశస్తమని, చంద్రబింబమును ధ్యానిస్తే చల్లని వెలుగుతో కూడి మన మనస్సుకు ఏకాగ్రత సిద్ధించి శాంతి లభిస్తుంది.

**4. ప్రణవ ధ్యానము :**

దీర్ఘ ఘంటా శబ్దము వలె ప్రణవాన్ని ఉచ్చరిస్తూ క్రమముగా శబ్దాన్ని తగ్గించి తగ్గించి నిశబ్ద స్థితికి తీసుకుపోవాలి. అప్పుడు దానిపై మనస్సుంచి మనస్సుని, నిస్సంకల్ప స్థితికి గొనిపోవాలి. అప్పుడు చిత్తవృత్తులు నిరోధించబడి క్రమముగా నశిస్తాయి. అంతట ఆత్మానుభూతి కలుగుతుంది.

మనలోని వ్యక్తిగత మనస్సుని విశ్వాత్మక మనస్సుతో అనుసంధానము చేసే ప్రక్రియే ధ్యానము. అయస్కాంత విద్యుత్ ప్రసారాలు అంతరిక్షములో పడి భ్రమించుతుంటాయి. వాటిని మన ఇండ్లలోని రేడియో టీవీలలో ఆ వేవ్ లెంగ్త్ మీద ట్యూన్ చేస్తే ఆ ప్రసారాలు మన రేడియో టీవీలలో వస్తాయి. అట్లే మన వ్యక్తిగత మనస్సు ధ్యానము ద్వారా ఆ అయస్కాంత విద్యుత్ తరంగాలు అంతరిక్షములో ప్రసరించి, పరమాత్మ నుండి గాని (కాస్మిక్) తపస్సు చేసే మహర్షుల నుండి గాని అంతరిక్షములో నిక్షిప్తమైన శాశ్వత సత్యములు మన ధ్యానప్రక్రియ ద్వారా అందుకోవచ్చును. అదే తపస్సు. అప్పుడు అంతరిక్షములో పరిభ్రమించే శాశ్వత సత్యాలు మనము గ్రహించవచ్చు.

ఆత్మవిద్య వ్యోమాకాశములో ప్రతిష్ఠింపబడినదని ఉపనిషద్వాక్యం వల్ల మనకు తెలియుచున్నది. ఈవిధంగా కనీసం ఒక ఏడాది చేస్తే మానవునికి తరతమ భేదాలను బట్టి సర్వజ్ఞత్వము, శాంతి లభించుతుంది. ఆ ఆలోచనా రహితస్థితే పరమాత్మ స్థావరం.

సీతాదేవి హనుమంతునకు ఉపదేశము చేసిన అమనస్క యోగము కూడా ఇదే.

మనస్సు – సమాధి : ధ్యానములో పరాకాష్ఠయే సమాధి స్థితి. సమాధి రెండు విధములు. సంప్రజ్ఞాత సమాధి, అసంప్రజ్ఞాత సమాధి. సంప్రజ్ఞాత స్థితిలో సాధకునికి మనస్సు లయమవుతుంది. అంటే మనస్సుపై పూర్తి నిగ్రహము కలిగి యుంటాడు. అయితే అపుడపుడు తిరిగి బాహ్యస్థితికి వచ్చే అవకాశము ఉంది. కాని సంసార బంధములో చిక్కుకొనడు. 19వశతాబ్దపు రామకృష్ణ పరమహంస చిడతలతో భజన కార్యక్రమముల ద్వారా తన్మయత్వము పొంది సమాధి స్థితిలోకి వెళ్ళేవారు. తిరిగి కొంతసేపటికి బాహ్యస్థితి కలిగి శిష్యులతో ముచ్చటించేవారు. (స్వామి రామతీర్థ (పంజాబ్) 1872–1906) వారు చిరుత వయస్సులోనే సన్యాస దీక్ష వహించి పరమాత్మ కొరకు విరహవేదన చెందునపుడు రాత్రిళ్ళు వారి పక్కబట్టలు కన్నీళ్ళతో తడిసి ఉండేవి. అట్టి తీవ్రతరమైన తపస్సు చేస్తూ శరీరాన్ని శుష్కింపచేసి తరచు సమాధి స్థితిలోకి వెళ్ళేవారు. 34 సంవత్సరముల ఎల ప్రాయములో తను చేసిన తపస్సును శరీరము భరించలేకపోయింది – ఆ కారణముగా తరచు సమాధి లోకి వెళ్ళేవారు. 1906 అక్టోబర్ నెలలో గంగానదిలో స్నానము చేయుటకు ప్రవేశము చేయగా ఆ సమయమున వారు సమాధి లోకి వెళ్ళి ఆ గంగా ప్రవాహములో లీనమైనారు. ఆయన పార్శీ, ఇంగ్లీషు, సంస్కృత భాషలలో గొప్ప పండితుడు. అనేక గ్రంథములు రచించారు. వారి రచనలను గుంటూరు జిల్లా పిడుగురాళ్ళలో రామతీర్థ సేవాశ్రమమును స్థాపించి కేశవసిద్ధి స్వామివారు తెలుగులోకి తర్జుమా చేశారు. అది ఉత్తేజకరమైన సాహిత్యము. సర్వులు పఠించి అనుష్ఠించదగు రచనలుగా విరివిగా ప్రచారములో ఉన్నాయి.

పరమహంస యోగానంద 1893–1952 వరకు జీవించి క్రియా యోగమును, యోగసిద్ధాంతమును రూపొందించి జాతీయ అంతర్జాతీయ వేదికలలో బహుళ ప్రచారము చేశారు. ఒక యోగి ఆత్మకథ అను గ్రంథములో ధ్యానములో తన అనుభవాలను వివరిస్తూ "నేను ధ్యానమునకు కూర్చున్న వెంటనే నా చుట్టూ ఉన్న ప్రపంచము గంటల తరబడి లుప్తమై పోతుంది. ఆ విధమైన తీవ్ర తపస్సు చేసిన మహామహుడు పరమహంస యోగానంద.

ఇంకా ఎందరో మహనీయులు బాహ్య ప్రపంచానికి దూరంగా కొండ గుహలలోను, నదీ తీరములలోను తపస్సు చేసుకుంటూ సమాధి ద్వారా బ్రహ్మైక్యాను సంధానము చెందినట్లు చారిత్రక దాఖలాలు ఉన్నాయి.


అసంప్రజ్ఞాత సమాధిలో సాధకుని మనస్సు పూర్తిగా లయమైపోయి తిరిగి బాహ్యస్మృతికి వచ్చే అవకాశములు లేవు. అట్టివారిలో మంత్రాలయము రాఘవేంద్రస్వామి వారు ఒకరు. అసంప్రజ్ఞాత సమాధి స్థితిలో ఆయన జీవించి యుండగా భూ సమాధిలో వారిని ప్రవేశపెట్టి దానిపై బృందావనము కట్టించారు. అదే దివ్యక్షేత్రమై 300 సంవత్సరాల నుండి విరాజిల్లుతున్నది. చరిత్రకు అందని మహనీయులు అట్టి సమాధి స్థితిలో ఉన్నవారు నేటికీ ఉండవచ్చు.

పురాణకాలము నుండి మానవుడు మనస్సును నిగ్రహించుట కొరకు అనేక యోగ విధానాలను పాటించాడు. ప్రస్తుతం అమలులో ఉన్న యోగ విధములు – 1. పతంజలి యోగ సూత్రములు 2. భగవద్గీత 3. మాస్టర్ సి.వి.వి. యోగ ప్రక్రియ 4. మహేష్ యోగి రూపొందించిన ట్రాన్సెండెంటల్ మెడిటేషన్ 5. రామచంద్రజీ మహరాజ్ వారు రూపొందించిన సహజ మార్గ ఇన్ రాజయోగా 6. హఠయోగము వగైరాలు. ఏ పద్ధతి అవలంబించినా మానవుని ధ్యేయము ధ్యానం ద్వారా సృష్టిలోని శాశ్వత సత్యములను గ్రహించి బ్రహ్మైక్యాను సంధానము నంది పునర్జన్మ రాహిత్యం పొందడమే.

### తిరుమల శ్రీ వేంకటేశ్వరునికి కోట్ల జపములో భాగముగా

## 22వ పర్యాయంగా 7 కోట్ల జప సమర్పణ

# శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర లిఖిత జపము



ఈ సంవత్సరము తిరుమల శ్రీవారికి సమర్పించబోయే 7 కోట్ల జపములో భాగస్వాములు కండి! ఆ స్వామి కరుణా కటాక్షములకు పాత్రులు కండి!!

మీ మీ కోరికలను తీర్చమని తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని ప్రార్థించే భాగ్యాన్ని మాకు ప్రసాదించండి!!

**సంకల్పం**

శ్రీ వేంకటేశ్వరుని కరుణా కటాక్షములకు, స్వామివారి అనుగ్రహానికి అందరూ పాత్రులు కావలెననే ఉద్దేశ్యంతో ఆయన నామస్మరణలోని మాధుర్యాన్ని అందరూ అనుభవించాలనే ఆకాంక్షతో.. ప్రతి భక్తునిచే 1,008 సార్లకు తక్కువ కాకుండా 7 కోట్ల జపమును వ్రాయించి ఒక పవిత్రమైన రోజున తిరుపతిలో, కొండపై ఇట్టి జపమును శ్రీవారి పాదముల చెంత పెట్టి, నివేదించి, ఎస్.వి. డైరీ ఫాం ఆవరణలో జపహోమాదులు నిర్వహించి 'శ్రీ వేంకటేశ్వర దివ్య మహామంత్ర స్థూపం'లో స్వామివారికి సమర్పించాలనే సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టబడింది.

**నిబంధనలు:**

1. ఈ మహామంత్రాన్ని వ్రాయుటకు ముందు మీ మనస్సులోని కోరికలను శ్రీవారికి నివేదించి, మనసారా ధ్యానిస్తూ, నోరారా పలుకుతూ వ్రాయండి. మననం, స్మరణం స్వామివారికి ప్రియం.
2. ఈ మంత్రమును కుల మత భేదం లేకుండా అందరూ వ్రాయవచ్చును. మన ఆచారవ్యవహారాల ప్రకారం అర్హత లేని సమయములో వ్రాయకూడదు.
3. ఈ మంత్రమును మీ మీ సొంత పేపర్లపై వ్రాయండి లేదా మానుంచి స్వామివారి దివ్యమహామంత్ర లిఖిత జప పుస్తకమును పొంది వ్రాయండి. పుస్తకమును పోస్టు ద్వారా కోరువారు పోస్టు ఖర్చుల నిమిత్తం రూ. 5/– ఎం.ఓ (ఒక్కంటికి) పంపినచో మేము మీకు జప పుస్తకాన్ని పంపగలము. (రూ. 10/–కి తక్కువ కాకుండా పంపండి). 9348212354 నంబర్‌కు ఫోన్‌పే, పేటిఎం, గూగుల్‌పే ద్వారా డబ్బులు, అడ్రస్ పంపి జప పుస్తకమును పొందవచ్చును.
4. మీరు ఈ మంత్రమును 45 రోజులలో వ్రాసి 'శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం' ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007 చిరునామాకు మాత్రమే నేరుగా గానీ / పోస్ట్ / కొరియర్ ద్వారా గానీ పంపగలరు. జప సమర్పణోత్సవ కార్యక్రమ వివరాలతో పాటు ఆహ్వాన పత్రం అందజేయడానికి వీలుగా సొంత చిరునామా కలిగిన రూ. 5/– స్టాంపు అతికించిన కవరును జతపరిచి పంపగలరు.
5. ఈ మహామంత్రమును వ్రాయునప్పుడు మీలో కలిగిన అనుభూతులను మాకు వ్రాసి పంపగలరు.
6. మీరు వ్రాయవలసిన దివ్య మహామంత్రం 'ఓం నమో వేంకటేశాయ'

**గమనిక:**

మేము శ్రీవారికి 2002 నుండి ప్రతి సంవత్సరం సమర్పించదలచిన 7 కోట్ల జపములో మీరు ప్రతి సంవత్సరము పాల్గొని శ్రీవారి కృపను, ఆశీస్సులను సంపూర్ణంగా పొందగలరని ప్రార్థన.

స్వామి నామమును 1,008 సార్లు వ్రాయలేనివారు కనీసం 108 సార్లు అయినా వ్రాసి ఏడు కోట్ల జపములో భాగస్వాములు కాగలరని మనవి.

శ్రీ వేంకటేశ్వర అనుగ్రహ ప్రాప్తిరస్తు..!

**శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠం**

ఇం.నెం. 1–1–53, వీధి నెం. 1, హబ్సీగూడ, హైదరాబాద్ – 500007.
ఫోన్: 040– 27175050

ఈ కార్యక్రమం గురించి పూర్తి వివరాలకు సంప్రదించండి:
**93482 12354**

ధారావాహికం



# మహాభారతంలోని మహోపాఖ్యానాలు


– డా॥ పులిగడ్డ విజయలక్ష్మి

గత సంచిక తరువాయి

## కువలాశ్వుడు

సూతమహర్షి రాగానే మునులందరూ లేచి నిలబడి నమస్కరించారు. ఆయన ఆశీస్సులందుకొని కూర్చుని ఆయన ఈరోజు ఏం చెబుతాడా అని ఉత్కంఠతో ఎదురు చూడసాగారు. ''నాయనలారా! ఈరోజు కువలాశ్వుడనే మహారాజు ఘనతను గురించి చెబతాను'' అని సూతుడనగానే మునులందరూ సావధానులైనారు.

''ఇక్ష్వాకు మహారాజు వంశంలో జన్మించినవాడు బృహదశ్వుడు. బృహదశ్వుడు మహావీరుడే కాక ప్రజానురంజకుడు కూడా. బృహదశ్వుని కుమారుడు – కువలాశ్వుడు. తండ్రికి తగ్గ తనయుడు కువలాశ్వుడు. శౌర్యంలో, రాజనీతిలో, దానగుణంలో, ప్రజాభీష్టపాలనలో తండ్రి గుణాలను పుణికి పుచ్చుకున్నాడు. ధర్మాత్ముడైన కువలాశ్వుడు దుష్టరాక్షస సంహారంలో మహాభయంకరమైన తేజస్సుతో ప్రకాశించేవాడు. దైవభక్తితో విరాజిల్లే బృహదశ్వుని కుమారుడు మహర్షుల పట్ల అంతే భక్తిని ప్రకటించేవాడు. కువలాశ్వుని కుమారులందరూ



మహావీరులే కాక పితృభక్తి పరాయణులు కూడా. తండ్రి మాటను జవదాటనివాళ్ళు. బృహదశ్వుడు తన కుమారుని సద్గుణాలను మెచ్చి సమస్త భూమండలానికి సార్వభౌమునిగా అభిషిక్తునిగా చేసి తపోవనానికి వెళ్ళాలని సంకల్పించి, అయోధ్యా నగరాన్ని వీడి బయలుదేరుతున్న సమయంలో ఉదంకుడనే మహాముని – ఆ వార్త విన్నవాడై బృహదశ్వుని దగ్గరకు వెళ్ళి అతని ప్రయాణాన్ని ఆపటానికి శతవిధాలా ప్రయత్నించాడు. దానికో కారణం కూడా ఉంది'' అని ఆపాడు సూతముని. ''బృహదశ్వుని

తపస్సు ఆపటానికి ఉదంకమునికి కారణం ఉందా? అదేమిటి మహాత్మా! వివరంగా చెప్పండి. వినాలని కుతూహలంగా ఉంది'' అని శౌనకుడు అడగటంతో మళ్ళీ చెప్పడం మొదలుపెట్టాడు సూతముని.

''అవును గొప్ప కారణమే ఉంది. ఉదంకుడు విష్ణుమూర్తిని గురించి వేల సంవత్సరాల పాటు గొప్ప తపస్సు చేసి ఆయనను ప్రత్యక్షం చేసుకొన్నాడు. ''నీకేం కావాలో కోరుకో, ఇస్తాను'' అన్నాడు శ్రీమహావిష్ణువు. దానికి ఉదంకుడు **"దేవా! భవదీయ దివ్యరూపంబు ప్రత్యక్షంబుగా కంటి; నింతకంటె వరంబెయ్యది గల?దైనను నామనంబు నిత్యంబును సత్య ధర్మ శమంబుల యందు సుస్థిరంబై నీయందు దృఢభక్తి కంబు గావలయు; నిదియె నాకు వరంబు".**

**-వ. 378 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

ఉదంకుడు కోరిన వరాన్ని ప్రసాదించి మరో వరాన్ని కూడా ఇచ్చాడు విష్ణుమూర్తి.

''ఉదంకమునీ! నీకు పరమ
జ్ఞాన యోగంబును సిద్ధించు.
త్రిలోకహితంబైన కార్యంబొక్కటి
నీచేత సాధితంబయ్యెడు;
దుంధుండను దానవుండు
జగంబులకుపద్రవంబు
సేవయంగలవాడు; తద్వధార్థంబై
నీవు బృహదశ్వసూనుండైన
కువలాశ్వు నుద్యుక్తుం జేసెద,
వన్నరేంద్రుడు మత్ప్రసాద
లభ్యంబైన యోగబలంబునం
జేసి, భవన్నియోగంబున నయ్యసురం
బరిమార్ప సమర్థుండగు; నవ్విశేషంబునకు నీవలన
నఖిల లోకంబులు సంతసిల్లెదును''ని పలికి విష్ణుదేవుండు
అంతర్హితుండయ్యె – వ.378 – చతుర్థాశ్వాసము –
అరణ్యపర్వము – మహాభారతము.

''శౌనకా! ఉదంకుడు బృహదశ్వుని చెందకెందుకు వచ్చాడో తెలిసింది గదా! విష్ణుమూర్తి ఆజ్ఞను శిరసా వహించి ఉదంకముని బృహదశ్వుని వానప్రస్థ జీవితాన్ని ఆపదలచినవాడై ఆ మహారాజు వద్దకు వచ్చి కారణాన్ని సవిస్తరంగా చెప్పాడు.

**"బృహదశ్వ మహీపాలా!**
**నీవు ప్రజాభిరక్షణము నెమ్మి నొనర్పు; మరణ్యభూమికిం**
**బోవగనేల? రాజులకు భూ ప్రజఁ గాచుటఁ బోలు; ధర్మువుల్**
**భూవర! కల్గునె యడవి పోయి వసించినఁ గాని కాదె? ర**
**క్షా విధి కాదె సద్గతులు గాంచిరి తొల్లిటి రాజ ముఖ్యులున్"**

**-ప.381 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''ప్రేమతో నీ ఏలుబడిలోని ప్రజలను చక్కగా రక్షించు. అరణ్యానికి వెళ్ళి తపస్సు చేయటం ఎందుకు? రాజుల కర్తవ్యం తన ప్రజలను కాపాడటమే. అడవికి పోయి నివసించినంత మాత్రంచేత ధర్మం, పుణ్యం చేరువౌతాయా? పూర్వకాలపు రాజులందరూ ప్రజారక్షణ చేయటం వల్లనే కదా సద్గతిని పొందారు. వారు ధర్మపరులు కాదా? పుణ్యమూర్తులు కాదా? మహారాజా! మరొక్క మాట. నీ రక్షణలో భూమిపైన మావంటి తపస్వులు సాధుమూర్తులుగా నిత్యం ధర్మమార్గంలో కార్యాచరణ తత్పరులై మనుగడ సాగిస్తున్నారు. దానికి నీ ధర్మాచరణం కదా కారణం! నీకొక అద్భుత విషయం చెబుతాను విను. ప్రఖ్యాత వీరులైన మధుకైటభులనే రాక్షసరాజుల పేర్లు వినే ఉంటావు కదా. వారి తనయుడే ధుంధుడనే మహావీరుడు. బలపరాక్రమ సంపన్నుడే కాదు, అఖండ తపోనిధి కూడా. తన తపశ్శక్తి వలన బ్రహ్మదేవుని నుండి అనేక వరాలు పొందాడు. ఆ వరప్రభావం వలన మిక్కిలి బలోపేతుడై దేవదానవగంధర్వాది సకల లోక వాసులకు జయింపశక్యము కానివాడై, అంతటా (అన్నిచోట్లా) సంచరిస్తున్నాడు. ఆ అసురుడిప్పుడు నా యొక్క ఆశ్రమానికి దగ్గరలో ఉన్నాడు. చాలా పెద్దవైన సముద్రపు ఇసుక మేటలలో ఒక సొరంగం ఏర్పరచుకొని, అందులో నిశ్చింతగా నిద్రపోతున్నాడు. ఇసుక తిన్నెలలో ఉన్న ఆ రాక్షస శ్రేష్ఠుని దేహం నుండి అతడు పీల్చి వదిలే గాలి, పొగతో కలిసిన అగ్నిజ్వాలలతో భయంకరంగా వ్యాపించి సంవత్సరానికొకసారి విజృంభించి చుట్టుప్రక్కల వారిని భయగ్రస్తులను చేస్తోంది. దగ్గరగా ఉన్న కొండలు, అడవులు ఆ ఇసుకదుమ్ము చేత కనబడకుండా ఉన్నాయి. మహాభయంకరమైన ఆ గాలులు ఎడా తెరపీ లేకుండా ఏడు రోజుల పాటు వీస్తుండడంతో మా ఆశ్రమంలో ఉన్నవారికీ, మాకూ చాలా కష్టంగా ఉన్నది. అందుచేత మహావీరుడవైన బృహదశ్వా! నీవా నీచుని సంహరించి మునులకు, ఆశ్రమవాసులకు, సమస్త జీవ జాలానికి సంతోషాన్ని కలుగజేయి. ఆ తపిదప ధన్యుడివై, అరణ్యవాసానికి వెళ్ళవచ్చు. గొప్ప తపస్సూ చేయవచ్చు. నా మాట విని ప్రస్తుతానికి ఈ ప్రయాణాన్ని ఆపుచేసి, ప్రజారక్షకుడివై కర్తవ్యపాలనలో నిమగ్నుడివై రాజధర్మాన్ని నిర్వహించి పుణ్యాత్ముడిగా కీర్తిమంతుడివి కా.

మహారాజా! ఒక ముఖ్య విషయం.

**నిర్మలమైన మనస్సుతో నేనింతకుముందే అస్త్ర సన్యాసం చేసి ఉన్నాను. కనుక శస్త్రాన్ని (బాణాన్ని) ధరించలేను. మంత్రపూరితమైన అస్త్రాన్ని ప్రయోగించలేను. తపస్సు చేయటానికి స్థిర నిశ్చయుడనై ఉన్నాను. కనుక ఉదంక మహర్షీ ! తపోవనానికి వెళ్ళక నాకు తప్పదు.**

**"ఎవ్వడమ్మహాసురు వధియించు పనికిఁ**
**బూను నతనికి నాత్మీయ భూరి శక్తి**
**యిచ్చి జయమిత్తు" నని యానతిచ్చె నధిప!**
**యాదరంబున నాకు చక్రాయుధుండు"**
**-ప 384 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

"ఎవడైతే మహాబలశాలి అయిన ధుంధువును వధించడానికి పూనుకుంటాడో అతనికి నా శక్తిని ప్రసాదిస్తాను. విజయం వరించేటట్లు చేస్తాను" అని సాక్షాత్తు విష్ణుమూర్తే నాతో చెప్పాడు. అందుచేత సాటిలేనిదైన విష్ణుశక్తిని సముపార్జించి మహావీరుడివిగా ప్రతిష్ఠను పొందుదువు గనక. లే మహావీరా! ఇటువంటి మహత్కార్యాన్ని చేయటానికి లోకంలో నీవు తప్ప మరో వీరుడు లేడు. నేను చెప్పిన పనిని గాక నీవు చేస్తే నీకు అధిక పుణ్యం, కీర్తి లభిస్తాయి. సద్గుణవర్యా! బృహదశ్వా! నేను వచించిన విధంగా చేసి నన్నే కాదు, లోకాన్నంతటినీ కాపాడవయ్యా! అని నమ్మబలికిన ఉదంక మహర్షికి నమస్కరించి బృహదశ్వుడు తన మనోగతాన్ని చెప్పసాగాడు.

**"ఆదిపురుషుడవైన నారాయణా! నన్ను రక్షించు" అని పెద్దగా ఆక్రోశిస్తున్న బ్రహ్మదేవుని ఆర్తి విష్ణుదేవుని మేల్కొలిపింది. యోగనిద్ర నుండి మేల్కొలిపిన విష్ణుమూర్తికి ఘోరమైన పరాక్రమంతో భయమనేది లేనివారు, దైత్యసింహాలు అయిన మధు కైటభులు కనిపించారు.**

"మహర్షిసత్తమా! నా మనవి కూడా వినవలసినది. నిర్మలమైన మనస్సుతో నేనింతకుముందే అస్త్ర సన్యాసం చేసి ఉన్నాను. కనుక శస్త్రాన్ని (బాణాన్ని) ధరించలేను. మంత్రపూరితమైన అస్త్రాన్ని ప్రయోగించలేను. తపస్సు చేయటానికి స్థిర నిశ్చయుడనై ఉన్నాను. కనుక ఉదంక మహర్షీ! తపోవనానికి వెళ్ళక నాకు తప్పదు. మీరు ఉత్తమోత్తమమైన తపస్సు చేత శ్రీహరినే సాక్షాత్కరింపచేసుకున్న మహనీయులు. మీ మాట జవ దాటరానిది. ఒక కోరిక కోరుతున్నాను. ఆదరించి నా కోరికను మన్నించండి.


**"అనఘుడు మత్సుతుండు కువలాశ్వుడు వీడె మహాబలుండు స**
**జ్జన హితకారి, ధైర్యనిధి సంభృతకీర్తి భవత్ప్రియార్థమై**
**జననుత! యమ్మహాసురునిఁ జంపుట కోపునవార్య శౌర్య వ**
**ర్ధనులగుచున్న పుత్రులును దాను నభేద్య భుజావిభూతితోన్"**
**-ప.389 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

"మహాత్మా! నా ప్రక్కన కూర్చుని ఉన్న కువలాశ్వుడు నా కుమారుడు. నా కొడుకే కాదు, మహాబలశాలి కూడా. అంతేకాదు. పాపరహితుడు. సజ్జనులకు మేలు చేకూర్చేవాడు. ధైర్యనిధి అనుకోండి. గొప్పకీర్తిని సంపాదించినవాడు. సద్గుణాలను పుణికిపుచ్చుకొన్నాడు. వారింపటానికి శక్యముకాని శౌర్యము గల పుత్రులు గలవాడు. నీకిష్టము కలిగేవిధంగా ఆ రాక్షసవీరుని వధించటానికి కువలాశ్వుడు మిక్కిలి సమర్థుడు. అతనికి తోడుగా పరాక్రమశాలురైన అతని పుత్రులు కూడా యుద్ధభూమిలో విక్రమిస్తారు. అంతదాకా ఎందుకు? కువలాశ్వుడొక్కడే ధుంధువుని చంపగలడు. పుత్రులతో కలిసి విజృంభిస్తే ఆ రాక్షసుడికి చావు తప్పదు. నా కుమారుని, ఆతని పుత్రులను మీతో తీసుకువెళ్ళండి. మీకు తప్పక విజయం లభిస్తుంది. నామీది వాత్సల్యంతో నేను తపోవనానికి వెళ్ళడానికి అనుజ్ఞ ఇవ్వవలసిందిగా ప్రార్థిస్తున్నాను" అని వినయ సంపన్నుడై మ్రొక్కిన బృహదశ్వుని లేవనెత్తి ఉదంకుడు "నాయనా! బృహదశ్వా! నీ కుమారునికి ఆ మహత్కార్యాన్ని అప్పజెప్పావు. చాలా సంతోషం కలిగింది. నీ తనయుడు అంత గొప్ప వీరుడే. నా కార్యాన్ని తప్పక సాధిస్తాడు. నాకా నమ్మకముంది. నీవు నిశ్చింతగా అరణ్యానికి వెళ్ళి తపస్సులో నిమగ్నుడివి కా" అని అనుజ్ఞ ఇవ్వడంతో బృహదశ్వుడు తపోవనానికి వెళ్ళిపోయాడు. ఉదంకుడావిధంగా అనుజ్ఞ ఇవ్వడానికి ఆ మహర్షి మనసులో మెదులుతున్న శ్రీహరి మాటలే కారణం. "శ్రీహరి ధుంధువుని కువలాశ్వుడు సంహరిస్తాడని చెప్పాడు కదా! – విష్ణువు తన శక్తి నాతనికి ప్రసాదిస్తానన్నాడు కదా! తన యోగశక్తిని కూడా కువలాశ్వునికిమ్మని చెప్పాడు ఆ వైకుంఠ ధాముడు. కాబట్టి కువలాశ్వుడే ధుంధువుని వధిస్తాడ'ని నిశ్చయించి బృహదశ్వుని తపో గమనానికి అనుమతిచ్చాడు ఉదంకముని" అని కొద్దిసేపు చెప్పడం ఆపాడు సూతమహర్షి.

"మహాత్మా! ఒక విషయం వినాలని కుతూహలంగా ఉంది. మధ్యలో ఆపుతున్నానని అనుకోకండి" అన్న శౌనకుని వైపు చూశాడు సూతుడు.

"అడుగు నాయనా! అనుమానం కలిగినప్పుడు అడిగి తెలుసుకోవలసినదే. తప్పు లేదు. నీవు వినాలనుకొన్న విషయం ఏమిటి? చెప్పు" అన్న సూతమహర్షి వాత్సల్యానికి సంతోషిస్తూ "మహర్షిసత్తమా! ధుంధువు మధుకైటభుల పుత్రుడు గదా! ఆ మధుకైటభుల వృత్తాంతం చెప్పవలసిందిగా కోరుతున్నాను. ఆ క్రూర రాక్షసులను ఎవరు వధించారు?" అని అడగడంతో శౌనకుని చూస్తూ చెప్పసాగాడు సూతుడు.

"మునులారా! అందరూ వినండి. శౌనకుడు చక్కని ప్రశ్న వేశాడు. పూర్వకాలంలో ఒకప్పుడు మూడు లోకాలు కలిసి ఒకే ఒక మహాసముద్రమై మొత్తం జలమయమైపోయాయి. అప్పుడు హరి ఒక్కడే ఆదిశేషుని పర్యంకముగా (పరుపుగా) కలిగి,



ఆ మొత్తం పాన్పు మీద యోగనిద్రలో సుఖంగా చాలాకాలం గడిపాడు. ఆ సమయంలో మహాబలవంతులైన మధుకైటభులనే ఇద్దరు రాక్షసులు విష్ణువు దగ్గరకు వచ్చారు. శత్రువుల నందరినీ నామరూపాలు లేకుండాచేసిన ఆ మహావీరులు పరమాత్ముడైన నారాయణుని నాభి కమలంలో ప్రకాశిస్తూ ఉన్న బ్రహ్మదేవుని చూశారు. దర్పించిన ఆ రాక్షసులు బ్రహ్మను నానావిధాలుగా కొట్టి హింసించసాగారు. వారి వ్రేటులకు (దెబ్బలకు) భయపడిపోయిన బ్రహ్మ ఆ బాధకు తట్టుకోలేక పెద్దగా ఏడ్చాడు. ''ఆదిపురుషుడవైన నారాయణా! నన్ను రక్షించు'' అని పెద్దగా ఆక్రోశిస్తున్న బ్రహ్మదేవుని ఆర్తి విష్ణుదేవుని మేల్కొలిపింది. యోగనిద్ర నుండి మేల్కొలిపిన విష్ణుమూర్తికి ఘోరమైన పరాక్రమంతో భయమనేది లేనివారు, దైత్యసింహులు అయిన మధు కైటభులు కనిపించారు. వారిని చూసిన శ్రీహరి ''ఓ రాక్షస వీరులారా! ఎందుకు కమలంలో ఉన్న మహాత్ముని బాధిస్తున్నారు? మీ యొక్క ఘనమైన బలానికి, ప్రకాశమానమైన శౌర్యానికి చాలా సంతోషించాను. మీకిష్టమైన వరాలు కోరుకోండి వెంటనే ఇస్తాను'' అని వారిని ప్రసన్నులను చేశాడు. కాని వారు బ్రహ్మను వేధించటం మాని విష్ణువు వైపు దృష్టి సారించారు. వెంటనే –

**"అనిన కలకల నవ్వియయ్యసురవరులు**
**"నీవు మాకేమి యిచ్చెదు? నీకు మేము**
**వరము లిచ్చెద మడుగుము వలచితేని**
**ననిన వారల కిట్లన్న విభుండు"**

**-ప.393 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

విష్ణుమూర్తి తమకు వరాలిస్తానన్నందుకు కలకల నవ్వి మధుకైటభులు ''శ్రీహరీ! నీవు మాకేమి వరాలిస్తావులే? మేమే నీకు వరాలిస్తాము. కావలిస్తే అడిగిచూడు'' అని గర్వంతో పలికారు. తామే విష్ణువుకన్న గొప్పవారమన్న అహంకారాన్ని ప్రదర్శించిన ఆ రాక్షస వీరులను చూసి విష్ణుమూర్తి వారి మాటలతో వారినే దెబ్బ తీశాడు.

**"సత్యవ్రతులార! వరం**
**బత్యంత ప్రీతి మిమ్ము నడిగెద లోక**
**ప్రీత్యర్థముగా నాచే**
**మృత్యువునంబొందు డిపుడ మీర లిరువురున్"**

**-ప.394 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**



''సత్యవ్రతాన్ని దీక్షగా పాటించి ఆడిన మాటను ఎన్నడూ తప్పక నిలబెట్టుకునే రాక్షస శ్రేష్ఠులారా! నాకు మీరు వరం ఇస్తానని చెప్పారు. మీ సత్య దీక్ష నాకెంతో సంతోషాన్ని కలిగించింది. అందుకని మిమ్మల్ని ఒక వరం కోరుతాను. అదేమంటే – ఇప్పుడే మీ ఇద్దరూ నా చేత మరణాన్ని పొందాలి. ఆ విధంగా మీరు మరణిస్తే లోకానికి ప్రీతి కలుగుతుంది. తమను బాధించేవారు లేరు కదా అని సర్వలోకవాసులూ సంతోషిస్తారు. ఈ ఒక్క వరం ఇవ్వండి. మీ గొప్పతనాన్ని చూసి సర్వలోకవాసులూ సర్వకాలాల వారూ చాలా చక్కగా మెచ్చుకుంటారు'' అని విష్ణువనగానే మధు కైటభులిద్దరూ ఒకరి మొగం ఒకరు చూసుకున్నారు. తామిస్తామన్న వరం ఇంత దారుణానికి దారి తీస్తుందా? అని మనసులోనే బాధపడ్డారు. తమ మరణానికి తామే బాధ్యులమయ్యామా అని కుమిలిపోయారు. ఒక్కక్షణంలో తేరుకున్నవారై ఆ రాక్షసరాజులు విష్ణువుని చూసి తమ అభిప్రాయాన్ని తెలియజేశారు.

''జనార్దనా! నవ్వులాటకైనా సరే మేమెప్పుడూ అబద్ధమాడము. ఒక మాట అన్నామంటే – ఆ మాట మీదే నిలబడేవారమే కాని మాట తప్పే వాళ్ళం కాము. అత్యధికమైన పరాక్రమము, గొప్పబలము, అనంతమైన ధైర్యము కలిగిన యశోవంతులము. ఏవిధంగా చూసినా, కాలగతిని తప్పించటం ఎవరికైనా సాధ్యమా? అదిసరే. నీ ఇష్టప్రకారం, నీకు సంతోషం కలిగేటట్లు నీకు మా ప్రాణాలు ఇవ్వటానికి సిద్ధంగా ఉన్నాం. మేము మనసులో కూడా మరణానికి ఏమాత్రం బాధపడటం లేదు. శ్రీహరీ! మరొకమాట. నీవు మమ్మల్ని చంపాలనుకుంటే – నీళ్ళు లేని చోట మాత్రమే చంపాలి. ఇది నిజం. నిన్ను వంచించటానికి చెప్పేమాట కాదు. మేమెన్నడూ బొంకేవాళ్ళం కాదు. నీళ్ళు లేని ప్రదేశం లోనే వధింపబడగలము. మేము భయపడటం లేదు. నీ వలన చావటానికి సిద్ధంగా ఉన్నాము'' అని మధుకైటభులు చెప్పటంతో శ్రీహరి పరిహాస పూర్వకంగా ఒక నవ్వు నవ్వాడు. తన చుట్టూ ఉన్న త్రిలోకాలను చూశాడు. అన్నీ జలంతో నిండి ఉన్నాయి. వెంటనే తన తొడలను పరుపుగా, వాటిపైకి నీరు రాకుండా చేశాడు. తన తొడలపైన మధుకైటభుల శిరస్సులుంచాడు. కఠినమైన, వాడి అయిన సుదర్శన చక్రధారలతో వారి తలలను నరికివేశాడు. మధుకైటభుల వధతో త్రిలోకవాసులు, మహర్షులు – సర్వులూ సంతోషవార్ధిలో మునిగి తేలారు.

**శ్రీహరి పరిహాస పూర్వకంగా ఒక నవ్వు నవ్వాడు. తన చుట్టూ ఉన్న త్రిలోకాలను చూశాడు. అన్నీ జలంతో నిండి ఉన్నాయి. వెంటనే తన తొడలను పరుపుగా, వాటిపైకి నీరు రాకుండా చేశాడు. తన తొడలపైన మధుకైటభుల శిరస్సులుంచాడు. కఠినమైన, వాడి అయిన సుదర్శన చక్రధారలతో వారి తలలను నరికివేశాడు.**

మునులారా! ఆ మధుకైటభుల పుత్రుడే ధుంధువు అనే రాక్షస సార్వభౌముడు. మధుకైటభులను సంహరించటానికి విష్ణువే రావలసి వచ్చింది. ధుంధువుని వధించటానికి విష్ణుమూర్తి వరం చేత లభించిన శౌర్యప్రతాపాల వల్లను యోగబలం గల ఉదంక మహర్షి నియోగం వల్లను కువలాశ్వుడు తన బలప్రతాపాలను వినియోగించవలసి వచ్చింది.

''ఇక ధుంధువుని కువలాశ్వుడు ఏవిధంగా ఎదిరించగలిగాడో చెబుతాను వినండి'' అని చెప్పటం మొదలుపెట్టాడు సూతమహర్షి. ధుంధువు బ్రహ్మదేవుని గురించి అఖండమైన తపస్సు చేసి అనేక వరాలు పొందాడు. ఆ వర గర్వం చేత దేవేంద్రాది దేవ విభులను ఓడించి అవమానించాడు. ధుంధుని శౌర్యప్రతాపాల ముందు ఇంద్రాది దిక్పతులెవరూ నిలవలేకపోయారు. అది ఉదంక మహర్షి చెప్పగా విన్న కువలాశ్వుడు దేవతలను రక్షించాలని తలపోశాడు. తండ్రి వద్ద అనుమతి తీసుకున్నవాడై ఒక శుభదినాన మంచి ముహూర్తాన్ని ఎంచుకుని కువలాశ్వుడు ధుంధుడి మీదకు దండయాత్రగా బయలుదేరాడు. మంత్రసిద్ధుడైన ఉదంక మహర్షిని ముందుంచుకొని, ఆ యోగి మార్గదర్శకంలో ప్రయాణమైనాడు కువలాశ్వుడు. సజ్జనుల చేత పొగడబడిన తేజస్సు గల ఆ కువలాశ్వ మహీపాలుడు దనుజులనందరినీ వధించి తీరుతాననే దీక్ష పూనాడు. మహాభయంకరమైన యుద్ధాన్ని ఒక పండుగ వేడుకగా భావించాడు. వేలసంఖ్యలో తనతోపాటు యుద్ధానికి నడిచివస్తున్న వీరాధివీరులు, సాహసోపేతులు, ధైర్యసంపన్నులు అయిన పుత్రులను చూసి పరమానందభరితుడైనాడు కువలాశ్వుడు. దండయాత్ర తప్పక సఫలీకృతం అవుతుందని

మురిసిపోయాడు.

**"చతురంగ ధ్వజినీపద ప్రవిహతిన్ సర్వం సహా చక్ర మా**
**తత కంపంబున నేగె; నపూజపొంద దైత్యారి యా రాజునం**
**దతులంబైన నిజాంశ శక్తి సొనిపెన్ హర్షించిరింద్రాది దే**
**వతులున్ సన్ముని ముఖ్యులున్ నృపతి కైశ్వర్యోన్నతిం జేయుచున్"**

**-ప.403 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

" మునులారా! కువలాశ్వుడు – ధుంధునిపైకి యుద్ధానికి తరలినప్పుడు చతురంగ బలాలు ఆ మహారాజు వెంట నడిచాయి. చతురంగ బలాలు (రథ గజ తురగ కాల్బల) గల ఆ సైన్యం నడుస్తున్నప్పుడు భూమి కంపించింది. ఉదంకమునిని ముందుగా పెట్టుకుని రథం మీద నిలిచి కువలాశ్వుడు దండయాత్రకు బయలుదేరినట్లు గ్రహించిన విష్ణుమూర్తి సాటిలేనిదైన తన అంశను ఆ రాజులో ప్రవేశపెట్టాడు. ఎప్పుడైతే శ్రీమహావిష్ణువు యొక్క అంశ కువలాశ్వునిలో చేరిందో అప్పుడు దానికి హర్షించిన దేవేంద్రాది దేవతలు, మహాత్ములైన మహర్షులు తమ తమ శక్తులను ఆ మహారాజులో నిక్షిప్తం చేశారు. కువలాశ్వునిలో నారాయణాంశ, సకల దేవతల శక్తులు, మహర్షుల ఆశీస్సులు చేరడంతో ఆతడు దేదీప్యమానంగా వెలుగొందాడు. దేవలోకం నుంచి మంగళవాద్యాలు వినసొంపుగా మ్రోగాయి. దేవతలు పుష్పవృష్టిని కురిపించారు. విజయ సూచకంగా పిల్లవాయువులు వీచాయి. మహారాజు దండయాత్రకు శుభశకునాలు కలగడమే కాక గగనంలో దేవతలతో ఉన్న విమానాలు గుమిగూడి కన్పించాయి. అనుకూల వాతావరణం ఏర్పడిందనటానికి జంతువుల, పక్షుల శుభ సంచారం కన్నుల విందు చేసింది. సకల శుభ శకునాలు కువలాశ్వుని ఆనందింప చేస్తుండగా సైన్య సమేతుడైన ఆ మహారాజు సముద్ర తీరాన్ని చేరాడు. వెంటనే సైన్యాధిపతులు కావలసినన్ని సైనిక శిబిరాలను ఏర్పాటు చేశారు. శస్త్రాస్త్ర విద్యలలో ఆరితేరినవారు, బలసంపన్నులు, యుద్ధ నిపుణులు అయిన తన పుత్రులను ఆ సాగర తీరంలోని ఇసుక తిన్నెలను త్రవ్వమని ఆజ్ఞాపించాడు కువలాశ్వుడు. ఆ రాకుమారులు వెంటనే తండ్రి ఆజ్ఞను శిరసా వహించి, ఏడు రోజులపాటు బల్లాలు, గునపాలు, సమ్మెటలు, కర్రలు మొదలైన పరికరాలతో ఆ ఇసుక తిన్నెలను సొరంగ రూపంగా త్రవ్వారు. ఆ సొరంగం మధ్యంలో హాయిగా నిద్రపోతున్న రాక్షసవీరుని చూశారు. ఆ దైత్యుని ముఖం నుంచి వెలువడుతున్న వేడి వేడి నిట్టూర్పులు, అగ్నిజ్వాలలతో కలిసి ఆ ప్రదేశమంతా వ్యాపించి సమస్త జీవజాలాన్ని హతమారుస్తున్నాయా అన్నట్లున్నాయి. ఆ రాక్షసుని చూసిన వేలాది రాజపుత్రులు ఒక్కసారిగా విజృంభించారు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వాడిగల పట్టిసలు, గదలు, కత్తులు, గండ్రగొడ్డళ్ళు, శూలాలు మొదలైన ఆయుధాలతో రాక్షసుని కొడుతూ, ఆతనిని నిద్రనుండి మేల్కొల్పటానికి వివిధ ప్రయత్నాలు చేశారు. ఆ విధంగా ధుంధు రాక్షసుని కువలాశ్వుని పుత్రులు కొట్టి కొట్టి వేధించగా, చాలాసేపటికి రాక్షసుడు తన శరీరాన్ని తీవ్రంగా కదిలించాడు. నోరు తెరిచి వికృతంగా ఆవులించాడు.

**"ఘోరున విస్ఫులింగములు వొడ్మగ తన్ముఖ నేత్ర నాసికా**
**ద్వారములందు వెల్వడియె దారుణవహ్ని శిఖా కలాపముల్**
**వారకయందు మ్రందిరనివార్యులు రాజకుమారులందఱున్**
**ఘోరత సాగరుల్ కపిలు కోపమునన్ నశియించు చాడ్పునన్"**

**-409 ప – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

ఎప్పుడైతే రాక్షసుడు నిద్ర నుంచి మేల్కొన్నాడో అప్పుడు జరిగిన దారుణం వర్ణనాతీతం. ఆ క్రూర రాక్షసుడి నోటి నుంచి, కన్నుల నుంచి, ముక్కు నుంచి అగ్ని కణాలతో కూడిన అగ్నిజ్వాలలు బయటకు వచ్చి ఆ ప్రదేశమంతా వ్యాపించాయి. భయంకరమైన ఆ మంటల నుండి కువలాశ్వుని కుమారులు తప్పించుకోలేక నశించారు. అది ఎలా ఉందంటే పూర్వం కపిల మహర్షి కోపాగ్నికి తట్టుకోలేక సగర పుత్రులందరూ మసైపోయిన వైనాన్ని తలపింప చేస్తోందా అన్నట్లు ఘోరంగా ఉంది.

కువలాశ్వుని వేలమంది పుత్రులలో ధుంధుని శరీరంలో నుండి పుట్టిన అగ్ని జ్వాలల నుండి తప్పించుకొని బ్రతిక బట్టగట్టిన వారు ముగ్గురే ముగ్గురు. వాళ్ళు – దృఢాశ్వ, కపిలాశ్వ, భద్రాశ్వులనే వారు. వేలాదిమంది పుత్రులు మరణించటంతో కువలాశ్వుడు పట్టరాని కోపంతో ప్రళయకాలంలో మండిపడే సూర్యుడిలాగా శత్రువు పైకి విజృంభించాడు. అది చూసిన రాక్షసుడు క్రోధావేశంతో లేచి నిలబడి ఒక శూలం తీసుకుని కువలాశ్వుని పైకి ప్రయోగించాడు. దానికి మరింత కోపం వహించిన కువలాశ్వుడు తన యోగవిద్య వలన ఉత్పన్నమైన జలప్రవాహం చేత ధుంధుని శరీరం నుంచి జనించిన అగ్నిజ్వాలల నన్నిటినీ చల్లార్చివేశాడు. అంతటితో ఆగక కువలాశ్వుడు ఆ రాక్షసవీరునిపైన బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు.

**"ఆ దివ్యాస్త్ర జ్వలనము**
**భూ దిగ్గగనములు వెలుగ పొదివి మహోగ్రం**
**బై దానవేంద్రు దేహము**
**బూదిగ నొనరించె చిత్రముగ నొక మాత్రన్"**

**-ప.411 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

కువలాశ్వుడు ప్రయోగించిన బ్రహ్మాస్త్రము భూమిని, దిక్కులను, ఆకాశాన్ని వెలిగింపచేస్తూ, విశ్వమంతా వ్యాపించి, మహాభయంకరంగా వెళ్ళి ఆ రాక్షసరాజు దేహాన్ని తాకింది. ఆ అస్త్ర జ్వాల తగిలీ తగలగానే, చిత్రంగా ధుంధుని దేహమంతా బూడిదపాలయింది. ఇదంతా ఒక తృటికాలంలో జరిగిపోయింది'' అని సూతమహర్షి చెప్పగానే ఒక ముని లేచి

ఆయన వాగ్ధాటిని ఒక్కక్షణం ఆపాడు. ''మహాత్మా! నాకొక సందేహం. ధుంధుడు బ్రహ్మవరప్రసాది గదా! కువలాశ్వుడితో ఘోరంగా యుద్ధం చేయలేదా? వెంటనే బ్రహ్మాస్త్రానికి ఎందుకు బలైపోయాడు?'' అని అడిగాడు.

''ఆ రాక్షసరాజు గొప్పతనం వల్లనే అతని కళ్ళు మొదలైన అవయవాల నుంచి మారణ కారకాలైన అగ్నిజ్వాలలు వెలువడేవి. వాటిని ఎవరూ తట్టుకోలేకపోవడం వల్లనే మహావీరులైన కువలాశ్వుని కుమారులు కూడా దగ్ధమైపోయారు గదా. విష్ణ్వంశ గల కువలాశ్వుడు, ఉదంక మహర్షి వల్ల పొందిన యోగవిద్యతో జలాన్ని సృష్టి చేసి ఆ రాక్షసుని అగ్నిజ్వాలలను ఆర్పగలిగాడు. అది తెలుసుకోలేకపోయిన ధుంధుడు క్షణమాత్రంలోనే బ్రహ్మాస్త్ర జ్వాలలకు ఆహుతి అయ్యాడు. జలశక్తిని గ్రహించి రాక్షసుడు ఎదిరించే లోపలే కువలాశ్వుడు బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించడం, ఆ దివ్యాస్త్రం రాక్షసేశ్వరుని పరిమార్చటం జరిగిపోయాయి'' అని సూత మహర్షి చెప్పి – ''సరేనా?'' అన్నట్లు ఆ ముని వైపు చూశాడు. ముని అంగీకారంతో మళ్ళీ చెప్పటం ప్రారంభించాడు సూతమహర్షి.

**"సురశత్రుడైన ధుంధునిఁ**
**బరిమార్చితి వీవు జగదభయకారివి భూ**
**వర! ధుంధు మారుడనగాఁ**
**బరగు"మనిరి సురలు మునులు పార్థివముఖ్యా"**

**-ప.413 – చతుర్థాశ్వాసము – అరణ్యపర్వము – మహాభారతము**

''మహారాజా! దేవతలందరికీ శత్రువైన ధుంధుని నామరూపాలు లేకుండా పరిమార్చావు. జగత్తుకంతటికీ అభయాన్ని ప్రసాదించేవాడివి సుమా! అందుచేత, కువలాశ్వ మహీపాలా! నీవు నేటినుంచి 'ధుంధుమారు'డనే బిరుద నామంతో వర్ధిల్లుమని దేవతలు, మహర్షులు కువలాశ్వుని ఆశీర్వదించారు. దేవతల, మునుల అనుగ్రహానికి పాత్రుడైన కువలాశ్వుడు – మహాత్ములారా! మీరు వరప్రదాత లైనారు గనుక నా మనవి ఆలకించండి. ''అనవరత దానశీలతయు, విష్ణునితోడి సఖ్యంబును'' వరాలుగా నాకు ప్రసాదించండి అని అడగడంతో ఉదంకాది మహర్షులు, దేవేంద్రాది దేవతలు కువలాశ్వునికా వరాలిచ్చి తమ తమ నివాసాలకు వెళ్ళిపోయారు. కువలాశ్వుడు విజయోత్సాహంతో తన నగరికి వెళ్ళి సార్వభౌముడై కలకాలం సుఖ సంపదలతో తులతూగాడ''ని చెప్పి సూతమహర్షి వేదిక మీద నుంచి లేవడంతో మునులంతా ఆశ్రమోన్ముఖులు కావటానికి లేచారు. విష్ణ్వంశను పొంది, ఉదంక మహర్షి వల్ల యోగశక్తి నార్జించి, రాక్షస సంహారానికి కారకుడైన కువలాశ్వ మహారాజు యొక్క వీర చరిత్రను పదే పదే సంభాషించుకుంటూ మునులందరూ సూత మహర్షి వెంబడి నడుస్తూ ఆశ్రమాలకు చేరుకున్నారు.


## శ్రీ వేంకటాచల మాహాత్మ్య ముద్రణకు దాతల ఆహ్వానం

'శ్రీ వేంకటేశం' మాసపత్రికలో ధారావాహికగా ప్రచురితమైనవి, మరియు శ్రీ వేంకటేశ్వర పరిశోధకులు డా. విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, తిరుపతి గారిచే ఈ క్రింది పురాణాల నుండి తెలుగులో అనువదించబడినవి. భక్తులు వీటిని మరింత చదివి స్వామి తత్త్వమును తెలుసుకోవాలనే కోరికతో పుస్తకముగా ముద్రించుటకు ఆర్థిక సహాయం కోరుచున్నాము. దాతలు ఎన్నుకొన్న పుస్తకముపై దాతగా వారి పేరును ముద్రించుటతోపాటు కొన్ని పుస్తకములు ఇవ్వడబడును. మరియు శ్రీ వేంకటేశ్వరుని కృపాకటాక్షములు లభించగలవు.

1. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, మొదటి సంపుటం, స్కాందపురాణ భాగం (250 పేజీలు)
2. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం, రెండవ సంపుటం, వరాహ పురాణ భాగం (200 పేజీలు)
3. శ్రీ వేంకటాచల మాహాత్మ్యం మూడవ సంపుటం, పద్మ, గరుడ, హరివంశ పురాణ భాగములు (200 పేజీలు)

### శ్రీ వేంకటేశ్వర మహామంత్ర పీఠము

హైదరాబాద్. ఫోన్: 040-27175050, 9348212354. Email: srivenkatesham@gmail.com



# జగద్గురువు శ్రీ ఆదిశంకరాచార్యులు

– చిల్లర సీతారామారావు

భారతదేశం ధర్మభూమి. భారతీయ సంస్కృతిని, సనాతన ధర్మమును కాపాడుటకు అప్పుడప్పుడు కొందరు దివ్యపురుషులు దివి నుండి భువికి దిగివచ్చి అవిరళముగా కృషి చేసి అదృశ్యమవుతుంటారు. అటువంటివారిలో శ్రీ ఆదిశంకరాచార్యుల వారొకరు. ధర్మరక్షణ నిమిత్తం అవతరించిన మహాపురుషుడు శ్రీ శంకరాచార్యులు. ధర్మకార్యములో అవసరమైన నిర్మాణాత్మక సంస్కరణలు అనేకం చేశారు. ధర్మ రక్షణ ఆయన వలననే జరిగింది.

కేరళ ప్రాంతములో కాలడి అనునొక అగ్రహారమున్నది. ఆ అగ్రహారము నందు నంబూద్రి కుటుంబానికి చెందిన శివగురువు అను నతడు తన భార్య ఆర్యాంబతో కలిసి నివసిస్తుండేవాడు. ఆర్యాంబ సుగుణ సంపద కల్గిన విదుషీమణి. బహు కాలము వరకు ఆ దంపతులకు సంతానము కలగలేదు. వయసు మీద పడుతున్న సమయములో సంతానం లేకుండడం వారికి అమితమైన దుఃఖమును కలిగించింది. వారు ఆ గ్రామములో ఉన్న వృషభాచలేశ్వర ఆలయమునకు వెళ్ళి భక్తి శ్రద్ధలతో తపము చేయసాగారు. వారి తపమునకు ప్రసన్నుడై పరమేశ్వరుడు శివగురువు స్వప్నమున సాక్షాత్కరించాడు. మీ తపమునకు మెచ్చాను. మీకు పుత్ర సంతతిని ప్రసాదిస్తున్నాను. దీర్ఘాయువు కలిగిన కుమారుడు, దుష్టస్వభావము కలిగినవాడు కావలెనా? అల్పాయుష్షు కలిగి సర్వజ్ఞుడైన పుత్రుడు కావలెనా? అని ప్రశ్నించాడు. శివగురువు కొద్ది తడవు ఆలోచించి అల్పాయుర్దాయము కలిగినవాడయిననూ, సర్వజ్ఞుడైన పుత్రుడిని ప్రసాదించమని ప్రార్థించాడు. తథాస్తు అని పలికి అంతర్ధానమయ్యాడు పరమేశ్వరుడు. శివగురువు వెంటనే మేల్కొని ఆర్యాంబకు తన స్వప్నమును తెలియబరిచాడు. శివానుగ్రహం వలన ఆర్యాంబ కొంతకాలానికి గర్భం దాల్చింది. విభవ నామ సంవత్సర ఆర్ద్రా నక్షత్ర యుక్త వైశాఖ శుద్ధ పంచమి క్రీ.శ 788 శుభ ఘడియలలో మగ శిశువును ఆర్యాంబ ప్రసవించింది. శివగురువు ఆ బాలుడికి జాతక కర్మలు నిర్వహించి శంకరుడు అని నామకరణం చేశాడు. పువ్వు పుట్టగానే పరిమళించునట్టుల శంకరులు సంవత్సరము నిండేసరికి



స్పష్టముగా మాట్లాడసాగాడు. అది అందరికీ విస్మయము కలిగించింది. రెండవ సంవత్సరం వచ్చేసరికి చదవడం రాయడం వచ్చింది. మూడవ సంవత్సరం వచ్చేసరికి కావ్య శాస్త్రాది సకల విద్యలు సునాయాసంగా అభ్యసిస్తూ దిన దినాభివృద్ధి పొందసాగాడు. శంకరుల విద్యాగ్రహణ శక్తి గమనించి ఒక మంచి గురువును నియమించాడు శివగురువు. శంకరులు సూక్ష్మగ్రాహి. ఒకసారి వినగానే తిరిగి తక్షణమే అప్పగించేవాడు. గురువు పాఠాలు చెప్పేటప్పుడు తప్పులు దొరికితే సరిదిద్దేవాడు. శాస్త్రార్థములను వివరించడంలో మహామహులను ఎదుర్కొని ఓడించారు.

శంకరులు మూడు సంవత్సరముల ప్రాయము లోనికి ప్రవేశించగానే వారికి పితృ వియోగం కలిగింది. అతి కష్టము మీద ఒక సంవత్సరము గడిచిపోయింది. పిదప ఆర్యాంబ ఉపనయనము చేయించి గురుకులమునకు పంపించింది. శంకరులు రెండు మూడు మాసములలోనే సమస్త విద్యలు నేర్చుకున్నారు. శంకరులు గురుకులములో నున్నప్పుడు ఒక విచిత్ర సంఘటన జరిగింది. ఒకనాడు శంకరులు భిక్ష కొరకు ఒకరి ఇంటికి వెళ్ళారు. ఆ ఇంటి ఇల్లాలు కడు పేదరాలు. భిక్ష కొరకు వచ్చినవారిని తిరిగి పంపించడం ఇష్టం లేక ఇల్లంతా వెతికి ఒక ఎండిపోయిన ఉసిరికాయ దొరికితే దానిని తెచ్చి శంకరుల వారికి భిక్షగా వేసింది. ఆ ఇల్లాలు ఇచ్చిన ఉసిరికను భక్తితో స్వీకరించారు శంకరులు. ఆమె మానసిక వ్యధను గమనించి, ఆమె దారిద్ర్య స్థితికి బాధపడి మహాలక్ష్మిని స్తోత్రం చేశారు. మహాలక్ష్మి సాక్షాత్కరించింది. సాక్షాత్కరించిన మహాలక్ష్మిని ఆ ఇల్లాలి దారిద్ర్యమును తొలగించమని ప్రార్థించారు. లక్ష్మీదేవి కరుణించి బంగారు ఉసిరికాయల వర్షమును కురిపించింది. ఆ ఇల్లాలి దారిద్ర్యము తొలగిపోయింది. శంకరులవారి మహాలక్ష్మి స్తోత్రము కనకధారా స్తోత్రముగా ప్రసిద్ధి గాంచింది.

ఏడు సంవత్సరముల ప్రాయములోనే సకల విద్యలు నేర్చుకుని శంకరులు గురుకులమునుండి గృహమునకు వచ్చి మాతృమూర్తికి సేవలు చేయసాగారు. ఆర్యాంబ ప్రతిరోజూ పూర్ణానదికి వెళ్ళి స్నానము చేసి మరల వస్తున్నప్పుడు బిందెతో నీళ్ళు తెచ్చేది. ఒకసారి వేసవి కాలంలో ఆర్యాంబ స్నానానికని పోయి తిరిగి వస్తూ ఎండవేడిమి తట్టుకోలేక క్రింద పడిపోయింది. ఈ విషయాన్ని కొందరు శంకరుల వారికి తెలియజేశారు. వారు తామరాకులను తెచ్చి వాటిని నేలపై పరచి, ఆ ఆకులపై తల్లిని నడిపిస్తూ ఇంటికి తీసుకొని వచ్చారు. తల్లి కష్టపడకుండా ఉండాలంటే పూర్ణానది ఇంటికి సమీపంలో ప్రవహించాలి అని భావించి గంగాదేవిని స్తుతించారు. శంకరుల వారి భక్తికి ప్రసన్నురాలై పూర్ణానది మరుసటి రోజునుండి శంకరుల వారి ఇంటికి సమీపమున ప్రవహించసాగింది.

శంకరుల వారికి సన్యాసమును స్వీకరించవలెనన్న కాంక్ష అధికముగా నుండెడిది. తల్లికి తన కోరికను వెల్లడించి సన్యాసమును తీసుకొనుటకు అనుమతినివ్వమని ప్రార్థించారు. తల్లి అంగీకరించలేదు. తల్లి ప్రథమ గురువు. తల్లి అనుమతి, ఆశీర్వాదము లేకపోతే ఏ సిద్ధీ లభించదు. అందువలన ఆయన మాయను ఆశ్రయించారు. ఒకనాడు తల్లితో కలిసి స్నానము చేస్తుండగా ఒక మొసలి వారి కాలును పట్టుకున్నది. మొసలి పట్టుకున్నదని వారు బిగ్గరగా కేకలు వేయసాగారు. ఆర్యాంబ ఆ కేకలు విని నది దగ్గరకు వచ్చింది. అమ్మా నేను బ్రతకనేమో అనిపిస్తోంది. ఇప్పటికయినా నాకు సన్యసించుటకు అనుమతి నివ్వమని అడిగారు శంకరులు. కొడుకు బాధ చూడలేక, ఎలాగైనా బ్రతికితే చాలు అనుకొని సన్యసించుటకు శంకరుల వారికి అనుమతినిచ్చింది. వెంటనే మొసలి కాలు విడిచిపెట్టింది. శంకరుల వారు నదిలో నుండి బయటకు వచ్చారు. నాయనా! ఇంటికి పోదాం పద అని పలికింది ఆర్యాంబ. శంకరులు వారు నవ్వుతూ నేను మనస్సులోనే సన్యాసమును స్వీకరించాను. నేను ఇంటికి రాకూడదు అని పలికారు. నీవు వెళ్ళిపోతే నన్ను రక్షించేవారెవ్వరు? అని రోదించింది ఆర్యాంబ. అమ్మా! బాధపడకు. నిన్ను దాయాదులకు అప్పగిస్తాను. ఆఖరి సమయములో నీ దగ్గరికి వస్తాను. నీ అంత్యక్రియలు పూర్తి గావిస్తాను అని పలికి వెళ్ళబోతున్న సమయంలో ఒక స్వరము వినిపించింది. శంకరా! నీవు పూర్ణానదిని అగ్రహారమునకు తేవడం వలన ఆ అలల తాకిడికి గోపాలస్వామి ఆలయం బీటలు

వారింది. ఆ స్వామిని వేరొక చోట స్థాపించి వెళ్ళుము. ఆ స్వరము భగవంతుడిదిగా భావించి ఆలయము లోని గోపాలస్వామిని వేరొక చోట స్థాపించారు శంకరులు.

శంకరులు గురువాన్వేషణలో నర్మదానదీ ప్రాంతమునకు వచ్చారు. అక్కడ గోవింద భగవత్పాదుల వారి ఆశ్రమమున్నది. ఆయన అమరకాంతమనే గుహలో తపస్సు చేసుకుంటున్నారు. శంకరులు యోగశక్తి ద్వారా గుహ లోనికి ప్రవేశించి భగవత్పాదుల వారిని దర్శించుకొని వారి చరణములకు ప్రణమిల్లారు. గోవింద భగవత్పాదులు శంకరులను చూచి ఆనందించారు. శంకరుల వారికి విధి విధానంగా సన్యాస దీక్షను ఇచ్చి శంకరాచార్యులు అని నామకరణం చేశారు. శంకరాచార్యులు ఆశ్రమంలో నాలుగేళ్ళు ఉన్నారు. వేద శాస్త్రములను అధ్యయనం చేశారు. గోవింద భగవత్పాదుల వారి అనుమతితో మాండూక్యోపనిషత్తుకు భాష్యం రచించారు. అంతే కాకుండా ఇంకా అనేక గ్రంథములను రచించారు. ఒకసారి నర్మదానది పొంగి ఆశ్రమమును, ఇతర ప్రాంతములను ముంచేసింది. శంకరులు ఒక కమండలమును మంత్రించి ప్రవాహమునకు ఎదురుగా ఉంచారు. ఉప్పొంగుతున్న నర్మదానది ఆ కమండలంలో ఇమిడిపోయింది. అంతవరకూ సమాధిలో ఉన్న భగవత్పాదులు సమాధి నుండి లేచారు. అంతా గమనించారు. ఉప్పొంగుతున్న నదీ ప్రవాహాన్ని కమండలంలో సంగ్రహించగలిగినవాడే బ్రహ్మ సూత్రములకు భాష్యం వ్రాయగల సమర్థుడని వ్యాసులవారు చెప్పిన వాక్కు స్మరణకు వచ్చింది. భగవత్పాదులు శంకరాచార్యుల వారితో నాయనా! నీవు సాక్షాత్తు శంకరుడివి. అద్వైత మతాన్ని తెలియ జేయడం కోసం నీవు అవతరించావు. నీకు ప్రణవ మంత్రోపదేశం చేస్తాను. నాలుగు వేదాల నుండి ప్రజ్ఞానం బ్రహ్మ (విశిష్టమైన జ్ఞానమే బ్రహ్మ), అహం బ్రహ్మాస్మి (నేనే బ్రహ్మమై యున్నవాడను), తత్త్వమసి (అది (బ్రహ్మ) నీవై యున్నావు), అయమాత్మా బ్రహ్మ (ఈ ఆత్మయే బ్రహ్మము) అను నాలుగు మహా వాక్యములను బోధించారు. కాశీకి వెళ్ళి వేదయుక్తమైన తత్త్వ పద్ధతిని అక్కడ బోధించుము అని ఆదేశించారు. ఇంతలో శంకరుల వారికి తల్లి ఆరోగ్యము క్షీణించినది అని తెలిసింది. వెంటనే వెళ్ళి తల్లిని దర్శించుకున్నారు. కొడుకును చూసి ఆనందముతో కన్ను మూసింది ఆర్యాంబ. శంకరాచార్యులు సన్యాసి కనుక ఆర్యాంబ దహన సంస్కారము చేయుటకు వీలు లేదని తిరస్కరించారు బంధువులు. వారి మాటను లెక్కచేయకుండా స్వగృహములోనే దహనము చేశారు. పిదప వారు కాశీకి పయనమయ్యారు.

కాశీలో స్నానమాచరించి విశ్వేశ్వరుడిని, అన్నపూర్ణాదేవిని దర్శించుకున్నారు. అక్కడనే కొంతకాలము ఉన్నారు. చాలామంది ఆయన శిష్యులుగా చేరారు. మొట్టమొదట శిష్యుడిగా చేరినవాడు సదానందుడు. ఈయన తర్వాత పద్మాచార్యుడిగా ప్రసిద్ధికెక్కారు.



శంకరాచార్యులవారు శిష్యులకు బోధిస్తూనే గ్రంథ రచన కూడా చేయసాగారు. ఒకసారి స్నానము చేయుటకు వెళుతున్నారు. దారిలో ఒక వ్యక్తి ఎదురుపడ్డాడు. అతడు తాళ్ళతో కట్టబడిన నాలుగు కుక్కలను చేతబట్టుకున్నాడు. అతడి దగ్గర నుండి కల్లువాసన గుప్పుమని రాసాగింది. కళ్ళు చింతనిప్పుల్లాగా ఉన్నాయి. చూడటానికి భయంకరముగా ఉన్నాడు. అతడు తన పిచ్చి పిచ్చి మాటలతో జనాన్ని నవ్విస్తున్నాడు. అతడిని అసహ్యించుకుంటూ – ఓరి ఛండాలుడా! ఆచార సంపన్నులమైన మమ్మల్ని చూసి కూడా ఎదురు వస్తావా? దూరంగా వెళ్ళు అని పలికారు శంకరాచార్యులు. ఆ వ్యక్తి శంకరాచార్యుల వారితో చూడటానికి గొప్పవాడిలాగా ఉన్నావు. కాని మాటలు మాత్రం విపరీతంగా ఉన్నాయి. నన్ను దూరంగా వెళ్ళు అని ఎందుకు అంటున్నావు? సర్వాంతర్యామియైన బ్రహ్మ తత్త్వం గురించి శ్రుతులు చెబుతుంటే నీకు ఎందుకు ఈ భేదభావం? నీ శరీరానికి, నా శరీరానికి గల తేడా ఏమిటో చెప్పు. సూర్య బింబం గంగలో అయినా, కల్లులో అయినా ఒక్కలాగానే ఉంటుంది గదా! అన్నీ తెలిసిన నీవే ఇలా అంటే ఎలా? అని అడిగిన అతనికి సమాధానముగా శంకరాచార్యులు ఇలా అన్నారు. ఉపనిషత్తులు చాలా విశిష్టత గలవి. వాటిని చదివి కొందరు, విని కొందరు వాటి విశిష్టతను తెలుసుకొంటున్నారు. అయినా బుద్ధిలోని భేదభావమును వారు తెలుసుకొనలేకపోతున్నారు. జగమంతా ఆత్మ స్వరూపము అని భావిస్తున్న వారు నాకు గురువుతో సమానము అనగానే ఆ వ్యక్తి రూపములో నున్న పరమేశ్వరుడు ప్రత్యక్షమయ్యాడు. శంకరాచార్యులు పరమేశ్వరుడిని స్తుతించారు. శంకరాచార్యుల వారిని సూత్రములకు భాష్యమును రచింపమని ఆదేశించి అంతర్ధానమయ్యాడు పరమేశ్వరుడు.

భాష్యరచనకు అనువైన ప్రాంతము బదరికావనము అని భావించి శిష్యులతో ఆ ప్రాంతమునకు వెళ్ళారు శంకరాచార్యులు. శంకరాచార్యుల రచనలోని ముఖ్య ఉద్దేశ్యము ఉపనిషత్తులోని

విషయాలాధారముగా అద్వైత వేదాంతాన్ని నిరూపించడం. ద్వైతం కానిది అద్వైతం. ద్వైతం అంటే జీవాత్మ పరమాత్మలకు భేదము చెప్పే ఒక మతము. బ్రమ్మ సత్యం. జగన్మిధ్య అన్నది శంకరాచార్యుల అద్వైతం. జీవుడు, దేవుడు ఒక్కడే. ఆ దైవాన్ని అన్నింటిలోను, అందరిలోను దర్శించేందుకు జీవునకు మాయ అడ్డం పడుతున్నది. మాయా వలయాన్ని ఛేదించడానికి భక్తి, జ్ఞాన, యోగ, వైరాగ్యాలు మానవునకు సహాయపడతాయి. మనిషికి కావలసినదంతా అద్వైతం చెప్పింది. అధ్యాస అంటే అజ్ఞానంతో కూడిన భ్రమ లేదా భ్రాంతి. లేనిది ఉన్నట్లు, ఉన్నది లేనట్లు భావించడం అధ్యాస అవుతుంది. అధ్యాస తొలగినప్పుడే అనగా అజ్ఞానం తొలగినప్పుడే జ్ఞానకాంతులు ప్రసరించడానికి అవకాశం ఉంటుంది. అధ్యాస భాష్యంతోనే ఉత్తర మీమాంస దర్శనానికి ఆలంబమైన బ్రహ్మసూత్ర భాష్యాన్ని ప్రారంభించారు శంకరాచార్యులు.

ఒకనాడు శంకరులవారు శిష్యులకు భాష్యమును బోధిస్తుండగా ఒక వృద్ధబ్రాహ్మణుడు అక్కడికి వచ్చాడు. ఆయన శంకరాచార్యుల వారితో మీరు సూత్ర భాష్యాలను రచించారని మీ శిష్యుల ద్వారా విన్నాను. ఒక సూత్రం చదివి దానికి అర్థము చెప్పండి అని అడిగాడు ఆ వృద్ధుడు. శంకరాచార్యులు ఒక సూత్రం చదివి అర్థం చెప్పారు. వృద్ధుడు ఆ సూత్రమునకు వేరొక అర్థము చెప్పాడు. ఇలా వారిద్దరి మధ్య ఎనిమిది రోజుల పాటు సంవాదం జరిగింది. పద్మపాదుడి ద్వారా వచ్చినది వ్యాసులవారు అని తెలుసుకొని ఆయనకు ప్రణమిల్లారు. నా భాష్యంలోని తప్పులను సరిదిద్దమని వేడుకున్నారు. వ్యాసుడు వాటిని చక్కగా విశ్లేషించాడు. నీతో భేదించేవారిని ఓడించు. అనుబంధ గ్రంథాలను రచింపమని ఆశీర్వదించారు. స్వామీ! మీరు కొంతకాలం ఇక్కడ ఉండండి. మీ పాదాల దగ్గరే కైవల్యం పొందుతాను అని ప్రార్థించారు శంకరాచార్యులు. వ్యాసుడు నాయనా! అద్వైత మతాన్ని కొందరు వ్యతిరేకిస్తున్నారు. వారిని



జయించడానికి నీవు కొంతకాలం బ్రతికి ఉండాలి. అందుకు నీకు మరికొంత ఆయువును ప్రసాదిస్తున్నాను అని పలికి అంతర్ధానమయ్యారు.

మతవాదులను పరాజితులను గావిస్తూ అంతిమ సమయములోనున్న కుమారిల భట్టును దర్శించుకున్నారు. వారి కోరిక ప్రకారము శాస్త్రార్థము కొరకు మండనమిశ్రుని దగ్గరకు వెళ్ళారు. శాస్త్రార్థములో మండన మిశ్రుడిని అతని సతీమణి భారతిని ఓడించారు. మండనమిశ్రుడు శంకరాచార్యులవారి శిష్యుడైనాడు. ఈయన తరువాత సురేశ్వరాచార్యుడిగా ప్రసిద్ధికెక్కారు.


ఒకసారి ఒక కాపాలికుడు శంకరాచార్యులవారిని దర్శించుకున్నాడు. నేను ఒక కార్యమును సాధించడానికి ప్రయత్నిస్తున్నాను. దానికి మీలాంటి తత్త్వజ్ఞుల శిరస్సు అవసరమౌతుంది. మీరు తత్త్వజ్ఞులు. మీకు శరీరం మీద వ్యామోహం లేదు. కనుక మీకు అభ్యంతరము లేకుంటే మీరు మీ శిరస్సును నాకు సమర్పించినట్లయితే నా మనోరథాలన్నీ నెరవేరుతాయి అని ఆ కాపాలికుడు శంకరాచార్యుల వారిని ప్రార్థించాడు. నేను సమాధి లోకి వెళ్ళినప్పుడు, నా శిష్యులు లేనప్పుడు నా శిరస్సును ఖండించి తీసుకొనుము అని పలికారు శంకరాచార్యులు. సమాధిలోకి వెళ్ళిన శంకరాచార్యుల శిరస్సును ఖండించబోతున్న తరుణములో పద్మాచార్యులు అక్కడికి వచ్చారు. పరిస్థితిని గమనించిన వారు నరసింహస్వామిని ప్రార్థించారు. నరసింహస్వామి పద్మాచార్యులవారిని ఆవహించి వారిచేత కాపాలికుడిని సంహరింపచేశారు.

శంకరాచార్యుల రచనలను మూడు భాగాలుగా విభజించారు. భాష్యాలు, ప్రకరణాలు, స్తోత్రోపదేశములు అనునవి ఆ విభాగములు. బ్రహ్మసూత్రములు, ఉపనిషత్తులు, భగవద్గీత మున్నగునవి భాష్యములు. ఉపదేశ సాహస్రి, వివేక చూడామణి, శతశ్లోకి, సర్వవేదాన్త సిద్ధాంత సార సంగ్రహము మున్నగునవి ప్రకరణములు. తీర్థములు, దేవతామూర్తులు మున్నగువారిపై ఆశువుగా స్తుతించినవి; తత్త్వోపదేశాలు, స్తోత్రోపదేశాలు. శంకరాచార్యులు శృంగేరిలోను, జగన్నాథములోను, ద్వారకలోను, బదరి లోను నాలుగు మఠములను స్థాపించారు. ఈ నాలుగు మఠాలు నాలుగు వేదాలకు ప్రతీకలుగా నిలిచి ప్రసిద్ధముగా కొనసాగుతున్నాయి. శృంగేరీ మఠానికి పీఠాధిపతి సురేశ్వరాచార్యులు. జగన్నాథ మఠానికి పీఠాధిపతి పద్మపాదుడు. ద్వారకా మఠానికి పీఠాధిపతి హస్తామలకుల వారు. బదరీ మఠానికి పీఠాధిపతి తోటకాచార్యులవారు. అద్వైతాన్ని ప్రతిష్ఠిస్తూ భారత దేశములోని ప్రతి అడుగూ స్పర్శించి శ్రీ శంకరాచార్యులవారు సమాధి యోగం అవలంబించి ఆత్మ స్వరూపములో లీనమయ్యారు. శంకరుల వారి బోధనలను గ్రహించి ఆచరించుదాము.

# జ్ఞాన గుళిక

**– మందరపు వి.జి.శంకరాచారి**

**కామం, క్రోధం, లోభం, మోహం, మదం, మాత్సర్యాలు మనిషికి ప్రతిబంధకాలుగా నిలుస్తున్నాయి. పశు, పక్ష్య, క్రిమి, కీటకాది జన్మలు ఎత్తిన అనంతరం (60 వేలు) ఉత్కృష్టమైన మానవ జన్మను పొందిన జీవికి ఇవి అడ్డుగోడలుగా నిలుస్తున్నాయి. స్వచ్ఛతను పొందాలని పరితపించే మనసుకి అస్వస్థతను కలిగిస్తున్నాయి. తన యొక్క గమ్యమేమిటో తెలియకుండా చేసి దారిని మళ్ళిస్తున్నాయి. జ్ఞానం వైపు అడుగులు పడుతుంటే పేక బెత్తంతో మాయా దుప్పటిని కప్పి నిద్రపుచ్చుతోంది. కనులు తెరచి సత్యమేమిటో తెలుసుకోవాలన్నా తెలియనీయకుండా మరలా జోకొట్టి పసిపాపను నిద్ర పుచ్చినట్లుగా మనల్ని నిద్రపుచ్చుతోంది. తీరా తెలివివచ్చాక నిద్ర లేస్తే పక్కనే ఉన్న అజ్ఞానం నవ్వుతూ పలకరిస్తోంది. ఆ నవ్వుకి మోహపరవశుడైన జీవి సంతోషంగా వాటితో సహజీవనం కొనసాగిస్తున్నాడు.**



సత్యమేమిటో అసత్యమేమిటో తెలుసుకొనకుండా ప్రవర్తిస్తున్నాడు. మమతను దూరం చేసుకుని బంధాలను తెంచుకుని ఒంటరిగా జీవనం సాగిస్తున్నాడు. అదే తనకి ఆనంద దాయకమని అనుకుంటున్నాడు. రాజులా ఒంటిస్తంభం మేడలో నివసిస్తున్నాను అనుకుంటున్నాడు గానీ తనకు తోడుగా ఎవరూ రారని అర్థం చేసుకోలేకపోతున్నాడు. తను ఎక్కడనుండి వచ్చాడో తిరిగి అక్కడకు చేరుకోవాలనే జ్ఞానాన్ని గ్రహించలేక పోతున్నాడు. ఈ చీకటిమయ జీవితమే వెలుగు కిరణంగా భావిస్తున్నాడు. అంతేగాక దానివలన కోల్పోయింది. కోల్పోతున్నది ఏమిటో అర్థం చేసుకోలేకపోతున్నాడు. వీటితో సహవాసమే మనసుని కల్మషం చేస్తోందని భావించడం లేదు.

స్వచ్ఛమైన పాలలో ఒక్క చుక్క విషం కలిస్తే మొత్తం పాలు విషపూరితమైనట్లుగా తన మనసును విషమయంగా మార్చిందని అర్థం చేసుకోలేకపోతున్నాడు.

విషపూరితమైన మనసుతో తీసుకున్న నిర్ణయాలు అందరినీ బాధిస్తాయి. కాబట్టి అటువంటి నిర్ణయాలు తీసుకోవడం హానికరమని గుర్తించడం లేదు సరికదా తనకు తానుగా తీసుకున్న నిర్ణయాలు మంచివని సమర్థించుకుంటున్నాడు.

ఒకానొక సందర్భంలో నిర్మలమైన మనసుని కోల్పోతున్నాననే విషయాన్ని గ్రహించి ఆ స్థితిని పొందడానికి ప్రయత్నిస్తూ ధ్యానం వైపు అడుగులు వేస్తున్నాడు. అందుకొరకు 'యోగా'ని ఉపకరణంగా వాడుతున్నాడు. అయితే 'యోగా' శరీరంలోని నాడులు సక్రమంగా పని చేయడానికి ఉపకరిస్తుంది గానీ మనసుకి పట్టిన జాడ్యాన్ని పోగొట్టడానికి ఉపయోగ పడదన్నది సత్యమేవ సత్యం.

రోగమొస్తే వెంటనే వైద్యుణ్ణి సంప్రదించి తగిన మందుని వాడి జబ్బుని నయం చేసుకుంటాం. అయితే మనసుకి పట్టిన జాడ్యాన్ని మాయపొరలని తొలగించుకోవలెనంటే రేణువంతైనా సరే జ్ఞాన గుళిక ఎంతో అవసరం. తన పతనానికి ఈ అరిషడ్వర్గాలే కారణమన్న చిన్నపాటి ఎరుకను పొందడం ఎంతో అవసరం. అయితే ఈ జ్ఞానం స్వీయ సాధన వలన రాదు. సాధన అనునది ఒక పనిముట్టు మాత్రమే. ఆ జ్ఞానం ఇచ్చేది, ఇవ్వబడేది నిస్సందేహంగా పరమాత్మ నుండియే. ఈ విషయాన్ని గ్రహించి పరమాత్మ వైపు అడుగులు వేసి సంపూర్ణ శరణాగతితో అతడి పాదాలను ఆశ్రయించాలి.


పరమాత్మ వైపు అడుగులు పడితే పరంధాముడి నుండి జ్ఞానం ఇవ్వడం ప్రారంభమవుతుంది. ఈ జన్మలో కాకపోయినా తరువాత జన్మలలోనైనా ఆ జ్ఞానం పెరుగుతూ వచ్చి జీవిని ముముక్షువు గాను, ముక్తుడిగాను చేయడానికి దోహదపడుతుంది. ఏ క్షణమైతే పూర్ణజ్ఞానంతో ఆత్మ సాక్షాత్కారాన్ని పొంది ముక్తుడిగా మారిననాడు పరమాత్మయే తనతో సహజీవనం చేయడం ప్రారంభమవుతుంది. చివరకు ఈ జీవాత్మ పరమాత్మలో ఐక్యమై మోక్షాన్ని పొందుతుంది.

కావున ముక్తినీ, మోక్షాన్నీ పొందవలెనంటే ఈశ్వరుడి పాదాలను ఆశ్రయించి, రేణువంతైనా జ్ఞాన గుళికను ప్రసాదించమని ప్రార్థిస్తూ సాగిల పడడమే ప్రతి జీవి కర్తవ్యం.

# శ్రీ వేంకటేశ సహస్ర నామావళి

వ్యాఖ్యాత : కె.వి.రాఘవాచార్యులు

**వినా వేంకటేశం న నాథో న నాథః**
**సదా వేంకటేశం స్మరామి స్మరామి**





## 311. తాళ పక్వ ఫలాశినే నమః

– బాగుగా పండిన తాటి పండ్లను తినినవాడు కృష్ణుడు.

తాళపక్వ ఫలాశి అయిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చామూర్తి యగు వేంకటేశునకు నమస్కారము.

## 312. కాళియ ఫణి దర్పఘ్నే నమః

– కాళియుడను సర్పము యొక్క గర్వమును అణచినవాడు – కృష్ణుడు.

కాళియుడు కశ్యపునికి కద్రువకు జన్మించిన సర్పములలో ఒకడు. వీనికి 100 తలలు (ఫణములు) గలవు. కద్రువ వినతకు చేసిన అపకారము వలన గరుడుడు సర్పములకు ఎన్నో బాధలు కల్గించినాడు. కాళియుడు గరుడునితో పోరాడి అలసి కాళింది నదిలో తన కుటుంబముతో దాక్కున్నాడు. శౌభరి అను ముని శాపము కారణముగా గరుడుడు కాళింది నదిలో ప్రవేశించడు. అందువల్ల కాళిందీనది కాళియుడికి రక్షణ స్థావరం అయింది.

యమునా నదిలో 'కాళియ హ్రదము' అను మడుగు సర్ప నివాసము వలన ఏర్పడింది. ఆ మడుగులో నీరు కాళియుని విషాగ్ని ప్రభావముచే ఎప్పుడు సలసల మసలిపోవుచుండును. ఆ నీటి మీద ఎగిరిన పక్షులు ఆ మడుగులో పడిపోవుచుండును. ఆ విషతరంగ ముల మీద గాలులచే తీరమున గల అల్పప్రాణులు చనిపోవుచుండెను. తీరమున గల చెట్లు ఎండిపోవుచుండెను. వేసవి కాలమున ఒకనాడు బలరాముడు లేకుండా కృష్ణుడు తోడి గోపబాలురతో కలిసి ఆవులమందతో పాటు యమునా నదీ తీరమునకు వెళ్ళినాడు. కొంతసేపటికి వేసవి తాపముచే గోవులకు, గోపకుమారులకు దప్పిక కల్గింది. గోవులు, గోపకుమారులు యమునా నది నీటిని త్రాగిరి. అవి విషపూరితములై యుండుట చేత ఆవులు, బాలురు ప్రాణములు కోల్పోయి నది ఒడ్డున పడిపోయిరి. కృష్ణుడు నేల పడియున్న ఆవులను, తన మిత్రులను చూచినాడు. తక్షణమే దీనబాంధవుడైన కృష్ణుడు అమృతమయములైన తన చల్లని చూపులను ప్రసరింప చేసి ఆవులను, బాలురను బ్రతికించినాడు. కృష్ణుని అనుగ్రహముతో వారందరు ఆవులు స్పృహలోనికి వచ్చి నిద్రనుండి మేల్కొనినట్లు యమునా నదీ తీరమున లేచి కూర్చున్నారు. గోవులు లేచి పచ్చిక తినుటకు వనములోనికి వెళ్ళినవి.

పిమ్మట కృష్ణుడు భయంకరమైన కాళియ సర్పము వలననే యమునా జలములు విషపూరితములైనట్లు గమనించినాడు. అపుడు కృష్ణుడు యమునా జలములను నిర్మలములు చేయుటకై సంకల్పించి కాళియ సర్పమును యమునా నది నుండి వెడలగొట్ట నిశ్చయించినాడు. మరుక్షణమే కృష్ణుడు నడుము బిగించి ఆ తీరముననే ఉన్న మిగుల ఎత్తైన కడిమి చెట్టును ఎక్కి నదిలో దూకినాడు. దానితో సంక్షుభితములైన జలములందు గొప్ప శబ్దము బయలుదేరింది. ఆ ధ్వనిని విన్న కాళియుడు ఎవడో తన స్థానమును ఆక్రమించినాడు అని తలపోసి, అసహనముతో ఆ సర్పము కృష్ణుని ఎదుటికి వచ్చింది. కృష్ణుడు నిర్భయముగా ఆ విషజలములందు స్వేచ్ఛగా క్రీడించుచుండెను. వెంటనే కాళియుడు బుసలు కొట్టుచు బాలుడైన కృష్ణుని దేహమున కాటువేసి, తన పడగలతో అతనిని చుట్టివేసినాడు. తీరమున నున్న గోపబాలురు పాము యొక్క పడగలచే చుట్టబడి ఉన్న కృష్ణుని చూసి చేష్టలుడిగి కలవరము పడినారు. కొందరు భయముతో దుఃఖముతో నేలపై పడిపోయినారు. ఆవులు, ఎద్దులు, దూడలు దుఃఖముతో పెద్దగా అరవసాగినవి. ఆ సమయమున బృందావనమున దుశ్శకునములు కలిగినవి. వాటిని చూచి నందుడు మొదలగు గోపాలురు భయపడి బలరాముడు లేకుండా కృష్ణుడు గోవులను మేపుటకై గోపబాలురతో అడవికి వెళ్ళినవాడని తెలిసికొని ఆందోళన చెందినారు. అంతట బృందావనము నందలి స్త్రీలు పురుషులు అందరు కృష్ణుని చూచుటకై గోకులమునుండి బయలుదేరినారు. బలరాముడు కృష్ణుని మహత్త్వమును పూర్తిగా తెలిసినవాడు గనుక భయముతో కృష్ణునిపై గల ప్రేమతో ఆందోళన పడుచున్న వ్రజవాసులను చూచి తనలో తాను నవ్వుకొనుచు ఏమియు మాటాడక మిన్నకున్నాడు. బలరాముడు నంద యశోదాదులు కృష్ణుని జాడ, క్షేమము తెలుసుకొనుటకై అడవి దారిని బట్టి పోవుచుండిరి. మార్గమున వారికి కృష్ణుని యొక్క గోపాలుర యొక్క ఆవుల యొక్క కాళ్ళ గుర్తులు కనబడినవి. వాటిని గుర్తించుచు వారందరు ఆ దారిన పోయి యమునా నదీ తీరమునకు చేరినారు. వారందరూ నదీ తీరమునందుండియే తమకు దూరమున మడుగు మధ్యలో మహాసర్పముచే (కాళియునిచే) చుట్టబడి నిశ్చేష్టుడై యున్న తమ కృష్ణుని చూచినారు. ఆ నదీ తీరముననే పడి యున్న గోపబాలురను, ఆక్రందించుచున్న గోవులను చూచారు. అప్పుడు వారు పట్టరాని దుఃఖముతో ఆర్తితో మూర్ఛిల్లినారు. తన పుత్రుడు మహా సర్పము పడగలలో చుట్టబడియున్న కారణముగ మిగుల ఆపన్నుడైనట్లుగా భావించి యశోద నదిలో ప్రవేశించుటకు ఉద్యుక్తురాలయింది. గోపికలందరు యశోదను పట్టుకొని నదిలో ప్రవేశించకుండా నివారించారు. అందరూ యశోదతో పాటు బాలకృష్ణుని లీలలను తలంచుకొనుచు, ప్రస్తావించుచు తదేక దృష్టితో కృష్ణుని వైపే చూచుచు మృతప్రాయులుగ ఉండిపోయారు. కృష్ణుడు తన కారణముగా నంద యశోదలు, గోపికలు, గోప బాలురు అందరు దుఃఖితులై యుండుట గమనించినాడు. అంతట కృష్ణుడు క్షణకాలము సామాన్య మానవునివలె పాము పట్టులో ఉండి, వెంటనే వేగముగా పాము పట్టు నుండి పైకి లేచినాడు. కృష్ణుడు తన దేహమును పెంచగా దాని వలన కలిగిన బాధను తట్టుకోలేక కాళియుడు కృష్ణుని విడిచి పెట్టి తన పడగలను పైకెత్తి బుసకొట్టుచు నిలబడినాడు. ఆ సమయమున కృష్ణుడు పైకెగిరి కాళియుని పడగలపై నిలబడి చిందులు వేయసాగెను. కృష్ణుని కాటు వేయుటకై అదను చూచుచు కాళియుడు అటు ఇటు తిరుగు చుండెను. అప్పుడు కాళియుని పడగలపై నృత్యము చేయుచున్న కృష్ణుని ఎర్రని పాదములు పడగలపై నున్న రత్నముల కాంతులచే ఇంకను ఎర్రగా కనిపించుచుండెను. కాళియుని పడగలపై లీలా కృష్ణుని నృత్యములను ఆకాశమున చేరి దేవతలు, గంధర్వులు, దేవతా స్త్రీలు కృష్ణుని చూచుచు భక్తితో కీర్తించుచుండిరి. కొందరు పుష్పవర్షమును కురిపించినారు.

నూరు పడగలు గల కాళియుడు ఇంతవరకు ఎవరికీ తలవంచి ఎరుగడు. కృష్ణుడు తన పాద ఘట్టములచే వాని పడగలను అణగద్రొక్కుచుండెను. కృష్ణుని పాదముల తొక్కిడికి, దెబ్బలకు కాళియుడు బలహీనుడై ముఖముల నుండి రక్తము చిమ్ముచుండెను. వాడు మూర్ఛపోయినాడు. కృష్ణుని యొక్క తాండవ నృత్యముచే కాళియుని పడగలన్నియు ఛిన్నాభిన్నములయినవి. కాళియుని ప్రాణములు కదముట్ట సాగినవి. అంత కాళియుడు పశ్చాత్తప్తుడై శ్రీమన్నారాయణుని స్మరించుచు మనసులోనే ఆ దేవదేవుని శరణు జొచ్చినాడు. కాళియుని దుస్థితిని చూచి అతని భార్యలు దుఃఖముతో ఆక్రందించుచుండిరి. వారు తమ పిల్లలను ముందుంచుకొని కృష్ణుని దరి చేరి సాగిలబడి పాపాత్ముడైన తమ భర్తను కాపాడమని అభయ ప్రదుడైన కృష్ణుని శరణు చొచ్చి – జగన్నాథా! నీ యెడ శత్రుభావము గలిగిన దుష్టులను దండించినను, నీవు వారి కుమారులపై మాత్రము ప్రసన్నత్వముచే (కనికరమును) చూపుచుందువు. లోక కళ్యాణార్థము దుర్మార్గులను సంహరించుచుందువే గాని యథార్థముగా నీకు ఎవ్వరి పైనను శత్రుభావము లేదు గదా. మూఢుడైన మా భర్త నీ మహిమను ఎరుగక చేసిన అపరాధమును క్షమింపుము. దేవా! అవసానదశలో నున్న ఈ కాళియునిపై దయ చూపుము. స్వామీ! మేము మాంగల్యములను కోల్పోయి, శోభా జీవితములకు దూరమై వైధవ్యమును భరింపజాలము. కనుక మా దీనాలాపములను ఆలించి మాకు పతిభిక్ష పెట్టుము. మా నాథుని పడగలపై నీ నృత్యమును చాలించి మమ్ము రక్షింపుము అని ప్రార్థించినారు. కాళియుని భార్యలు కృష్ణుని ప్రస్తుతించారు. అంతట వారి మొరను ఆలకించి కరుణానిధియగు కృష్ణుడు కాళియుని పడగలపై నృత్యమును చాలించినాడు. కృష్ణానుగ్రహముతో కాళియుడు ప్రాణాపాయ స్థితి నుండి బయట పడినాడు. కొంత తడవునకు తేరుకొనిన పిమ్మట దీనుడై నమస్కరించి కృష్ణుని తన తప్పును క్షమించమని వేడుకొన్నాడు. తనపై దయ చూపమని ప్రార్థించినాడు.

అంతట కాళియుని ప్రార్థన ఆలకించిన కృష్ణుడు ఓ కాళియుడా! నీవు వెంటనే యమునా నదిని ఈ మడుగును విడిచి వెళ్ళుము. నీవు సకుటుంబముగ ఇచ్చట నుండి వెళ్ళి సముద్రమున ప్రవేశించుము. ఇక మీదట యమునా నది జలములను గోవులు, మానవులు నిర్భయముగా త్రాగగలరు. నది జలములు నిర్మలముగా నుండును. కాళియుడా! నీవు గరుత్మంతునకు భయపడి రమణక ద్వీపమును వదలి ఈ హ్రదమును ఆశ్రయించితివి. ఈ సందర్భమున నా పాద చిహ్నములు నీ పడగలపై ముద్రితములై ఉన్నందున ఇక మీదట గరుత్మంతుడు నిన్ను బాధించడు అని అభయమిచ్చినాడు. పిమ్మట కాళియుడు, అతని భార్యలు సంతోషముతో కృష్ణుని పూజించినారు. వారందరు కృష్ణుని అనుగ్రహమునకు పాత్రులయినారు. కాళియుడు కృష్ణునికి ప్రదక్షిణ పూర్వక నమస్కారములను చేసిన తర్వాత అతడు సంతోషముగా భార్యా పుత్రాదులతో కూడి సముద్ర మధ్యమున గల రమణక ద్వీపమునకు చేరినాడు. ఆ క్షణము నుండి యమునా నది జలములు విష రహితములై అమృతమయములైనవి.

కాళియ సర్పము యొక్క గర్వము అణచిన కృష్ణునిగా జన్మించిన విష్ణుదేవుని అర్చావతారము వేంకటేశునకు నమస్కారము.

నాటి నుండి కులీన సర్పముల పడగలపై బాలకృష్ణుని పాద ముద్రలు గలవు. రామావతారములో సేవ నిర్మాణమున సహకరించిన ఉడతను ప్రేమతో తన చేతితో రాముడు దాని వీపుపై నిమిరినాడు. ఆనాటి నుండి ఉడతల వీపుపై రాముని చేతివేళ్ళ గుర్తులు గలవు. ఇదంతా దైవలీల.

**అన్ని నామాలూ నీవే అయిన**
**ఓ వేంకటేశా! నీకు నమస్కారము**

ధారావాహికం



# రామాయణ రత్నాకరం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

అంతలో దుమ్ము రేగింది. ఆకాశమంతా వ్యాపించింది. దిక్కులు తెలియలేదు. సూర్యుడు కనపడలేదు. పర్వతాలు, భూమి కంపించాయి. తక్షణ దంష్ట్రులు, మహాపర్వతాకారులు, బలవంతులు, వానరవీరులు వచ్చారు. కామరూపులైన వానర సేనానాయకులు తీసుకువచ్చారు. కోట్లాది పరివారం వచ్చింది. ప్రస్రవణగిరి ప్రాంతం అంతా నిండిపోయింది,.

శతబలి వెంట పదివేల కోట్ల మంది వచ్చారు. సుషేణుని తరపున అనేక వేలకోట్ల మంది వచ్చారు. సుగ్రీవుని మామ రుమ తండ్రి వేయికోట్ల మందితో వచ్చాడు. హనుమ తండ్రి కేసరి వేలకొద్దీ వానరులతో వచ్చాడు. గవాక్షుడు వేయి కోట్ల మందితో వచ్చాడు. ధూమ్రుడు భల్లూక నాయకుడు. రెండువేల కోట్ల భల్లూకాలతో వచ్చాడు. పనసుడు మూడుకోట్ల మందిని తెచ్చాడు. నీలుడి వెంట పదికోట్ల మంది వచ్చారు. ఐదుకోట్ల మందితో వచ్చాడు గవయుడు. దరీముఖుడు వేయికోట్ల మందితో వచ్చాడు. అశ్వినీదేవతల కుమారులు మైందుడు, ద్వివిదుడు. ఇద్దరూ వేయికోట్ల మందితో వచ్చారు. మూడుకోట్ల మందిని తెచ్చాడు గజుడు. జాంబవంతుడు వందకోట్ల భల్లూకాలను తెచ్చాడు. గంధమాధనుని వెంట కోటానుకోట్ల మంది వచ్చారు. ఐదు కోట్ల మందిని తెచ్చాడు తారుడు. ఇంద్రజానుడు పదకొండు కోట్ల మందిని తెచ్చాడు. దుర్ముఖుడు రెండు కోట్ల మందితో వచ్చాడు. కోట్లాదిమందిని తెచ్చారు. దధీముఖుడు పదికోట్ల మందితో వచ్చాడు. శరభుడు కుముదుడు వహ్ని రంహుడు మరెందరో నాయకులు వారి వారి సేనలతో వచ్చారు.

సెలయేళ్ళు పర్వతాలు వనాలు ఎక్కడెక్కడ అవకాశం ఉంటుందో అక్కడ నిలిచారు వానర భల్లూక వీరులు. కొందరు ఈదుతూ వచ్చారు. గెంతుతూ వచ్చారు. గర్జిస్తూ వచ్చారు. మేఘాల్లా వచ్చారు. అందరూ సుగ్రీవుని చుట్టూ చేరారు. ఆనందంతో రక రకాల శబ్దాలు చేస్తున్నారు. వచ్చిన నాయకులు వానర రాజుకి నమస్కరించారు. తన బలగాన్ని ఎలా ఉపయోగించుకోవాలో అందుకు సన్నద్ధుడైనాడు.

## అన్వేషణ

రామునితో చెబుతున్నాడు సుగ్రీవుడు. ''ప్రభూ! వానరులు శత్రుసంహార దక్షులు. బలశాలురు. కార్యశూరులు. అలసట ఎరుగరు. నేలమీదే కాదు, నీటిమీద వెడతారు. ఆకాశంలో పోతారు. కోట్లాది వానర వీరులు నీ సేవకులు. రావణునిపై యుద్ధానికి సంసిద్ధులు. నీ ఆజ్ఞ కోసం వేచి ఉన్నారు''.

విన్నాడు రాఘవుడు. సుగ్రీవుణ్ణి గాఢంగా కౌగలించుకున్నాడు. ''వానరేశ్వరా! ఇపుడు వైదేహి బతికి ఉందా లేదా – అది

తెలియాలి. రావణుని దేశమేది? అతని నివాసమేది? అది తెలిస్తే కర్తవ్యం నిర్ణయించవచ్చు. నీ సేనల్ని నేను ఆజ్ఞాపించలేను. ఆ పని లక్ష్మణుడూ చేయలేడు. నీవు కార్యసాధకుడవు. సౌమిత్రి తర్వాత నీవే నా ఆప్తుడవు. ప్రజ్ఞావంతుడవు. పరాక్రమశాలివి. నా మేలు కోరే వాడవు''.

## తూర్పు – వినతుడు

విన్నాడు సుగ్రీవుడు. సేనానాయకుడు వినతుణ్ణి పిలిచాడు. అతడు పర్వతాకారుడు. మేఘ గాంభీర ఘోషుడు. ''వినతుడా! నీవు తూర్పు దిక్కు వెళ్ళాలి. లక్షమందిని తీసుకెళ్ళు. విదేహ రాజపుత్రిని వెతకాలి. రావణుడు ఉండే చోటు వెదకండి. గంగ సరయు కౌశికాది నదీతీరాల్లో వెదకండి. బ్రహ్మమాల విదేహ మాళవ కాశి కోసలాది దేశాలు వస్తాయి. సీతాదేవి కోసం గాలించండి. జంబూద్వీపం, ప్లక్షద్వీపం శాల్మలీ ద్వీపం, క్రౌంచ ద్వీపం అలా అన్ని ద్వీపాల్లో అన్వేషించండి. అనేక పర్వతాలు గుహలు జల్లెడ పట్టండి అని తూర్పు దిక్కు హద్దు వరకు వివరంగా చెప్పాడు. ఆ శ్లోకాలు 52.

''వానరులారా! మీరు ఉదయ పర్వతం వరకు వెళ్ళండి. ఆపైన భూమి ఎంత ఉందో తెలియదు. హద్దు ఎవరికీ తెలియదు. మీకు నెల రోజుల గడువు. సీతాదేవి కోసం బాగా వెదకండి. తిరిగి రండి. నెల తర్వాత వస్తే మరణ దండన తప్పదు. మీ కార్యం సఫలం కావాలి. క్షేమంగా వెళ్ళండి. లాభంగా తిరిగి రండి.

## దక్షిణం – అంగదుడు

అంగదుని పిలిచాడు సుగ్రీవుడు. ''నీలుడు హనుమంతుడు జాంబవంతుడు మొదలైన వానర వీరులు నీవెంట ఉంటారు. ఇంకా వేలాది వానర వీరుల్ని తీసుకెళ్ళు అన్నాడు. తర్వాత వాళ్ళందరితో అంటున్నాడు. ''వీరులారా! మీరు దక్షిణానికి వెళ్ళాలి. నర్మద, గోదావరి, కృష్ణవేణి ఇత్యాది నదులు వస్తాయి. ముందు వింధ్య పర్వతాల నుంచి అన్వేషణ ప్రారంభించండి. అక్కడ కొండ గుహల్లో వెదకండి. నదీతీర ప్రాంతాల్లో వెదకండి. విదర్భ ఋషిక మాహిషిక వంగ కళింగ కౌశిక దేశాల్లో గాలించండి. దండకారణ్యం అక్కడి పర్వత ప్రాంతాలు గుహలు వెదకండి. ఆంధ్ర పుండ్ర చోళ పాండ్య కేరళ దేశాల్లో సీతాదేవిని వెదకండి. తర్వాత కావేరీ నది వస్తుంది. అది పవిత్రమైంది. అక్కడ అగస్త్యుని ఆశ్రమం వుంది. ఆ మహామునిని దర్శించండి. అతణ్ణి ప్రసన్నుణ్ణి చేసుకోండి. తామ్రపర్ణి నది దాటండి. ఆ నదిలో పెద్ద పెద్ద మొసళ్ళుంటాయి. జాగ్రత్త.

తార తండ్రి సుషేణుడు. ఇక్కడ మరొక సుషేణుణ్ణి పేర్కొన్నాడు. అగస్త్య ఆశ్రమం పంచవటిలో ఉంది. సీతారామ లక్ష్మణులు ఆ మహర్షిని దర్శించారు. కాని ఇక్కడ ఆ మహర్షి ఆశ్రమం వుందన్నాడు వాల్మీకి. మహర్షులు దేశ సంచారులు.



వారికి అనేక ఆశ్రమాలుంటాయని గ్రహించాలి.

తామ్రపర్ణి దాటాక పాండ్యరాజ్యం వస్తుంది. ఆ రాజ్యంలో బాగా వెదకండి. అక్కడ సముద్రం ఉంది. దాన్ని దాటే ప్రయత్నం చేయాలి. సముద్రంలో మహేంద్రగిరి వుంది. అక్కడ దేవర్షులు యక్షులు సిద్ధులు చారణులు ఉంటారు.

దక్షిణ సముద్రంలో ఓ ద్వీపం (లంక) ఉంది. దాని వైశాల్యం నూరు యోజనాలు. అక్కడికి మనుషులు పోలేరు. అది రావణుని నివాసం. ఆ ద్వీపంలో బాగా వెదకండి. ఆ సముద్రంలో అంగారక అనే రాక్షసి ఉంది. నీళ్ళలోని నీడని చూస్తుంది. లాగుతుంది. ప్రాణికోటిని భక్షిస్తుంది. మీరంతా పరాక్రమవంతులు. మైథిలి కోసం అన్వేషించండి.

లంకా ద్వీపం దాటి వంద యోజనాలు వెళ్ళాలి. పుష్పితకం అనే పర్వతం వస్తుంది. అక్కడ సిద్ధులు చారణులు ఉంటారు. ఆ పర్వత శిఖరాలు చాలా ఎత్తుగా ఉంటాయి. కృతఘ్నులు, క్రూరులు, నాస్తికులు ఆ పర్వతాన్ని చూడలేరు. ఆ పర్వతానికి నమస్కరించండి. కొండ గుహల్లో వెదకండి. దాన్ని దాటాక 14 యోజనాలు వెళ్ళాలి. అక్కడ ఒక పర్వతం కనిపిస్తుంది. దానిపేరు సూర్యవంతం. అక్కడికి వెళ్ళడం కష్టం. అయినా వెళ్ళాలి. అక్కడ కూడా వెదకండి. తర్వాత ముందుకుపోతే మరో పర్వతం కనబడుతుంది. దానిపేరు వైద్యుతం. అక్కడ అన్ని కాలాల్లో పూలు పూస్తాయి. కాయలు కాస్తాయి. పండ్లు పండుతాయి. అక్కడి ఫలములు తినండి. తేనె తాగండి. తర్వాత కుంజర పర్వతం వస్తుంది. అది కన్నుల పండువగా ఉంటుంది.

ఆ పర్వతం దాటితే భోగవతి పట్టణం కనబడుతుంది. అది సర్పాలకి నిలయం. అక్కడే సర్పరాజు వాసుకి నివాసం.

అక్కడ వెదకండి. ఆ పట్టణం దాటాక ఒక మహాపర్వతం కనిపిస్తుంది. దానిపేరు వృషభగిరి. అక్కడ వివిధ వర్ణాల్లో చందన వృక్షాలుంటాయి. రోహితులు అనే గంధర్వులు వుంటారు. వాళ్ళే ఆ వృక్ష రక్షకులు. మహాభయంకరులు. ఆ చెట్లని తాకవద్దు. వాళ్ళు ఐదుగురు గంధర్వులు. అదే భూమికి హద్దు. స్వర్గానికి పోయేవారు అక్కడికి పోగలరు. తర్వాత ముందుకు వెడితే పితృలోకం వస్తుంది. అక్కడే యమ సదనం ఉంది. చిమ్మచీకటిగా ఉంటుంది. అక్కడికి మీరు పోలేరు. ఇక తిరిగి రావాలి. నెల రోజుల గడువు. సీతాదేవిని దర్శించినవానికి నేను అనుభవించే భోగభాగ్యాలు ఇస్తాను. వాడు నాకు ప్రాణతుల్యుడు. నాకు ప్రేమాస్పదుడు. ఎన్ని దోషాలు చేసినా వాడు నా ఆత్మబంధువు. కనుక వానర వీరులారా! జనకరాజ పుత్రి కోసం అన్వేషించండి. సర్వ ప్రయత్నాలు చేయండి. త్వరగా వెళ్ళండి. శుభం. అవి మొత్తం 48 శ్లోకాలు. అద్భుతంగా వర్ణించాడు వాల్మీకి.

## పడమర – సుషేణుడు

సుషేణుణ్ణి పిలిచాడు సుగ్రీవుడు. అతడు తార తండ్రి. సుగ్రీవునికి మామ. నీలమేఘంలా ఉంటాడు. మహా పరాక్రమశాలి. ''నీవు పడమర దిక్కుకి వెళ్ళాలి. నీవు రెండు లక్షల వానరుల్ని తీసుకెళ్ళు'' అని అంటున్నాడు మళ్ళీ. ''కపిశ్రేష్ఠులారా! మీరు పశ్చిమ దిక్కుకు వెళ్ళాలి. సీతాదేవిని అన్వేషించాలి. సురాష్ట్ర బాహ్లీక శూర భీమాది దేశాలు వస్తాయి. ఆయా గ్రామాల్లో నగరాల్లో వెదకండి. అనేక కొండలు వస్తాయి. వాటి లోయల్లో గుహల్లో వెదకండి. హేమగిరి వజ్రగిరి పారియత్రం చక్రవంతం ఇలా అనేక పర్వతాలు ఎదురవుతాయి. వాటిలో మైథిలి కోసం అన్వేషించండి. పోగా పోగా మేరు పర్వతం కనపడుతుంది. అది బంగారుమయం. దేవతలు గంధర్వులు దానవులు ఉంటారు. విశ్వదేవుడు మరుత్తులు అష్టవసువులు వస్తారు. సాయంత్రం సూర్యుణ్ణి ఉపాసిస్తారు. వారి పూజలందుకుంటాడు సూర్యభగవానుడు. మేరు పర్వతానికి అస్తాద్రికి మధ్య పదివేల యోజనాల దూరం. దాన్ని సూర్యుడు అర్ధ ముహూర్తం (24 నిమిషాలు) లో దాటేస్తాడు. అంతవరకు మీరు పోగలరు. తర్వాత సూర్యుడు ఉండడు. భూమి హద్దు తెలియదు. నెల రోజుల గడువు. తిరిగి రావాలి. తర్వాత వస్తే వధింపబడతారు. మీరు సీతాన్వేషణలో కృతకృత్యులు కాగలరు. మీ నాయకుడు సుషేణుడు. అతనితో వెళ్ళండి.

## ఉత్తరం – శతవలి

శతవలిని పిలిచాడు సుగ్రీవుడు. ''నీవు ఉత్తర దిక్కుకు వెళ్ళాలి. నీతో సమానమైన వానరుల్ని తీసుకెళ్ళు. ఉత్తర దిశ మహిమాన్వితమైనది. హిమవత్ పర్వతం ఒక దివ్యాభరణం. సీతా మాత కోసం అన్వేషించండి. కార్యం సాధిస్తే రాముడు సాధిస్తాడు. ప్రత్యుపకారం చేసిన వాళ్ళమవుతాం'' అన్నాడు. వానర వీరుల్ని చూశాడు. మళ్ళీ అంటున్నాడు.

''వీరులారా! మ్లేచ్ఛ పుళిందాది దేశాలు వస్తాయి. చీనా పరమ చీనా దేశాలు వస్తాయి. అక్కడ బాగా గాలించండి. తర్వాత హిమవత్పర్వతం చేర్తారు. కాళ పర్వతం, హేమగర్భం, సుదర్శనగిరి, దేవసఖగిరి వస్తాయి. అక్కడ వెదకండి. ఇంకా ముందుకు వెళితే శూన్యప్రదేశం వస్తుంది. అది నూరు యోజనాలుంటుంది. ఒక్క చెట్టూ ఉండదు. ఒక్క జంతువు కనిపించదు. అంతా ఎడారి. అది దాటాలి. తెల్లటి కైలాస పర్వతం కనబడుతుంది. అది నేత్రపర్వంగా ఉంటుంది. ఆ పర్వతం మీద ఒక భవనం ఉంది. అది బంగారుమయం. విశ్వకర్మ నిర్మించాడు, అది కుబేరుని నివాసం. అక్కడే విశాలమైన సరస్సు ఉంది.

ఆ సరస్సు దాటితే క్రౌంచ పర్వతం కనబడుతుంది. అక్కడొక బిలం ఉంది. దానిలోంచి పోవాలి. అది కష్టసాధ్యం. ఆ పర్వతాల్లో గుహల్లో లోయల్లో మైథిలి కోసం వెదకండి. మరింత ముందుకు పోతే కామశైలం మానస పర్వతం మైనాక పర్వతం కనిపిస్తాయి. వైఖానస సరస్సు వుంది. అక్కడే సార్వభౌమం అనే దిగ్గజం ఉంది. అది కుబేరుని వాహనం. ఆ సరస్సుకి ఆవల సూర్యచంద్రులు కనిపించరు. నక్షత్రాలు కనిపించవు. మేఘాలుండవు. అంతా నిశ్శబ్దం. దాన్ని దాటితే ఉత్తర సముద్రం వస్తుంది. ఉత్తర కురుదేశం అక్కడే ఉంది. అక్కడ ఒక పర్వతం ఉంది. దానిపేరు సోమగిరి. అది దేవతలకే కనబడుతుంది. మీరు అంతవరకే పోగలరు. వానర వీరులారా! సీతాదేవిని అన్వేషించండి. నెల లోపల తిరిగి రావాలి. రాకపోతే మరణ దండన. మీరు కార్యం సాధిస్తే గొప్పగా సమ్మానింపబడతారు. సుఖభోగాలనుభవిస్తారు. వెళ్ళండి. వెదకండి. తిరిగిరండి. ఆ వివరణ మొత్తం 55 శ్లోకాలు. అద్భుతంగా వర్ణించాడు వాల్మీకి.

మనలో మాట – రావణుడు ఎక్కడుంటాడని రాముడు అడిగాడు. తెలియదన్నాడు. అది సుగ్రీవుని మొదటి మాట. దక్షిణ దిశకు అంగదుని పంపుతూ రావణుని నివాసం చెప్పాడు. అంటే అబద్ధమాడినాడు. ఎందుకు అసత్యం పలికాడు? తనకు రాజ్యం కావాలి. భార్య కావాలి. అది అతని స్వార్థం.

సుగ్రీవుని అసత్యాన్ని సహించాడు రాముడు. అంటే కబంధుని మాట వేదవాక్యం అయింది రామునికి. సుగ్రీవుని సాయం అత్యవసరం. అతణ్ణి నమ్మాలి. అది మైత్రీబంధం. అతని వల్ల సీత లభించాలి. ఆలోచిస్తే ఎవరి స్వార్థం వారిది. నరునిగా రామునికి అది స్వార్థం. నారాయణునిగా రావణ సంహారం లోక కళ్యాణార్థం గావించాడు.


వానర సేనని నాలు దిక్కులకి పంపాడు సుగ్రీవుడు. నలువైపులా ఉన్న విశేషాలు చెప్పాడు. ఇప్పుడు చూస్తున్న భారతదేశపు ఎల్లలు కాదు. ఆనాడు జంబూద్వీపం భరతవర్షం మేరో దిగ్భాగాలతో అఖండ భారత దేశంగా ఉండేదని గ్రహించాలి

మనం. అదంతా వాల్మీకమహర్షి భౌగోళిక పరిజ్ఞానం. అది మహర్షి యోగశక్తికి తార్కాణం. విచిత్రం ఏమిటంటే వానర వీరులు భల్లూకాది యోధులు ఆయుధాలు తీసుకెళ్ళలేదు. సంఖ్యాబలమే కాదు, బాహుబలం, బుద్ధిబలం వుండగా ఆయుధాలతో పనేం అనుకున్నారేమో! రాళ్ళు విసురుతారు. చెట్లతో మోదుతారు. గోళ్ళతో రక్కుతారు. పిడికిళ్ళతో పొడుస్తారు. మోకాళ్ళతో కుమ్ముతారు. అవే వాళ్ళ ఆయుధాలని చెప్పాలి.

అంగదాదులు దక్షిణ దిశకి వెళ్ళాలన్నాడు సుగ్రీవుడు. కిష్కింధ దక్షిణం వైపు ఉంది. ఋష్యమూక పర్వతం పంపానది అటువైపే ఉన్నాయి. గోదావరి కృష్ణ నదులు కిష్కింధకి పైభాగాన ఉన్నాయి. వాని పైభాగంలో నర్మద తపతి నదులున్నాయి. వాని పై భాగంలో వింధ్య పర్వతం ఉంది. ఆపైన దండకారణ్యం ఉంది. కబంధుడు ఉన్నచోట పరమ దండక వ్యాపించి ఉండాలి. విదర్భ వంగ కళింగాది దేశాలు కిష్కింధకు ఉత్తర భాగంలో ఉన్నాయి. చోళ పాండ్య కేరళాది దేశాలు కిష్కింధకి కింది భాగంలో అంటే దక్షిణంలో ఉన్నాయి. వాల్మీకి అభిప్రాయంలో కిష్కింధ వింధ్య పర్వత ప్రాంతంలో ఉన్నట్లుగా తోస్తోంది. కాని కిష్కింధ వింధ్యకి దక్షిణ భాగంలో చాలా కింద ఉందని విమర్శకుల అభిప్రాయం. శ్రీరామాయణం కాలంలో భౌగోళిక స్వరూపం ఎలా ఉందో విజ్ఞులు పరిశీలించాలి. ఆలోచించాలి. అయితే సంపాతి వింధ్య పర్వతం మీద పడ్డట్టు చెబుతోంది. అంటే వింధ్య పర్వత శ్రేణి దక్షిణ సముద్ర తీరం దాకా వ్యాపించిందా?

## అంగుళీయకం

వానరసేనలకి ఆదేశాలిచ్చాడు సుగ్రీవుడు. నలు దిక్కులకి బయలుదేరుతున్నారు. వానర రాజు హనుమంతుని చూశాడు. పిలిచాడు. మారుతి వానర శ్రేష్ఠుడు. కార్యసాధకుడు. అది



సుగ్రీవుని నమ్మకం. అంతేకాదు అతనంటే పరమప్రీతి. అంటున్నాడు. హనుమా! నీవు వెళ్ళని చోటు ఉండదు. ఈ భూమిపై తెలియని చోటు ఉండదు. అంతరిక్షంలో పయనిస్తావు. ఆకాశంలో తిరుగుతావు. నీళ్ళపై పోతావు. ఎక్కడికైనా వెడతావు. అద్భుత శక్తిమంతుడవు. వాయుదేవునిలా గమనశక్తి గలవాడవు. నీకు సాటి ఎవరూ లేరు. సీతాదేవి అన్వేషణలో నీ ప్రయత్నం సఫలం కావాలి. నీ బుద్ధిబలం నీ పరాక్రమం ఇంకొకరికి లేవు. మహా సాహసవంతుడవు నీవు.

అది గమనించాడు రాముడు. తన కార్యం నెరవేర్చగలవాడు మారుతి. అది రాముని నిశ్చితాభిప్రాయం. పిలిచాడు హనుమని. చేతి ఉంగరం తీశాడు.

ఇది నా ఉంగరం. సీత చూస్తుంది. నిన్ను నా దూతవని తెల్సుకుంటుంది. తొట్రుపాటు పడదు. నిర్భయంగా మాట్లాడుతుంది. నీవు కార్యదీక్షా దక్షుడవు. పరాక్రమవంతుడవు. నీమీద ఆధారపడ్డాను నేను అన్నాడు. అంగుళీయకం ఇచ్చాడు. తీసుకున్నాడు వాయుపుత్రుడు. దోసిలొగ్గాడు. రాముని పాదాలకు నమస్కరించాడు. ఉంగరం తలలో ఉంచుకున్నాడు. నడిచాడు ముందుకు. మళ్ళీ అంటున్నాడు రాముడు. హనుమా! వాయుపుత్రా! నీవు బలశాలివి. సింహపరాక్రముడవు. నీ శక్తి సామర్థ్యాలు అద్భుతాలు. నీమీద ఆధారపడ్డాను. నీ బల పరాక్రమాలు ప్రదర్శించు. జనకరాజపుత్రి జాడ తెల్సుకో. తిరిగిరా.

## అత్యుత్సాహం

నలుగురు నాయకులు వారి వారి సేనలు ప్రయాణానికి సిద్ధం. అందరిలో సంతోషం. గట్టిగా గర్జించారు. సింహనాదాలు చేశారు. వికృతంగా కేకలు వేశారు. తమకి తామే పొగుడుకున్నారు.

ఒకడు – ఆ దుష్ట రావణుడు వాడు నాకు దొరికితే నేనే చంపేస్తాను. వాడి సేనల్ని హతమారుస్తాను. క్షణంలో సీతామాతని తెస్తాను.

ఇంకొకడు – వైదేహి పాతాళంలో ఉండనీ. నేనొక్కణ్ణీ పోతాను. ఎన్ని శ్రమ సంకటాలనైనా సహిస్తాను. ఆ తల్లిని తీసుకువస్తాను.

వేరొకడు – చెట్లని పడగొడతాను. కొండల్ని పిండి చేస్తాను. భూమిని బద్దలు కొడతాను. సముద్రాల్ని కల్లోల పరుస్తాను. ఎన్ని యోజనాలైనా ఎగురుతాను.

మరొకడు – నేను వందల కొద్దీ యోజనాల్ని దాటుతాను. నన్ను ఆపగలవారు ఒక్కడూ లేదు. అలా ప్రగల్భాలు పలికారు. అందులో సుగ్రీవుని ముందు పలికారు. అతడేమీ అనలేదు. ప్రోత్సహించాడు. పంపించాడు. తమ తమ బలగాలతో వెళ్ళారు వానర నాయకులు.

**(సశేషం)**

ధారావాహికం



# ముకుందమాల

- భువనేశ్వరి మారేపల్లి,
9550241921

### 19వ శ్లోకం

**పృథ్వీ రేణు రణుః పయాంసి కణికాః ఫల్గుః స్ఫులింగోఽ లఘు-**
**-స్తేజో నిఃశ్వసనం మరు త్తనుతరం రంధ్రం సుసూక్ష్మం నభః ।**
**క్షుద్రా రుద్రపితామహప్రభృతయః కీటాః సమస్తా సురాః**
**దృష్టే యత్ర స తావకో విజయతే భూమావధూతావధిః ॥ 19 ॥**

ఓ పరమాత్మా ఎంతటి మహిమ కలవాడవు నువ్వు, నీ అఖిల జగత్తత్త్వాన్ని అనుభవించిన తరువాత ఈ భూమి ఒక చిన్న రేణువుగా కనిపిస్తోంది. ఈ సమస్త జలములు చిన్న తుంపరులుగా, తేజో మయమైన అగ్ని చిన్న మిణుగురులుగాను, వాయువు సన్నటి ఊపిరిగాను, ఆకాశము చిన్న ద్వారముగా, నిన్ను సేవించే బ్రహ్మరుద్రాది సమస్త దేవతలు అల్పమైన జీవులుగా గోచరించేటట్లు చేసే నీ యొక్క దివ్యమైన తత్త్వము జాజ్వల్యమానమై నిత్యమై ప్రకాశించుచున్నది. అంటూ కులశేఖరాళ్వార్లు పరమాత్మ యొక్క పరత్వమును విశేషముగా కీర్తిస్తున్నారు.

శ్రీమన్నారాయణుడు పరమాత్మ, అతడు పరిపూర్ణుడు. అంటే ఏమిటి? పరమాత్మ అంటే, తనకంటే అధికుడు లేనటువంటి వాడు. "పరః" – ఎవరికంటే మరియొక పెద్దవాడు ఉండడో అతడు పరముడు అని పరమ శబ్దానికి వ్యుత్పత్తి.

పరమః+అసౌ ఆత్మా అని కర్మధారయం చెప్పుకుంటే తనకు వేరొక అంతరాత్మ అనేవాడు లేని సర్వ స్వతంత్రుడు. కాబట్టి సర్వమునకు ఆయనే పరమాత్ముడు.

తైత్తిరీయ నారాయణములో "పతిం విశ్వస్య ఆత్మేశ్వరం" అంటూ వేదప్రమాణం చూపిస్తుంది. ఆ వాక్యానికి అర్థం సర్వమునకు ఈశ్వరుడు ఆయన.అలాగే తనకు తానే ఈశ్వరుడు అని తెలుస్తున్నది.

అలాగే శ్వేతాశ్వతరోపనిషత్తు "న తస్సమశ్చ అభ్యధికశ్చ దృశ్యతే" అనే వాక్యంలో మరొక అడుగు ముందు వేసి ఇలా చెప్పింది "పరమాత్మ కంటే అధికుడే కాదు సమానుడు కూడా లేదు". ఇలా అనేక ప్రమాణములు వేదము, ఉపనిషత్తులు, పురాణేతిహాసములు విశదీకరిస్తాయి.

అలాంటి పరత్వము కలిగినటువంటి పరమాత్మ, సమస్తములలో అంతర్యామిగా ఉండే ఓ పరంధామా! నీవే పరాత్పరుడవు. కనిపిస్తున్నవి అన్నీ చాలా పెద్దవి, గొప్పవి,

శక్తికలవి అని అనుకుని భ్రమపడ్డాను, కానీ నీ యొక్క దివ్య తత్త్వము తెలుసుకున్నాక, అందరిలో, అన్నింటిలో, అంతటా నీవే వ్యాపకమై, నియామకమైన వాడివని తెలిసిన తరవాత నీ పరత్వము ముందు...

'దృష్టే యత్ర స' ఏ నీ మహిమ పరికించినపుడు,

'పృథ్వీ రేణు రణు:' ఈ భూమి ఒక ధూళికణం లాగా,

'పయాంసి కణికా:' సమస్త జలములు నీటి తుంపర్ల లాగా,

'ఫల్గుస్ఫులింగో లఘు: తేజో' తేజోమయమైన అగ్ని చిన్న నిప్పురవ్వ లాగా,

'నిశ్వసనం మరు త్తనుతరం' వాయువు మిక్కిలి సన్నదైన నిట్టూర్పు వలె.

'రంధ్రం సుసూక్ష్మం నభః' ఆకాశం ఒక సన్నటి బెజ్జంలా,

'క్షుద్రా రుద్రపితామహప్రభృతయః కీటాస్సమస్తాస్సురాః' బ్రహ్మరుద్రాది సమస్త దేవతలు అత్యంత స్వల్పమైన వారుగా గోచరిస్తోంది.

'తావకో విజయతే భూమావధూతావది:' నీ పరత్వము ముందు అంతము లేనటువంటి నీమహిమ అంతటా వ్యాపించి సర్వోత్కర్షతో విరాజిల్లుతున్నది. అంటూ కులశేఖరాళ్వార్లు దేన్ని ఆశ్రయిస్తే మనం తరిస్తామో ఆ పరతత్త్వాన్ని బోధిస్తున్నారు.

"మీ శారీరక కోరికల గురించి ఎక్కువగా ఆలోచించవద్దు. భక్తులతో సత్సంగం చేయండి. మీ హృదయంలో శ్రీరాముని ప్రతిరూపాన్ని ఉంచండి. శ్రీరామ నామాన్ని ఎల్లప్పుడూ



పునరావృతం చేయండి. కామం, దురాశ, క్రోధాన్ని నశింపజేయండి. ద్వేషం మరియు అహంకారం అన్ని జీవులలో అతని ఉనికిని అనుభవించండి మరియు మీరు అతనిలో మాత్రమే జీవిస్తారు మరియు శాశ్వతమైన ఆనందం" అని తన శిష్యులకు సూచనలు చేస్తూ కులశేఖరాళ్వార్లు దేన్ని ఆశ్రయిస్తే మనం తరిస్తామని చెప్పారో, అదే పరతత్త్వాన్ని సమర్థ రామదాసు కూడా బోధిస్తున్నారు.

సంత్ రామదాసు ప్రపంచంలోని గొప్ప సాధువులలో ఒకరు. శివాజీకి ఆయనే స్ఫూర్తి. అతను మహారాష్ట్ర లోని జాంబ్‌లో సూర్యాజీ పంత్ మరియు రేణుకా బాయి దంపతులకు జన్మించాడు, సమర్థ రామదాసు అసలు పేరు 'నారాయణ్ సూర్యాజీ'. వారి వంశస్థులంతా సూర్యుడినీ, రాముడినీ ఇష్టదైవాలుగా కొలుస్తారట. అందుకే ఆ ఇద్దరి పేర్లూ స్ఫురించేట్లుగా ఆ పేరు పెట్టారు. నారాయణ్ మహారాష్ట్రలోని గోదావరి ఒడ్డున ఉన్న ఓ చిన్న గ్రామంలో 1665 శ్రీరామనవమి రోజున జన్మించాడు. ఒకవైపు తరతరాలుగా వస్తున్న రామభక్తి, మరో వైపు తన తరంగాలతో రామాయణాన్ని గుర్తుచేస్తున్న గోదావరి తల్లి, నారాయణుడిలో రామభక్తిని పరాకాష్టకు తీసుకువెళ్లాయి. రామదాసు చిన్నప్పటి నుంచి ఇహ సంసారం పట్ల విముఖంగా ఉండేవాడు.

బాల్యంలోనే తండ్రి చనిపోవడంతో, ఆ వైరాగ్యం మరింతగా హెచ్చింది. రామదాసు విరక్తిని గమనించిన రాముడు తానే స్వయంగా ప్రత్యక్షం అయ్యాడట. "శ్రీరామ జయరామ జయజయ రామ" అనే 13 అక్షరాల తారకమంత్రాన్ని రోజుకి 108 సార్లు జపిస్తూ ఉండమని సూచించాడట. ఆ తారకమంత్రాన్ని జపిస్తున్న కొద్దీ, సంసారం పట్ల ఉన్న మాయ అంతా పటాపంచలు కాసాగింది.

బాలుడిగా, రామదాసు హిందూ గ్రంథాల గురించి కొంత జ్ఞానాన్ని సంపాదించాడు మరియు ధ్యానం మరియు మతపరమైన అధ్యయనం పట్ల ఇష్టాన్ని పెంచుకున్నాడు. ఒకరోజు ఒక గదిలో తలుపు మూసుకుని భగవంతుని ధ్యానం చేయడం ప్రారంభించాడు. ఏం చేస్తున్నావని అతని తల్లి అడగ్గా, తాను ధ్యానం చేస్తున్నానని, లోక కళ్యాణం కోసం ప్రార్థిస్తున్నానని రామదాసు బదులిచ్చారు. అతని తల్లి బాలుడి పూర్వ మతపరమైన మొగ్గును చూసి ఆశ్చర్యపోయింది మరియు సంతోషించింది.

క్రీ.శ 1620 వ సంవత్సరంలో ఆయనకు వివాహం జరుగుతున్న సమయంలో, పురోహితులు సావధాన మంత్రములు చదువుతున్నప్పుడు వివాహ బంధం లోకి వెళ్ళడం ఇష్టం లేక ఆయన అక్కడి నుండి వెళ్ళిపోయారు. ఆ తరువాత రామదాసు నాసిక్ దగ్గర లోని టాక్లి గ్రామానికి వెళ్ళారు. అక్కడ పన్నెండు సంవత్సరముల పాటు తపస్సు చేసి శ్రీ రామానుగ్రహము పొందారు.

రామభక్తిలో మునిగిపోయిన నారాయణుడు సన్యాసాన్ని స్వీకరించి "సమర్థరామదాసు"గా మారాడు. రాముడు వనవాసం చేసిన నాసిక్‌కు చేరుకుని సుదీర్ఘకాలం తపస్సు చేశాడు. ఆ తర్వాత దేశాటనకు బయల్దేరాడు. దేశాటనలో రామదాసు అనేక అనుభవాలను ఎదుర్కొన్నాడు. ఆ అనుభవాలన్నింటినీ కూడా రెండు పుస్తకాలుగా రాశాడు. తన చుట్టూ ఉన్న పరిస్థితులు రామదాసుని తీవ్రంగా ఆలోచింపచేశాయి. ఆ సమయంలో దేశం అంతా అతలాకుతలంగా ఉంది, స్థానిక రాజులు తమలో తాము కొట్టుకు చస్తున్నారు, ప్రజలు నానాకష్టాలూ ఎదుర్కొంటున్నారు. ప్రజల బాధలు తీరాలంటే ఒక సమర్థమైన నాయకత్వం ఉండాలన్న నిశ్చయానికి వచ్చారు రామదాసు. ఆయన హనుమంతునికి వీరభక్తుడు. ఆ ఆంజనేయుని లాగానే అందరికీ తగిన దేహధారుడ్యం ఉండాలనీ, ఆపదలలో ఉన్న సాటి వారిని ఆదుకోవాలని ఆశించేవారు. అందుకు తగినట్లుగానే ఆధ్మాత్మికతతో పాటుగా ఆరోగ్యం గురించీ, పోరాట పటిమ గురించి కూడా ప్రజలకు బోధించసాగారు. ఆ బోధనలు శివాజీ మహారాజుని ఎంతగానో ప్రభావితం చేశాయని చెబుతారు.

శ్రీ సమర్థ రామదాసస్వామి శ్రీ రామతత్వాన్ని బోధించారు, స్వామి హనుమలా కార్యదీక్ష నలవరుచు కొమ్మని భక్తులకు సూచించారాయన. ఎన్నో హనుమత్ మఠములను స్వామి స్థాపించారు.

శ్రీసమర్థరామదాసస్వామిగా ఖ్యాతి నొందిన స్వామి తన 24వ ఏట భారతదేశ తీర్థయాత్రను ప్రారంభించారు, పన్నెండేళ్ళపాటు స్వామి భారతదేశ నలుచెరగులా పర్యటించారు, ఈ పర్యటనలో స్వామి దేశ ప్రజల యొక్క వాస్తవ పరిస్థితులను ప్రత్యక్షంగా చూసిన స్వామి, ప్రజల కష్టాలను దూరం చేయాలి, హైందవధర్మ విలువలను ప్రజలకు అందించాలి అనే తన మహాకార్యమును కృష్ణానదీ తీరంలో ప్రారంభించారు.

క్రూరులైన పాలకులు, వారి అత్యాచారాలు నాటి ప్రజలను నిరాశా నిస్పృహల లోనికి నెట్టాయి. ఆ విధంగా నిస్తేజంగా ఉన్న ప్రజలకు స్వామి బోధలు కొత్త మార్గాన్ని చూపాయి, వారికి కొత్త స్ఫూర్తి నిచ్చాయి, నాటి మహారాష్ట్ర సమాజం ఒక కొత్త ఉత్సాహంతో బానిసత్వ సంకెళ్ళు తెంచుకొని, స్వతంత్రాన్ని సాధించి, హైందవ ధర్మాన్ని ఆలంబనగా చేసుకొని, సర్వతోముఖాభివృద్ధి సాధించి, శాస్త్ర, శస్త్ర, ఆధ్యాత్మిక రంగాలలో అపూర్వమైన అభివృద్ధి సాధించింది. స్వామి బోధలకు ఉన్న శక్తి అటువంటిది. ఒక ఛత్రపతి శివాజి మహరాజు వంటి వ్యక్తి స్వామి శిష్యరికములో తయారు అయ్యారంటే స్వామి వారి బోధల శక్తి మనకి అర్థం అవుతుంది.

ఛత్రపతి శివాజీ మహరాజు గారు సమర్థ రామదాస స్వామి వారి ముఖ్య శిష్యులలో ఒకరు. రాజనీతి, ధర్మము మరియు ఆధ్యాత్మికతకు సంబంధించిన విషయాలలో స్వామి సూచించిన



బాటలో నడిచారాయన. సమర్థ రామదాస స్వామి మనకు గొప్ప వాఙ్మయాన్ని అందించారు. దాసబోధ, మనాచీ శ్లోకములు, ఆత్మారాం వారి రచనలలో ప్రముఖమైనవి.

పండర్‌పూర్ పుణ్యక్షేత్రం ఉందనే విషయం తెలియనందున రామదాసు దానిని సందర్శించలేదు. ఒకరోజు, సంప్రదాయం ప్రకారం, పాండురంగ విట్టల్, ఒక బ్రాహ్మణ రూపంలో, మూడు వందల మంది యాత్రికుల బృందంతో, రామదాసు ముందు కనిపించాడు మరియు శ్రీకృష్ణుడిని చూడడానికి మీకు ఏమైనా అభ్యంతరం ఉందా అని అడిగాడు. రామదాసు ప్రతికూలంగా స్పందించారు. పాండురంగుడు రామదాసును పండర్‌పూర్‌కు తీసుకువెళ్లాడు, భక్తులు ఆలయానికి చేరుకున్నప్పుడు, బ్రాహ్మణుడు అదృశ్యమయ్యాడు. తనను ఆ పవిత్ర స్థలానికి తీసుకువచ్చింది మరెవరో కాదని రామదాసుకు తెలిసింది. అతను ఆలయంలోకి ప్రవేశించి, అక్కడి దృశ్యాన్ని చూసి ఆశ్చర్యపోయాడు. శ్రీరాముడు ఒక ఇటుకపై ఒంటరిగా నిలబడి ఉన్నాడు.

రామదాసు శ్రీరాముడిని ఇలా సంబోధించాడు: "ఓ ప్రభూ, ఇక్కడ ఒంటరిగా ఏమి చేస్తున్నావు? నీ సోదరుడు లక్ష్మణుడు మరియు నీ భార్య సీతామాత ఎక్కడ ఉన్నారు? మారుతి ఎక్కడ ఉన్నారు మరియు కోతుల సమూహాలు ఎక్కడ ఉన్నాయి?". ఈ మాటలు వినగానే ఆ చిత్రం ఒక్కసారిగా శ్రీ పండరీనాథునిగా రూపాంతరం చెందింది. రామదాసు పాండురంగని దయకు,

ముందు సాష్టాంగం చేసి, అరుదైన దర్శనం పొందినందుకు సంతోషకరమైన పాటలు పాడాడు. భగవంతుని అనేక అవతారాలు ఆయన అనేక రూపాలే అని రామదాసుకు ఇప్పుడు రెట్టింపు నమ్మకం కలిగింది మరియు ప్రపంచంలో అందరిలో వున్న వ్యక్తి ఆ పాండురంగడే. ఆయనను గౌరవించాలని మరియు పూజించాలని బోధించారు. రామదాసు పాండురంగను తన హృదయపూర్వకంగా ఆరాధించాడు మరియు పాండురంగ విట్టల్‌కు భక్తుడు అయ్యాడు. పండర్‌పూర్‌లో, రామదాసుకు తుకారాం మరియు ఇతర సాధువులతో పరిచయం ఏర్పడింది. తన తీర్థయాత్రలలో, రామదాసు భారతీయుల సామాజిక, రాజకీయ మరియు ఆర్థిక పరిస్థితులను మరియు జీవితంలో వారి నిస్సహాయతను గమనించి అధ్యయనం చేశారు.

శివుని అవతారం మరియు మహారాష్ట్ర రాజ్య స్థాపకుడు అయిన శివాజీకి సహాయం చేయమని శ్రీరాముడు రామదాసును కృష్ణా తీరానికి వెళ్ళమని ఆజ్ఞాపించాడని చెబుతారు. రామదాసు కృష్ణుని వద్దకు వచ్చి మహాబలేశ్వర్ నుండి కొల్హాపూర్ వరకు బోధిస్తూ వెళ్ళాడు. అతను మారుతి యొక్క పదకొండు ప్రధాన స్థానాలను స్థాపించాడు, ఇది భౌతిక అభివృద్ధి యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పింది. చంపావతిలో శ్రీరామచంద్రుని విగ్రహాలను ప్రతిష్ఠించి శ్రీరామ నవమి మహోత్సవాలను, శ్రీరాముని రథోత్సవాన్ని పరిచయం చేశారు. శివాజీ రామదాసు శిష్యుడు అయినది సింగన్‌వాడి అనే ప్రదేశంలో.

శివాజీ తన గురువు చెప్పులను సింహాసనంపై ఉంచి, తన గురువు యొక్క ఆదేశాలు మరియు గురువు మార్గదర్శకత్వంలో రాజ్యానికి రాజప్రతినిధిగా పనిచేశాడు మరియు నారింజ రంగు



యొక్క జెండాను స్వీకరించాడు.

శివాజీ రామదాసు ముందు సాష్టాంగపడి, తన గురుదేవుని సేవలో తన జీవితాన్ని గడిపి నట్లయితే అతను చాలా సంతోషంగా ఉంటాడని మరియు తనను తాను ధన్యుడిగా భావిస్తానని చెప్పాడు. అప్పుడు రామదాసు, "ఈ గిన్నె తీసుకో, మన గోలకి వెళ్దాం" అన్నాడు. అందుకే రామదాసు, శివాజీ సతారా చుట్టూ ప్రదక్షిణలు చేశారు. ప్రజలు ఆ జంట ముందు భక్తిపూర్వకంగా నమస్కరించి వారికి భిక్ష పెట్టారు. ఈ జంట నదికి తిరిగి వచ్చింది. రామదాసు తన సాధారణ భోజనాన్ని సిద్ధం చేశాడు మరియు శివాజీ తన గురుదేవ్ భోజనం ముగించిన తర్వాత మిగిలి ఉన్న దానిలో పాలుపంచుకున్నాడు. అప్పుడు శివాజీ చిరునవ్వుతో తన గురుదేవుడిని బిచ్చగాడిగా తగ్గించిన తర్వాత అతనితో ఏమి చేయబోతున్నారని అడిగాడు. రాజుగారికి మహోన్నతమైన ఆదర్శాన్ని నెలకొల్పే అవకాశం వచ్చిందని రామదాసుకు తెలుసు.

రామదాసు చాలా సంవత్సరాలు పవిత్ర పుణ్యక్షేత్రాలను సందర్శించారు. అతను మహారాష్ట్రలో అనేక హనుమాన్ దేవాలయాలను నిర్మించాడు. అతను తన తీర్థయాత్ర నుండి తిరిగి వచ్చినప్పుడు, ఎవరో రామదాసుతో అతని తల్లి తన కోసం తపిస్తున్నదని మరియు అతని విడిపోవడం వల్ల తలెత్తిన తీవ్ర దుఃఖం కారణంగా ఆమె తన కంటి చూపును కోల్పోయిందని చెప్పారు. రామదాసు వెంటనే తన తల్లి వద్దకు వెళ్లాడు. తల్లికి సాష్టాంగ ప్రణామాలు చేసాడు. చాలా సంవత్సరాల తర్వాత తన కొడుకును కలవడం పట్ల అతని తల్లి చాలా సంతోషించింది. రామదాసు తల్లి కళ్లను తాకాడు. కుమారుని యోగ శక్తి ద్వారా ఆమె కోల్పోయిన కంటి చూపును తిరిగి పొందింది.

రామదాసు వ్యవహారశైలి చాలా విచిత్రం. బయటి ప్రపంచానికి పిచ్చివాడిలా కనిపించాడు. అతనికి ఒక చిన్న విల్లు ఉంది. అతను తన పక్కన పెద్ద సంఖ్యలో రాళ్లను కలిగి ఉన్నాడు, దానితో అతను చూసిన ప్రతి వస్తువును కొట్టాడు. అతని బోధనలపై నిజంగా ఆసక్తి ఉన్న పురుషులకు, అతను 'శ్రీరామ జయరామ జయ జయ రామ' అనే మంత్రాన్ని ఇచ్చాడు.

రామదాసుకు పదకొండు వందల మంది శిష్యులు ఉన్నారు, వారిలో మూడు వందల మంది మహిళలు ఉన్నారు. స్త్రీ శిష్యులు కూడా నిష్ణాతులైన బోధకులు మరియు సద్గురువులు. రామదాసు తన శిష్యులను భారతదేశంలోని అన్ని ప్రాంతాలకు హిందూ మత వ్యాప్తికి పంపాడు. ఉత్తరాదిలోని అతని శిష్యులు మరియు మఠాలు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా శివాజీకి మరియు అతని పనికి సహాయం చేశారు. దక్షిణాదిలోని రామదాసు సంస్థ, తంజావూరు చుట్టూ, శివాజీ కుమారుడు రాజారాం, జింజికి వెళ్లి ఔరంగజేబుతో ఇరవై సంవత్సరాల యుద్ధం కొనసాగించడానికి సహాయం చేసింది. రామదాసు తంజావూరు సందర్శించినప్పుడు, శివాజీకి సవతి సోదరుడైన వెంకోజీ శిష్యుడు అయ్యాడు.





రామదాసు తన ప్రత్యక్ష శిష్యుడైన భీమస్వామిని తంజావూరు మఠానికి మహంత్‌గా నియమించాడు.

రామదాసు సాధారణంగా అడవిలో నివసించడానికి ఇష్టపడతారు, అక్కడ అతను మంచి ధ్యానం కలిగి ఉంటానని చెబుతాడు. తన చివరి రోజుల్లో, రామదాసు తన సమయాన్ని కొంతవరకు సాహిత్య కార్యకలాపాలకు మరియు కొంతవరకు ఉత్తర మరియు దక్షిణాదిలో తన శిష్యులు మరియు మఠాలను క్రమబద్ధంగా నిర్మించడానికి కేటాయించారు. రామదాసు సాహిత్య రచనలైన దశబోధ్, మనచే శ్లోక్ (మనస్సును ఉద్దేశించి చేసిన పద్యం), కరుణాష్టకాలు (దేవుని స్తోత్రాలు) మరియు రామాయణం (శ్రీరాముడు లంకను జయించడం మరియు రావణుని సంహరించడం గురించి మాత్రమే వివరించడం) చాలా ప్రజాదరణ పొందాయి.

భారతదేశంలో హిందూ మతాన్ని పునరుద్ధరించడంలో రామదాసు యొక్క అసాధారణ సహనం మరియు దృఢ సంకల్పానికి నివాళిగా ప్రజలు అతనికి సమర్థ (సర్వ-శక్తివంతమైన) రామదాసు అని పేరు పెట్టారు, శివాజీతో పాటుగా ఆయన కుమారుడు శంభాజీకి కూడా రామదాసు అంటే చాలా గౌరవం ఉండేది. శివాజీ చనిపోయి రాజ్యపు మనుగడ ప్రశ్నార్థకంగా మారినప్పుడు... శంభాజీకి రామదాసే దిశానిర్దేశం చేశారట. ఇక ఎప్పుడైతే తనకు వయసు మీదపడుతోందని రామదాసు గ్రహించారో, తన తనువుని చాలించేందుకు నిశ్చయించుకున్నారు. మహారాష్ట్రలోని సజ్జన్‌గఢ్ అనే ప్రాంతంలో రోజుల తరబడి ఉపవాసం చేస్తూ, మనసున ఆ రాముని జపిస్తూ 1681లో మాఘ మాసం లో బహుళనవమి నాడు స్వామి తన భౌతిక దేహాన్ని విడిచి రామునిలో ఐక్యమైపోయారు. ఆయన మరణించిన చోట, శంభాజీ మహారాజే ఒక సమాధిని నిర్మించారు. రామదాసు తన చివరి శ్వాసతో రామ మంత్రాన్ని పునరావృతం చేశారు. అతను లోకం నుండి బయలుదేరే సమయంలో, అతని శరీరం నుండి మిరుమిట్లు గొలిపే కాంతి వెలువడింది మరియు రామదాసు శ్రీరాముని స్వరూపంలో లీనమయ్యాడు.

రామదాసు బోధ చేయడమే కాదు, అసంఖ్యాకమైన పుస్తకాలు కూడా రాశారు. ఆయన రాసిన 'దాసబోధ' అనే పుస్తకం ఆధ్యాత్మిక రంగంలోకి ప్రవేశించాలనుకునే ప్రతి ఒక్కరికీ ఒక దిశను అందిస్తుంది. దాసబోధతో పాటుగా రామాయణానికి మరాఠీ అనువాదాన్ని కూడా అందించారు. ఇక ఆత్మారామ్, పంచమన్, సగుధ్యాయన్, సప్తసమయం లాంటి పుస్తకాలు సరేసరి! వీటితో పాటుగా అనేక దేవీదేవతల ఆరతులు కూడా రాశారు. సమర్థ రామదాసు తన తత్వాన్ని ప్రచారం చేస్తూ దేశమంతా పర్యటించారు. ఆ సమయంలో వందలాది ఆంజనేయుని ఆలయాలను ప్రతిష్ఠించారు. ఆయనకు కులమత భేదాలు ఉండేవి కావు, స్త్రీలను కూడా తన శిష్యురాళ్లుగా స్వీకరించేవారు. రామదాసు ఇంత విశిష్టమైన వ్యక్తి కాబట్టే... ఆయననే పరమగురువుగా అంగీకరించేవారు మహారాష్ట్రలో కోకొల్లలుగా కనిపిస్తారు.

పరమాత్మ చెట్టు యొక్క జీవశక్తి లాంటివాడు. దానివలన చెట్టు ఏర్పడుతుంది, జీవిస్తుంది, పెరుగుతుంది. అదే పువ్వు కాయ కొమ్మ ఆకులలో వ్యక్తం అవుతుంది. ఒక్కొక్క భాగం ఒక్కొక్క ప్రయోజనం కల్గియుంటుంది. కాని అన్నీ ఆప్రాణ రూపమే. దేవతలంతా ఇటువంటి వృక్ష భాగాలు. పరమాత్మ ఆ వృక్షం యొక్క ప్రాణం. దాని రూపం సద్గురువు. అసలు సమర్థ రామదాసు 'దాసబోధ' లో అంటారు. "సద్గురువును కొల్చేవారు వేరే దైవాలను కొలవనక్కర్లేక పోవడమే కాదు, కొలవడం అనుచితం కూడా, ముక్తి నివ్వగల సద్గురువును కొల్చాక" అని అంటారీయన. వారి మాటలు, వారి జీవితం, వారి బోధలు అన్నీ స్ఫూర్తి దాయకములే.

**ఓం నమో భగవతే వాసుదేవాయనమః**

ధారావాహికం



# శ్రీ వేంకటాచల మాహాత్మ్యము

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి, 9491579452

## బ్రహ్మ పురాణాంతర్గతము

**గత సంచిక తరువాయి**

**"నారద స్యోపదేశేన యచ్చ తైరేవ నిర్మితమ్ ।**
**అస్తి తీర్థసహస్రం తత్ సద్యః సిద్ధి ప్రదాయకమ్ ॥**
**కాశ్యపాశ్రమమారభ్య హ్యర్థయోజనమధ్యతః ।**
**కుమార ధారికాతీర్థాత్ పశ్చిమే సంస్థితంచ తత్ ।**
**సాష్టభైరవతీర్థం తత్ కర్మసిద్ధిప్రదం నృణామ్ ॥"**
**-బ్రహ్మపురాణం. అ. 6. శ్లో. 12,13.**

### తొండమాన్ చక్రవర్తి వృత్తాంతం :

దిలీప మహారాజు దుర్వాసమహర్షితో 'మహాత్మా! శ్రీమన్నారాయణుడు వేంకటాద్రిలో ఏపేరుతో ప్రసిద్ధి చెందాడు? ఏ లక్షణాలతో అక్కడ వేంచేసి ఉన్నాడో ఆ విషయాలను నాకు తెలియ జేయండి అని అడిగాడు. అపుడు దుర్వాస మహర్షి 'దిలీప మహారాజా! వేంకటాద్రిలో భగవానుడు శ్రీనివాసుడనే పేరుతో ప్రసిద్ధి చెందినాడు. ఆయన శంఖ చక్రాలను ధరించి, శాంత స్వరూపుడై ఉంటాడు. ఆయన వేటతో విప్పారిన నేత్రములు కలవాడు, ఎడమ చేతిని నడుముపై పెట్టుకొని కుడి చేతితో వరదముద్రను ధరించి ఉంటాడు. శ్రీదేవి, భూదేవులు లేకుండా ఆయన ఒక్కడే వేటగాని వలె దర్శనమిస్తాడు.

ఆయన నీలమేఘశ్యాముడు పీతాంబరధారి, దృఢమైన గుండ్రని బాహువులు, చక్కని ముక్కు, సుందరమైన నేత్రాలతో శోభిస్తున్నాడు ఆయన దోషరహితుడు, సకల సద్గుణ పరిపూర్ణుడు ప్రశాంత వదనుడు, కోటి మన్మథుల లావణ్యంతో విరాజిల్లుతున్నాడు. ఆయన మకర కుండలాలు ప్రకాశిస్తున్నాయి. ఆయన విశాల వక్షఃస్థలము మహాలక్ష్మితో శోభిల్లుతున్నది.

ఆయన భక్తుల యందు వాత్సల్యంతో వారు కోరినవన్నీ ప్రసాదిస్తాడు. ఆయన తన భక్త వాత్సల్యాన్ని ప్రదర్శిస్తూ తన రెండు చేతులలోని శంఖ చక్రాలను తొండమాన్ చక్రవర్తికి ప్రసాదించాడు. అందువల్లనే ఆయన తన అర్చావతార రూపంలో ఉన్న శిలావిగ్రహంలో రెండు చేతులలో శంఖ చక్రాలు కనబడవు.

దుర్వాస మహర్షి యిలా చెప్పగా దిలీపుడు ఆయనను యిలా ప్రశ్నించాడు. 'ఓ మునిసత్తమా ఆ తొండమాన్ చక్రవర్తి ఎవరు ? అతడు చాలాకాలం క్రితం వాడా ? లేక ఇపుడున్నాడా ? అతనికేమి ఆపద సంభవించింది ? దేవదేవుడు ఆయనకు శంఖ చక్రాలు ఎందుకిచ్చారు? అవన్నీ తెలుసుకోవాలని నాకు చాలా కుతూహలంగా ఉంది. కాబట్టి వాటన్నిటిని వివరంగా తెలియ జేయండి?

దిలీపుడు యిలా అడుగగా దుర్వాసమహర్షి యిలా చెప్పనారభించాడు– పూర్వం చోళదేశంలోని కృష్ణక్షేత్రంలో ద్విజ శ్రేష్ఠుడైన వైఖానసుడుండేవాడు. దాని తీరంలో శ్రీహరి గోపాలుని రూపంలో వేంచేసి ఉన్నాడు. అప్పుడు ధృతవర్మ అనే చోళరాజు కలియుగంలో 25వ వైవస్వత మన్వంతరంలో భూమీమీద

శ్రీ కృష్ణుని దర్శించాలనే కోరికతో తపస్సు చేశాడు. ఆయన ద్వాపర యుగంలో జరిగిన కృష్ణావతార కథను విని మిక్కిలి కుతూహలంతో ఆ గోపాలకృష్ణుని రూపమును దర్శించవలెననే కోరికతో తపస్సు చేశాడు.

భగవంతుని అవతారములు నిత్యములు కనుక స్వామి ఆ రాజుకు గోపాలుని రూపంలో ప్రత్యక్షమయ్యాడు. వైఖానసుడైన బ్రాహ్మణుడు కూడా ఆ ముక్తి కొరకు తపస్సు చేసి భగవంతుని ప్రసన్నం చేసుకున్నాడు. అతని తపస్సుకు మెచ్చి శ్రీ మహావిష్ణువు స్వప్నంలో అతనికి గోపాలుని రూపంలో సాక్షాత్కరించి అతనిని యిలా ఆదేశించాడు.

**త్వయా ధ్యేయః శ్రీనివాసో నాహం ధ్యేయో ద్విజోత్తమ !**
**యో యోగ్యో యస్య జీవస్య తేన ధ్యేయః స ఏవ హి ।**
**యోగ్యో పాసనయా జీవాముక్తిం యాన్తి న సంశయః॥**
**అభిధా శ్రీనివాసస్య తవ యోగ్యా ద్విజోత్తమ ।**
**వేంకటాద్రిం తతో గచ్ఛ శ్రీనివాసః స్వయం హరిః ॥**
**స్వామి పుష్కరిణీ తీరే రమయా సహ మోదతే ।**
**-బ్రహ్మపురాణం అ. 7. శ్లో. 16-19.**

'ఓ బ్రాహ్మణోత్తమా ! నీవు శ్రీనివాసుని ధ్యానించు. నన్ను ధ్యానించవద్దు. ఏ జీవికి ఎవరు యోగ్యులో వారినే ధ్యానించాలి. ఆ విధంగా తనకు తగిన వారిని ఉపాసించుట వలన జీవులు ముక్తిని పొందుతారు. ఇందుకు సందేహం లేదు. ఓ ద్విజోత్తమా ! నీకు శ్రీనివాసుని నామమే జపించుటకు యోగ్యమైనది. కావున నీవు వేంకటాద్రికి వెళ్ళు అక్కడ స్వామి పుష్కరిణీ తీరంలో శ్రీహరి శ్రీనివాసుని రూపంలో లక్ష్మీదేవితో కూడి విహరిస్తున్నాడు. అని ఈ విధంగా చెప్పి శ్రీకృష్ణ పరమాత్మ మరల మరొక స్వప్నంలో ఈ విధంగా ఆదేశించాడు.

**పురా కృతయుగే పశ్చాత్ భాగే శంఖేన వైకృతమ్ ।**
**విమానం కల్పప్రలయే నష్టప్రాయమభూద్విజ ! ॥**
**వల్మీక స్యాన్తరే విష్ణోః ప్రతీమా వర్తతే శుభా ।**
**శంఖేన నిర్మితా పుణ్యా సర్వపాపహరా-మలా ॥**
**జానుమాత్రే నిమగ్నా హి తింత్రిణీ వృక్షమూలతః ॥**
**-బ్రహ్మపురాణం. అ. 9. శ్లో 20-22.**

ఓ బ్రాహ్మణోత్తమా ! పూర్వం కృతయుగం చివరలో శంఖమహారాజు నిర్మించిన ఆలయవిమాన గోపురం కల్పాంత ప్రళయంలో శిథిలమయి పోయింది. కాని ఆయన నిర్మించిన పవిత్రమైన, సర్వపాపహరమైన శుభప్రదమైన విష్ణువు విగ్రహము చింత చెట్టు క్రింద పుట్టలో మోకాళ్ళలోతులో ఉంది.

ఆ చింత చెట్టుకి రెండు ధనువుల దూరంలో భూ తీర్థముంది. దీనిని పూర్వం దేవదేవునికి వంట చేయుటకై భూదేవి నిర్మించింది. అక్కడ గౌతమీ ధేనువు తన పాలతో భగవానుని అభిషేకిస్తుంది. ఆ ధేనువు చింత చెట్టుకు వాయవ్య దిక్కున భూతీర్థంలో నివసిస్తూ యుగాంత ప్రళయం వరకు స్వామిని సేవిస్తుంది.

నీవు శేషాచలానికి వెళ్ళేటప్పుడు దారిలో పాండ్యదేశం నుంచి వచ్చే 'రంగదాస'నే మంచి బుద్ధిమంతుడు నిన్ను కలుస్తాడు. నీవు అతనితో కలిసి స్వామిని ఆరాధించు. మీ ఇద్దరి చేత ఆరాధించబడిన దేవదేవుడు మీ ఇరువురకు ఇష్ట సిద్ధిని ప్రసాదిస్తాడు అని ఆ స్వప్నంలోనే ఆ బ్రాహ్మణునికి 'గోపీనాథుడ'నే పేరు పెట్టి భగవంతుడు అదృశ్యమయ్యాడు.

ఆ గోపీనాధుడు నిద్ర మేల్కొని ఆశ్చర్యచకితుడై తన సంకల్ప సిద్ధికై సంతోషంతో వేంకటాచలానికి బయలుదేరాడు. అతను కొండపై చేరుతుండగానే రంగదాసు అతనిని కలిశాడు. రంగదాసు గోపీనాథుడు పరస్పరం పరిచయాలు చేసుకొని స్వప్నంలో భగవంతుడు చెప్పిన విధంగా చింతచెట్టు మొదల్లో పుట్టలో మరుగుపడి ఉన్న భగవానుని దివ్య మంగళ విగ్రహాన్ని బయటకుతీసి ఆ చెట్టుకు పడమటి ప్రక్కన ప్రతిష్ఠించారు.

అక్కడ లభ్యమయ్యే అకృత్రిమ శిలలతో ఆ విగ్రహం చుట్టూ గోడను నిర్మించారు. ఆ మంటపాన్ని రెల్లుగడ్డితో కప్పి దానిని సుందర మందిరంగా తీర్చి దిద్దారు. వారిద్దరూ ఆ మంటపంలోని దేవునికి పరిచర్యలు చేస్తున్నారు. భక్తుడైన రంగదాసు భూతీర్థానికి స్వామి పుష్కరిణికి మధ్య భగవంతుడు విహరించుటకై పుష్పోద్యానాన్ని నిర్మించాడు. ఆ తోటలో నుండి పూలు కోసి మాలలు కట్టి మూడు వేళలలోను పూజా సమయంలో స్వామి పూజకై ఆ బ్రాహ్మణునికి సమర్పిస్తుండేవాడు.

ప్రతిరోజూ వీరు చేసే పూజను చూసి దేవతలు ఆశ్చర్య పడుతుండే వారు. ఆ దేవతలు వీరి అదృష్టాన్ని, పుణ్యాన్ని చూసి తాము కూడా ఆయనను పూజించాలని కోరుకునేవారు.

వారిద్దరూ భక్తితో ఆనందాన్ని అనుభవిస్తూ అడవిలో దొరికేటటువంటి పూలు, పండ్లు, కందమూలాదులను స్వామికి సమర్పిస్తూ భగవంతుని చక్కగా సేవిస్తున్నారు.

ఇలా కొంతకాలం జరుగగా ఒకనాడు కుండలుడనే గంధర్వుడు తన భార్యలతో పాటు దివ్య విమానాన్ని అధిరోహించి వచ్చి శేషాచలంలో దిగి స్వామి పుష్కరిణీ తీరంలో ఉన్న ఆ దేవదేవుని దర్శించి, ఆరాధించి దానికి ఉత్తరపు దిక్కున ఉన్న మనోహరమైన, సుందరమైన ఉద్యానవనంలో ప్రవేశించి అనేక విలాసచేష్టలతో, తన భార్యలతో క్రీడిస్తున్నాడు. రంగదాసు పొదరిళ్ళలో దాగి ఆ సన్నివేశాన్ని చూసి కామవికారాన్ని పొందాడు.

ఆ తరువాత కొంతసేపటికి అతను అప్రమత్తుడై, ప్రబుద్ధుడై తన పొరపాటుకు చింతించి అప్పటివరకు కోసిన పూలను పడవేసి తాను పరిశుద్ధుడగుటకై స్వామి పుష్కరిణిలో స్నానంచేశాడు. మరల పూలు కోసుకొని, వాటిని తీసుకొని ఆలయానికి వెళ్ళాడు. ఆలస్యంగా వచ్చిన రంగదాసును చూచి గోపీనాధుడు కోపంతో కళ్ళెర్రజేసి రంగదాసా! పూజాసమయమతిక్రమించింది. నీవు యిది మరచి ఎక్కడికి వెళ్ళావు? ఇపుడు దాకా ఎక్కడ ఉన్నావు

? నీవు ఆలస్యంగా రావడానికి కారణమేమి? చెప్పు అని గద్దించి అడిగాడు.

గోపీనాథుడు యిలా అడుగగా రంగదాసు సిగ్గుతో తలవంచి బదులు చెప్పకుండా నిలబడ్డాడు గోపీనాథుడు మరల మరల అడిగినప్పటికీ రంగదాసు ఏమీ బదులు చెప్పలేకుండా మౌనంగా ఉన్నాడు. అప్పుడు ఆకాశవాణి అతనితో యిలా పలికింది.

## అశరీరవాణి వాక్కులు :

'ఓ రంగదాసా ! విను ! కామంతో వ్యాకులమైన మనస్సు స్వస్థత పొందలేదు. స్థిరచిత్తం లేనివానికి సిద్ధికలుగదు. ఇందుకు సందేహం లేదు.

**కామేన వ్యాకులం చిత్తం నైవ స్వాస్థ్యం గమిష్యతీ ।**
**అస్వస్థచిత్తో న క్వా-పి సిద్ధిమేతి న సంశయః ॥**
**-బ్రహ్మపురాణం. అ. 7. శ్లో. 45.**

కావున నీవు ఈ శరీరాన్ని వదలి మరొక శరీరాన్ని పొందు. అప్పుడు నీవు మహారాజువై శిథిలమైన ఈ ఆలయాన్ని అద్భుతములైన గోపురాలతో, మండపాలతో నిర్మించి నూతనంగా శోభాయమానంగా చేయి. అందువల్ల నీకు శుభం కలుగుతుంది. అప్పుడు నీవు వేలకొలది స్త్రీలతో భోగాలనుభవిస్తావు. సందేహం లేదు. నీవు అనేక భోగాలనుభవించిన తరువాత నా పాదారవిందముల యందు మనస్సును లగ్నం చేస్తావు. ఆ జన్మలో నీకు శత్రుపీడ కలుగుతుంది. అపుడు నీకు విజయం లభించుటకై విజయ కారకాలైన శంఖ చక్రాలను నీకు ప్రసాదిస్తాను. మరణానంతరం నీకు, నీ వంశం వారందరికీ కూడా ముక్తిని ప్రసాదిస్తాను. సందేహించ వలదు ! అని ఆకాశవాణి చెప్పి విరమించింది.

అశరీరవాణి పలుకులు విన్న రంగదాసు నిరాహారుడై భగవంతుని ధ్యానిస్తూ కాలక్రమంలో శరీరాన్ని త్యజించాడు. ఆ తరువాత నారాయణ పురాన్ని పాలించే ద్రవిడ దేశరాజుకు కుమారుడుగా జన్మించాడు. అతనికి 'తొండమానుడ'నే పేరు పెట్టారు. అతడు చిన్నప్పటినుండే విష్ణుభక్తి పరాయణుడయ్యాడు. అతడు పెరిగి పెద్దవాడై తొండమండలాధిపతియై తొండమాన్ చక్రవర్తిగా ప్రసిద్ధి చెందాడు. వేలమంది నారీమణులతో సుఖభోగాలనుభవించాడు.

## వేంకటాద్రిలో ఆలయగోపుర నిర్మాణం :

తొండమాన్ చక్రవర్తి ప్రతిరోజు బిలద్వారంగుండా వేంకటాద్రికి వెళ్ళి శ్రీనివాసుని ఆరాధిస్తూండేవాడు. అతను భగవంతునికి భక్తి పారవశ్యంతో అనేక గ్రామాలను భగవంతుని కైంకర్యానికి ఇచ్చాడు. రెండు ప్రాకారాలు రెండు గోపురాలు గర్భ గృహంతో శ్రీనివాసునికి దివ్యమైన ఆలయం నిర్మించాడు. అలాగే పాకశాల, యాగశాల, ధాన్యాగారం, గోశాల మొదలగు వాటిని కూడా నిర్మించాడు. ఆలయానికి కావలసిన సకల సదుపాయాలు కలిగించాడు ఇవన్నీ 23వ కలియుగంలో చేశాడు. ఆ తరువాత



బ్రాహ్మణులచే భగవంతునికి ఉత్సవాలు చేయించాడు. స్వామివారికి అనేక రత్న ఖచితములైన దివ్యాభరణములను సమర్పించాడు.

**ప్రాకారద్వయ సంయుక్తం గోపుర ద్వయ సంయుతమ్ ।**
**గర్భాగార సమాయుక్తం అకరోద్దివ్యమాలయమ్ ॥**
**తథా మహానసాగారం యాగమండపమేవ చ ।**
**ధాన్యాగారం చ గోశాలాం యద్యదంగం హరేః శుభమ్ ॥**
**కారయామాస తత్సర్వం అష్టావింశే కలౌయుగే, ।**
**-బ్రహ్మపురాణం. అ. 7. శ్లో. 55-57.**

ఒకనాడు తొండమాన్ చక్రవర్తి శ్రీనివాసుని సన్నిధిలోనుండగా బలగర్వితులైన శత్రువులు నారాయణపురాన్ని ముట్టడించారు. సముద్ర ఘోషవలె వెనబడుతున్న శత్రుసైన్యఘోషనువిని రాజు సంకోచించకుండా వారిని ఎదుర్కొన్నాడు. కాని యుద్ధంలో శత్రువులు అతనిని ఓడించారు. తొండమానుడు పరాజయంతో దుఃఖితుడై శ్రీనివాసుని శరణు వేడాడు. బిలద్వారం గుండా వేంకటాద్రికి వెళ్ళి దేవ దేవుడైన శ్రీనివాసుని పాదాలు గట్టిగా పట్టుకొని 'స్వామీ ! నన్ను రక్షించు రక్షించు' అని బాధతో వేడుకొన్నాడు. అప్పుడు అర్చామూర్తిగా నున్న శ్రీనివాసుడు అతనితో యిలా అన్నాడు.

'నాయనా ! భయపడవద్దు. నీకు శుభం కలుగుతుంది. నీకు శంఖచక్రాలను యిస్తాను. వాటితో నీ దివ్య పట్టణానికి వెళ్ళి ఆ శత్రువులను సంహరించెదవు ! అని చెప్పి శంఖ చక్రాలను తొండమానుడికి ప్రసా దించాడు. ఆయన వాటిని తీసుకొనివెళ్ళి శత్రువులను జయించి రాజ్యాన్ని నిష్కంటకం చేసి మరల ఆ ఆయుధములతో పాటు తొండమానుడు శ్రీనివాసుని సన్నిధానానికి వెళ్ళి దేవదేవునికి నమస్కరించి ఆయనను అనేక విధాలు స్తుతించాడు. అప్పుడు శ్రీనివాసుడు 'నాయనా! వరం కోరుకో' అన్నాడు అప్పుడు తొండమానుడు యిలా వరం కోరాడు.


**మమా-యుధప్రదానస్య ఖ్యాత్యై దేవోత్తమ ప్రభో !**
**అర్చాబింబే శిలాబింబే చక్ర శంఖౌ న ధారయ ॥**
**ఇతి సంప్రార్థితో దేవో న దధార పునశ్చ తౌ ॥**
**అదృశ్యౌ తిష్ఠతశ్చో భౌ పార్శ్వతః శార్ఙ్గధన్వనః ॥**
**-బ్రహ్మపురాణం. అ. 7. శ్లో. 65, 66.**

'స్వామీ ! నీవు నాకు నీ ఆయుధాలైన శంఖచక్రాలను ప్రసాదించావు. దానికి చిహ్నంగా అర్చావిగ్రహంలో, శిలా ప్రతిమలో శంఖ చక్రాలను నీవు ధరించవద్దు. అని ప్రార్థించగా భగవంతుడు 'అలాగే' నని వాటిని మరలా ధరించలేదు. కావున అవి శ్రీమహా విష్ణువుకు రెండువైపులా కనపడకుండానే ఉంటాయి. ఓ దిలీపమహారాజా ! పుణ్యాత్మా ! నీవు అడిగిన విధంగా తొండమానునికి శంఖచక్రాలను ప్రదానం చేసిన విషయాన్నంతా వివరంగా చెప్పాను. ఇంకేమి వినగోరుతున్నావు ? అడుగు. చెబుతాను' అని దుర్వాసమహర్షి దిలీపునితో అన్నాడు.

## పుష్కరిణి వాయవ్యంలో వరాహస్వామి :

దిలీపుడు దుర్వాసమహర్షిని మునివర్యా, స్వామి పుష్కరిణిలో ఎన్ని పవిత్ర తీర్థాలున్నాయి ? వాటి పేర్లేంటి ? ఆ తీర్థాలకు అధిదేవతలెవరు ? వాటిల్లో స్నానం చేస్తే కలిగే ఫలితాలేమిటి ? వీటన్నిటిని నాకు వివరించి చెప్పండి' అని అడిగాడు. అపుడు దుర్వాసమహర్షి దిలీపునికి తీర్థ మాహాత్మ్యాన్ని యిలా చెప్పనారంభించాడు.

'మహారాజా! తీర్థాలన్నిటిలో స్వామి పుష్కరిణి ఉత్తమమైన పుణ్య తీర్థం. ఇది గంగ వలె పాపాలను పోగొడుతుంది. దీనిని తీర్థ ప్రస్తావనలో తప్పకుండ స్మరించాలి. స్వామి పుష్కరిణికి వాయవ్య భాగంలో వరాహ తీర్థమున్నది దానిని కశ్యప ప్రజాపతి భూమిపైకి తీసుకొనివచ్చాడు. బ్రహ్మదేవుడు శ్రీమహా విష్ణువును స్తుతించి పాతాళంలో మునిగిపోయిన భూమిని ఉద్ధరించమని



కోరాడు. అప్పుడు అతని ముక్కురంధ్రము నుండి మహా బలవంతుడైన వరాహస్వామి ఆవిర్భవించి పాతాళానికి వెళ్ళి మహాబలవంతుడైన హిరణ్యాక్షుని సంహరించి భూమిని తన కోరలతో ఉద్ధరించాడు.

బ్రహ్మదేవుడు లోకరక్షణకై ఆ పురుషోత్తముని దివ్య మంగళ విగ్రహాన్ని (వరాహమూర్తిని) వేంకటాచలంలో స్వామి పుష్కరిణి తీరంలో ప్రతిష్ఠించాడు. స్వామి పుష్కరిణికి వాయవ్య భాగంలో వరాహస్వామికి జలాధివాసం కూడా చేశాడు. బ్రహ్మదేవుడు వరాహస్వామిని ప్రతిష్ఠించిన తరువాత దేవతలు, ఋషులు, పితృదేవతలతో పాటు పుష్కరిణిలో స్నానమాచరించారు. అపుడు సర్వలోకవాసులు చూస్తూండగా యిలా అన్నాడు.

'స్వామి పుష్కరిణిలోని వాయవ్య భాగం వరాహ తీర్థంగా ప్రసిద్ధి చెందు తుంది. ఇక్కడికి భగవంతుని దర్శనానికై వచ్చేవారు ఈ వరాహపుష్కరిణిలో స్నానం చేయకుండా, పరిశుద్ధులు కాకుండా దేవునికి నమస్కరించరాదు. భక్తులు ఈ పుష్కరిణిలో స్నానం చేసి పరిశుద్ధులై స్వామివారిని దర్శించాలి.

**వరాహదర్శనాత్పూర్వం శ్రీనివాసం నమేన్న చ ।**
**దర్శనాత్ప్రాగ్వరాహస్య శ్రీనివాసో న తృప్యతి ॥**
**-బ్రహ్మ. పు; అ-8; శ్లో. 10;**

వరాహస్వామిని దర్శించకుండా శ్రీనివాసునికి నమస్కరించరాదు. అలా చేస్తే శ్రీనివాసుడు తృప్తి చెందడు. కావున భక్తులు ముందుగా వరాహ స్వామిని దర్శించాలని బ్రహ్మదేవుడు కట్టుబాటును ఏర్పరచాడు. ఆ తరువాత శ్రీనివాసుని దర్శించి అనేక విధాలైన స్తోత్రాలతో ఆయనను స్తుతించాడు. ఆయన పాద పద్మములను పట్టుకొని ఈ విధంగా వరం కోరాడు.

**'మత్థాపిత వరాహస్య పూర్వం స్యా త్పూజనం హరే !**

'స్వామీ ! నేను ప్రతిష్ఠించిన వరాహస్వామికి మీ కంటే ముందు నిత్యపూజ జరుగవలెను. అని ప్రార్థించగా భగవానుడు "తథాస్తు' అలాగేనని వరమిచ్చి, ఆ విధంగా మొదటగా వరాహస్వామికే ఆరాధన జరుగునట్లు ఏర్పాటు చేశాడు. కావున స్వామి పుష్కరిణిలో వాయవ్య భాగంలో ఉన్న వరాహ పుష్కరిణి మిక్కిలి శ్రేష్ఠమైనది, పుణ్యప్రదమైనది.

## బోయవానికి వరాహస్వామి దర్శనం :

మరల యుగాంత ప్రళయంలో ఆ దేవాలయం శిథిలమైంది. అప్పుడు ఆ వేంకటాద్రిలో ఒక బోయవాడు ఉండేవాడు. అతడు నిర్మలమైన హృదయం కలవాడు. శ్యామాకధాన్యం (చామలు) పండించేవాడు. అతను ప్రతిరోజు స్నానం చేసి తడిబట్టలతో శ్యామాక బియ్యాన్ని వైఖానస బ్రాహ్మణునికి ఇచ్చి, ఆయనచేత వండించి భగవంతునికి నైవేద్యం పెట్టించి, అప్పుడు దానిని తాను భుజించేవాడు.

ఇలా కొంతకాలం జరుగగా ఒకనాడు శ్యామాక ధాన్యాన్ని బియ్యంగా చేసి తన కుమారునికిచ్చి తాను తేనె తీసుకురావడానికి అడవికి వెళ్ళాడు. ఇంతలో ఆకలిగొన్న ఆ బోయవాని కుమారుడు ఆ శ్యామాక బియ్యాన్ని వండి, మనస్సులోనే భగవంతునికి నివేదన చేసి దాన్ని తాను భుజించాడు. ఇంతలో తండ్రి తేనె పట్టు తీసుకొని వచ్చి శ్రీనివాసుని నైవేద్యం కొరకై నీకిచ్చిన బియ్యం తీసుకురమ్మని కుమారుని అడిగాడు. అప్పుడు ఆ కుమారుడు 'నాయనా! నాకు చాలా ఆకలేసింది. అందుచేత నేను వాటిని వండి మనసులోనే భగవంతునికి నివేదించి నేను భుజించాను అని చెప్పాడు.

ఆ బోయవాడు పిల్లవాని మాటలకు కోపించి అతడు చేసిన అపరాధానికి ప్రాయశ్చిత్తంగా తన కుమారుని శిరస్సును ఖండించుటకై వెంటనే కత్తి పైకి తీశాడు. అప్పుడు పుట్టలో దాగి ఉన్న వరాహస్వామి ఆ పిల్లవానిని రక్షించుటకై వెంటనే ఆ ఖడ్గాన్ని పట్టుకొని ఆ బోయవానితో యిలా అన్నాడు. "ఓ నిషాదా ! నీ పుత్రుడు ఏ అపరాధమూ చేయలేదు. అతడు అన్నాన్ని నాకు నైవేద్యం పెట్టాడు. అతడు నీ కంటే అధిక భక్తుడు. అందువల్ల అతడు ప్రీతితో సమర్పించిన నైవేద్యాన్ని నేను స్వీకరించాను! అని స్వామి పలుకగా బోయవాడు ఆశ్చర్యపోయి నలుదిశలా పరికించి చూశాడు.

వరాహస్వామి కనబడినట్టే కనబడి అంతలోనే అదృశ్యమయ్యాడు. అతను ఆ భగవంతుని రూపాన్ని ఎంతగా భావించినా ఆయన్ని మరలా దర్శించలేకపోయాడు. ధర్మాత్ముడైన ఆ బోయవాడు వరాహస్వామిని దర్శించుటకై అన్నం తినకుండా అడవిలో వెతకసాగాడు ఇలా అడవిలో తిరుగుతుండగా ఒకచోట శ్యామాకపొలం మధ్యలో (చామలచేను) లేత శ్యామాక మొక్కలను తింటున్న శ్వేతవరాహాన్ని చూసి కోపంతో దాన్ని చంపటానికి వెంబడించాడు.

ఆ వరాహం అడవిలో అనేక చోట్ల ఆ బోయవానిని తిప్పి తిప్పి అతనికి చిక్కకుండా చివరకు స్వామి పుష్కరిణీ తీరంలోని తన పుట్టలో ప్రవేశించింది. అప్పుడా బోయవాడు ఇతడే సాక్షాత్తు విష్ణుస్వరూపుడైన వరాహస్వామియని తెలుసుకొని ఆ పుట్ట వద్దకు వెంటనే వెళ్ళి ఆ పుట్టకు మిక్కిలి భక్తితో నమస్కరించి పామరభాషతో భగవంతుని స్తుతించాడు.

అంతట పుట్టలోనున్న శ్రీహరి ఆ బోయవానితో యిలా అన్నాడు– 'నాయనా! భక్తా ! సచ్చిదానంద స్వరూపుడనైన నన్ను నీవు దర్శించలేవు. కావున నీకు ఒక ఉపాయము చెబుతాను. విను. పూర్వం బ్రహ్మదేవుడు ప్రతిష్ఠించిన నా శిలావిగ్రహం ఈ పుట్టలో ఉన్నది. నీవు దానిని బయటకు తీసి ఈ పుష్కరిణి తీరంలో ఆలయం నిర్మించి యథావిధిగా బ్రాహ్మణులచే ప్రతిష్ఠింపచేసి పూజావిధానం తెలిసిన వారిచేత నాకు పూజలు చేయించు! అని చెప్పాడు.

**(సశేషం)**

ధారావాహికం



# శ్రీ కృష్ణ తత్వం

– రాళ్ళబండి శ్రీనివాసన్

**గత సంచిక తరువాయి**

చిన్ని కృష్ణునికి ఎన్నెన్నో పనులను చెబుతున్నారు గోపికలు. వంగి వంగి బుడిబుడి అడుగులువేస్తూ చెప్పిన పనులన్నీ చేస్తున్నాడు. అంతలోనే పండ్లో–పండ్లు–ఆ వీధిలో కేక. విన్నాడు కన్నయ్య. లోపలికెళ్లి–దోసిట పట్టినంత ధాన్యంతో బయటికెళ్లాడు. పిలిచాడు. ఆమె పండ్లగంపను దించింది. పండ్లు పెట్టాలని అన్నాడు కృష్ణుడు. గబగబా వస్తుంటే చిట్టిచేతుల్లోని గింజలన్నీ జారిపోయినట్లు గమనించింది ఆమె.

ఇంకేమి చేస్తాడు– బిక్కమొహం వేసాడు కిట్టయ్య. ముద్దుగారే మోమూ–పాలబుగ్గలూ–కాటుకకన్నులూ–నల్లని జులపాలజుట్టు–ఎర్రని చిట్టి అరచేతులూ– చూసిందామె. తనని తాను మరచిపోయింది.

దోసిలి నిండిందో లేదో– రేగుపండ్లు పెడుతూనే వుంది. ప్రతిఫలాపేక్ష రహిత చర్యకు–సత్ఫలప్రదాత అయిన కృష్ణభగవానుడు– ఆమె గంప నిండా రత్నాలను అనుగ్రహించాడు. మన సర్వకర్మలూ భగవదర్పితమైతే– ఎవరికి ఎంత ఎపుడు ఎలా ఇవ్వాలో–అదంతా భగవదభీష్టం. అరిష్టాలు అధికమవుతున్నాయని బృందావనానికి గోవులతో గోపికలతో గోపాలురు బయలుదేరారు. అయితే అక్కడికి మకాం మార్చినప్పటికినీ రాక్షసుల పీడ వెంటాడుతూనే వుందని గ్రహించినాడు కృష్ణుడు. ఈసారి ఒకడు కాదు ఇద్దరు వచ్చారు. ఒకడు వత్సాసురుడు–కోడె (వత్స) దూడలాగానూ వెలగ (కపిత్థాసురుడు) చెట్టు మీద వున్నారు.

ఈ దూడ బావుందంటూ– వత్సాసురుని వెనుక కాళ్లను పట్టి– వడిసెల రాయిలా గిరగిరా తిప్పుతూ–వెలగ చెట్టు కేసి విసిరాడు. ఒకే దెబ్బకు రెండు పిట్టలు అన్నట్లు ఇద్దరూ చచ్చారు. ఇక రాక్షస సంహారానికి–దేవాశ్చ పరిసంతుష్టాః బభూవుః పుష్పవర్షిణః– దేవతలు సంతోషించి పూలవాన కురిపించారు.

దూడ ఎంత తిన్నా కూడా ఇంకనూ తినాలంటుంది. వత్సాసురుడు రుచికి చిహ్నం. ఇకపోతే వెలగపండు నుంచి మంచి వాసన వస్తూనే వుంటుంది. కపిత్థాసురుడు వాసనకు సంకేతం.

ఎన్నెన్ని జన్మలనుంచి ఈ రుచి–వాసనలు మనలను విడిచిపెట్టకుండా ఎంతగానో పట్టి పీడిస్తుంటాయి.అవి ఎపుడైనా సంకల్పాలుగా సంస్కారాలుగానూ రూపుదిద్దుకుంటాయి.

హిరణ్యకశిపుని సంహరించిన తరువాత నరసింహస్వామి– ప్రహ్లాదుని ఏదైనా ఒక వరాన్ని కోరుకోమన్నాడు. స్వామీ! నీకు కావలసినది ఏదీ లేదు. నాకూ కావలసినది ఏదీ లేదు అన్నాడు. మనము ఆ ప్రహ్లాదునితో సరితూగలేం. మా సమస్త కోరికలనూ సంకల్పాదులనూ భస్మం చేసేసి–నీ పాదసన్నిధికి చేర్చుకో స్వామీ అనేది మన ఏకైక ప్రార్థన. మనకు భగవన్నామ విస్మరణం మరణం. స్మరణం శరణం.

ఇంకొక రోజున ఒక కొంగ రూపాన్ని ధరించిన వాడే బకాసురుడు. ఆ కొంగ చాలా బలిష్టంగావుంది. ఇంద్రుని వజ్రాయుధానికి విరిగిన పర్వతంలాగవుంది. హఠాత్తుగా కృష్ణుని మీదకు దూకింది. ఆలస్యం చేయకుండా కృష్ణుణ్ణి ఒడిసిపట్టి మింగేసింది. అయితే చిన్న కృష్ణుడు మింగుడుపడకుండా దాని గొంతులో అడ్డంగా వుండిపోయాడు.

బ్రహ్మాండాలను సృష్టించే స్వామి తనకు ఒక క్రీడగా బకాసురుని నోట్లో మంటల్ని పుట్టించాడు. ఆ తాపానికి తట్టుకోలేక కృష్ణుణ్ణి ఉమ్మేసాడు. అయితే బలమైన ముక్కుతో పొడిచి చంపాలనుకున్నాడు. నోరు తెరిచి పొడవబోగా–వాని పెద్ద ముక్కుపుటాలను కృష్ణుడు తన రెండు చేతులతోపట్టి–గడ్డిపోచలా అవలీలగా చీల్చి– బకాసురుని హతమార్చాడు.

హింసా స్వభావం కలిగినవాడు పైకి– సాధువులాగా కనపడితే– దానిని దంభమని అంటారు. చేపల్ని తినాలని వచ్చిన కొంగ–పైకి ఒక యోగిలాగా ధ్యానంలో వుంటుంది.

ఆ విధంగా కొంగ రూపంలో వచ్చాడు బకాసురుడు. దంభం దర్పం దురభిమానం క్రోధము అహంకారం వాక్పారుష్యం వంచన మొదలైనవన్నీ అసుర సంపత్తిలోనికి చేరుతాయి. ఆ అసురగుణాలు నశించి దైవీసంపద వృద్ధి చెందాలి మనలో.

పరమ శివుని తిరస్కరించినట్టి దక్షునికి గొర్రె తల వచ్చింది. అతని యజ్ఞం యుద్ధమైంది. అయితే కృష్ణుణ్ణి శరణువేడి అర్జునుడు యుద్ధాన్ని చేస్తే–అది యజ్ఞమైంది. కనుక మనకూ శరణాగతియే గతి."పూర్వపుణ్యఫల దివ్యజ్ఞాన సంపత్తితో"– అసురసంపత్తి అంతమైతే భగవత్ సన్నిధిని చేరగలం.

సుఖ క్రీడన వీక్షణాక్షమః గోపబాలురతో కృష్ణభగవానుడు క్రీడించడాన్ని చూసి–ఓర్వలేదట అఘాసురుడు. బకాసురునికి తమ్ముడు వాడు. గోపబాలురతో కూడా కృష్ణుని మింగాలని కొండచిలువ రూపాన్ని ధరించాడు ఆ రాక్షసుడు.

ఒరేయ్! గుహలాగ వున్న దీని నోరు చూస్తుంటే– కొండచిలువ ఏమోయని అన్నాడు ఒక గోపాలుడు. అయితే వీడూ బకాసురునిలాగానే మన కృష్ణుని చేతిలో చస్తాడులే– అన్నాడు మరొకడు. బకాసురుని చీల్చేసిన మన కృష్ణుడు వుంటున్నాడు–భయమేల? అని చప్పట్లు చరుస్తూ అఘాసురుని భయంకరమైన నోట్లోకి లేగదూడలతో పాటుగా నడుచుకుంటూ పోయారు. గోప బాలుర అనన్యగతిత్వానికి– అనన్యశరణత్వానికి బంధీయైపోయాడు కృష్ణదేవుడు.

న మే భక్తః ప్రణశ్యతి–భగవానుని ప్రతిజ్ఞ అది.ఆ అఘాసురుడు కృష్ణుని కోసమే ఎదురుచూస్తున్నాడు. ఎప్పుడైతే స్వామి



ప్రవేశించాడో–అపుడే చటుక్కున నోరు మూసేసాడు వాడు.

అఘాసురుని జఠరాగ్నికి గోపాలురూ లేగదూడలూ ఆహుతై పోవడాన్ని చూసిన వెంటనే బాలకృష్ణుడు ఆ పాము కంఠద్వారాన్ని చేరుకుని తన శరీరాన్ని పెంచినాడు. ఊపిరాడ లేదు. గిలగిల్లాడు. ఇంకేంవుంది. కనుగుడ్లు బాగా తేలిపోతున్నాయి. నేలమీదపడి పొర్లాడినాడు. చివరికి అఘాసురుని పంచప్రాణాలు అనంతవాయువులో కలిసిపోయాయి.

ఇంక గోపాలురునూ లేగలనూ తన కరుణామృతధారలతో బతికించాడు స్వామి. ఆ రాక్షసుని శరీరం నుంచి ఒక దివ్యాద్భుతజ్యోతి కృష్ణభగవానునిలో లీనమైంది.

అఘాసురునిలోనుంచి వెలువడిన జ్యోతి కృష్ణునిలో ఐక్యమైనది. అంతటి అదృష్టానికి బకాసురుడు నోచుకోలేదు. అదే కృష్ణ లీలావిలాసం.

మనం పాపాలను చేస్తూ తలనీలాలను– మొక్కుబడులను సమర్పించడం–మరలా సరికొత్త రకాలైన పాపాల్ని చేస్తూ చేస్తూనే– సంసారజంజాటంలోపడి ఊగిసలాడిపోతున్నాం. మరి ఇదేనా మనకున్న గమ్యం. మనకు రెండు రకాలైనట్టి జన్మలు వున్నాయి. ఇక తల్లి గర్భంనుంచి బయటపడడం అనేది మొట్టమొదటిది. అపుడు దానికి ప్రకృతియే కరుణిస్తుంది. రెండో దానికి భగవదనుగ్రహం వుండి తీరాలి.

బాగా ఆలోచిస్తే ప్రహ్లాదుడు తండ్రిని వదిలేసాడు. భరతుడు తల్లిని ఇంకా రాజ్యాన్ని వదిలేసాడు. బలిచక్రవర్తి గురువును వదిలేసాడు. సిద్ధార్థుడు భార్యని రాజ్యాన్ని వదిలేసాడు. ఇకపోతే మీరాబాయి భర్తను వదిలేసింది. సంసారకూపంలోపడి– మునగానాం తేలానాంగా వున్నాం కదా మనం. భూమ్యాకర్షణ కంటే విషయాకర్షణ గొప్పదైంది.

అఘాసురుని హతమార్చినపుడు కృష్ణుని వయసు 16 ఏళ్లు. ఆ రాక్షసుని చంపిన తరువాత గోపబాలురు ఆకలవుతుందంటే– కాళిందినదీ ఇసుక తిన్నెలపై– కూర్చుని తమ తమ చల్దిమూటలని విప్పినారు. ఒక మండలాకారంగా కూర్చోగా–గోపార్భకుల మధ్యలో పద్మకర్ణిక లాగ బాలకృష్ణుడు కూర్చున్నాడు. ఆ గొప్ప సన్నివేశాన్ని ధ్యాననిష్ఠలో దర్శించిన శుకమహర్షి తన్మయుడైపోయాడు.

చిన్ని కృష్ణుడు ఎలా వున్నాడు అంటే– నడుము చుట్టూ దట్టీ బిగించి–దానిలో వేణువును దూర్చినాడు. కొమ్ముబూర చేతికర్ర జారిపోకుండా ఎడమచంకలో ఇరికించినాడు. మీగడ పెరుగు కలిపిన చల్దిముద్ద ఎడమచేత పట్టుకున్నాడు.మళ్లీ మళ్లీ కొసరుతూ తెచ్చుకున్న ఊరగాయ ముక్కలను కుడిచేతి వేళ్లసందుల్లో వుంచి–నవ్వుస్తూ– సర్వ యజ్ఞఫలాన్ని భుజించే శ్రీహరిలాగా ఆరగిస్తుంటే– ఆ బాల్యక్రీడను వీక్షిస్తూ ఆశ్చర్యపోయారు దేవతలు.

(సశేషం)

# పంచ కృష్ణారణ్య క్షేత్రాలు

- శ్రీమతి వెలమకన్ని పద్మావతి

ఈ క్రింద పేర్కొన్న అయిదు దివ్య దేశాలను పంచ కృష్ణారణ్య క్షేత్రాలు అంటారు.

1.తిరుక్కణ్ణపురం – 18వ దివ్యదేశం
2.తిరుక్కణ్ణం గుడి – 26వ దివ్యదేశం
3.తిరుక్కణ్ణ మంగై – 27వ దివ్యదేశం
4.కపిస్థలం – 28వ దివ్యదేశం
5.తిరుక్కోవలూర్ – 73వ దివ్యదేశం



## 1.తిరుక్కణ్ణపురం :

ఇది 18వ దివ్యదేశం. కణ్ణపుర నాయకితో కొలువై ఉన్న ఈ స్వామి పేరు శేరి రాజప్పెరుమాళ్. విభీషణుడి ప్రార్థనతో అతని కోసమే ప్రతి అమావాస్యనాడు పరమపద నాథుడిగాదర్శనమిస్తూ ఉంటాడు. తిరుమంగై యాళ్వారుకు ఈ క్షేత్రం లోనే అష్టాక్షరీ సిద్ధి కలిగింది. నమ్మాళ్వార్లకి కర్మబంధం తొలగిస్తానని భగవంతుడు భరోసా ఇచ్చిన క్షేత్రం కూడా ఇదే. శ్రీరంగాన్ని మేలైవీడు (అంటే పైన ఉన్న గృహం) అనీ, కుంభకోణాన్ని నడువీడు (అంటే మధ్య గృహం) అనీ ఈ తిరుక్కణ్ణ పురాన్ని కీళైవీడు (అంటే క్రింద భాగంలో ఉన్న నివాసం) అని గౌరవిస్తూ ఉంటారు.

ఇక్కడి స్వామికి 5 : 5 : 3 నిష్పత్తిలో బియ్యం, నెయ్యి, పెసరపప్పు వాడి పొంగలి చేయిస్తే మనపై వేసిన ఆరోపణలు తొలగిస్తాడని ప్రతీతి.



## 2.తిరుక్కణ్ణం గుడి :

ఇది 26వ దివ్యక్షేత్రం. ఇక్కడ స్వామిని శ్యామల మేని పెరుమాళ్ గా లోకనాథ పెరుమాళ్ గా పిలుస్తారు. అమ్మవారు అరవిందనాయకి. శ్రీరాముడి గురువుగారైన వసిష్ఠుడు భగవదవతారాలన్నీ తెలిసిన మహనీయుడు. ఆయన రోజూ వెన్నతో కృష్ణుని రూపం చేసి ఆరాధించేవాడు. ఆయన ఆధ్యాత్మిక శక్తి ప్రభావం వలన వెన్న కరిగేది కాదు. ఒకరోజు పూజ చేస్తూ కనులు మూసుకున్నాడు. ఇంతలో ఒక బాలుడు దాన్ని తీసుకుని పారిపోయాడు. కళ్ళు తెరిచి ఆ బాలుడిని పట్టుకోవడానికి బయట వనం లోకి పరిగెత్తాడు. అది చూసి అక్కడి ఋషులు ఆ బాలుడిని పట్టుకొని పక్కనే ఉన్న పొగడచెట్టుకి కట్టేశారు. అలా కట్టిన ప్రాంతమే ''కణ్ణన్ గుడి'' అయింది. అందరూ ఆ బాలుడిని పరతత్వమైన కృష్ణునిగా గుర్తించి అదే రూపంలో అర్చావతారమూర్తిగా దర్శనమిస్తూ ఉండమని ప్రార్థించారు. ఇక్కడ అంజలి ముద్రతో కొలువై ఉన్న గరుత్మంతుడు భక్తుల మొక్కులనెన్నిటినో తీరుస్తూ ఉంటాడు.

## 3.తిరుక్కణ్ణ మంగై :

ఇది 27వ దివ్యదేశం. ఈ క్షేత్రాన్ని కృష్ణ మంగళ క్షేత్రం అని కూడా పిలుస్తారు. ఇక్కడి స్వామిని ''పత్తర్ ఆవి పెరుమాళ్'' అంటారు. ఇక్కడి అమ్మవారి పేరు తిరుక్కణ మంగై నాయకి, అభిషేక వల్లి తాయార్.


చతుర్ముఖ బ్రహ్మ వేదాలు కోల్పోయి నారాయణుని ప్రార్థిస్తే మధు కైటభులను సంహరించి వేదాలను తిరిగి ప్రసాదిస్తాడు నారాయణుడు. కృతజ్ఞతతో బ్రహ్మ నాలుగు వేదాలను నాలుగు



స్తంభాలుగా మలచి, ఈ ఆలయ మండపాన్ని నిర్మించాడు. ఇందులోనే స్వామికి అభిషేకవల్లితో మంగళ స్నానాలు చేయించి కళ్యాణ మహోత్సవం జరిపారట దేవతలంతా. అందుకే ఈ క్షేత్రానికి కృష్ణమంగళ క్షేత్రమనే ప్రసిద్ధి ఏర్పడింది. ఈ దేవతలంతా ఈ స్వామి చుట్టూ ఇప్పటికీ తేనెటీగలుగా తిరుగుతూ చతుర్ముఖునికే కాకుండా రోమశుడు వంటి ఎందరో మహర్షులకీ భక్తులకీ దర్శనమిస్తూ ఉంటారట. వారి ప్రాణాలను నిలబెట్టిన భక్తవత్సలుడు కనుక ఈయన్ని "పత్తర్ ఆవి పెరుమాళ్" అంటారు. నాథమునుల శిష్యులలో ఒకరైన తిరుక్కణ్ణ మంగైయాండాన్ శరీరాన్ని త్యాగం చేసి భగవత్పాదాలలో చేరిన దివ్యక్షేత్రం ఇది.

## 4.కపిస్థలం :

ఇది 28వ దివ్యదేశం. ఈ స్వామి గజేంద్ర వరదుడు. అమ్మవారు రమా మణి వల్లీ తాయార్. హనుమ తపస్సు చేసి శ్రీరాముడి అనుగ్రహం పొందిన ప్రాంతం కావడం వల్ల కపిస్థలంగా పేరు గాంచింది.



ఇంద్రద్యుమ్నుడనే రాజు అగస్త్యుని కోపానికి బలియై గజేంద్రుడయ్యాడు. హాహా హూహూ అనే గంధర్వుడు కూడా శాపవశాన మొసలిగా జన్మించాడు. ఇద్దర్నీ శాపం నుంచి విముక్తులను చేయడానికి శ్రీహరిగా అవతరించి విష్ణుమూర్తి మొసలికి మోక్షమిచ్చాడు. గజేంద్రుని రక్షించాడు. ఈ లోకంలోనే ఉండి తనలాంటి వారిని రక్షించమని గజేంద్రుడు ప్రార్థిస్తే ఈ స్వామి ఇక్కడ వెలశాడు. అందుకే గజేంద్ర వరదుడిగా పిలవబడుతున్నాడు. ఈ స్వామి మంచి కవితాశక్తిని ప్రసాదించే స్వామి.

## 5.తిరుక్కోవలూర్ :

పంచ కృష్ణారణ్య క్షేత్రాలలో తిరుక్కోవలూర్ అయిదవది. ఇది 73వ దివ్యదేశం. స్వామి దేహళీశ పెరుమాళ్ లేదా ఆయనార్. అమ్మవారు పుష్పవల్లి. కలియుగానికి ముందే భూతయోగి, సరోయోగి, మహాయోగి అనే ముగ్గురు ఆళ్వారులు ఈ క్షేత్రం లోనే ఆలయం వెనుకే ఒక చిన్న గదిలో చేరారు. వారి మధ్య



పరివారంతో మహావిష్ణువు చేరాడు. ఇరుకైన గది. పైగా వాన కురిసే చీకటి రాత్రి వారా సమయంలో జ్ఞాన దీపాన్ని వెలిగించి విష్ణుతత్వాన్ని అనుభవించి ప్రేమగా పాడారు. నాలాయిర దివ్యప్రబంధ ఆవిర్భావానికి అది నాంది పలికింది. భృగు మహర్షి ద్వారా త్రివిక్రమ చరిత విన్న మృకండు మహర్షి, అలా చూడాలని వుందని స్వామిని కోరాడు. అందుకే స్వామి కుడికాలిని పైకి చాచి ఉంటాడు. ఈ క్షేత్రానికి క్షేత్రపాలిక దుర్గాదేవి. ఆమెకు బ్రహ్మోత్సవాలు ఏర్పాటు చేశారు రామానుజాచార్యులవారు. అప్పుడు ఆమెకు ఆడపడుచులా సారె పంపిస్తారు. దుర్గాదేవి ఉత్సవాలు పూర్తి అయ్యాక మాత్రమే స్వామికి బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఈ క్షేత్రానికి ఉత్తమర్ క్షేత్రం అని కూడా పిలుస్తారు.

ఇవీ పంచకృష్ణారణ్యాలుగా పిలువబడే అయిదు దివ్య దేశాల విశేషాలు.

# శ్రీకృష్ణ లీలలలోని వేదాంత అర్థాలు

– శ్రీమాన్ ఈ.ఏ.శింగరాచార్యస్వామి

భగవానుడు శ్రీకృష్ణుడుగా ద్వాపర యుగాంతంలో అవతరించిన సంగతి అందరికీ తెలిసినదే. ఆ స్వామి పుట్టిన క్షణం నుండి అవతారం చాలించే వరకు చేసిన లీలలు అన్నీ అమూల్యమైన, మనం అందరం గ్రహించవలసిన వేదాంత తత్త్వాలను ఆవిష్కరిస్తున్నాయి అని అభిజ్ఞులైన మన పూర్వాచార్యులు తెలియజేశారు. వాటిలో కొన్ని మాత్రం ఇక్కడ విజ్ఞాపన చేయబడుతున్నాయి.



## 1.పూతన మోక్షం :

కంసుడు పంపగా వ్రేపల్లెకు వచ్చిన పూతన విషాన్ని కలిపిన పాలను ఇచ్చి శ్రీకృష్ణుని సంహరించాలని ప్రయత్నించింది. ఆమె ఇచ్చిన విషమిశ్రితమైన పాలతో పాటు ఆమె ప్రాణాలను కూడా గ్రహించి, ఆ పూతనను శ్రీకృష్ణుడు వధించాడు. ఈ వృత్తాంతంలోని తత్త్వం ఏమి? పూతన అంటే అవిద్యయే. అవిద్య అనబడే అజ్ఞానం మన పూర్వకర్మల వల్ల ఏర్పడుతున్నది. మనకు సహజంగా ఉండే జ్ఞానాన్ని అంతటినీ ఆవరించి, జన్మబంధంలో మనం చిక్కుకునేటట్లు చేస్తున్నది. ఆమెకు కల రెండు వక్షోజాలు మనకు ఏర్పడే అహంకార మమకారాలే. ఈ రెండు మనకు చాలా తీయగా అనిపిస్తాయి. కానీ అవి విషం వంటివి. వీటినుండి మనం బయట పడాలంటే ఏమి దారి? అంటే, మనం శ్రీకృష్ణ పరమాత్మ యొక్క శ్రీచరణాలను ఆశ్రయించినట్లయితే అతడు పూతనకు గల రెండు వక్షోజాల పాలతో పాటు ఆమె ప్రాణాలను కూడా పీల్చి, ఆమెను వధించినట్లుగా మన అహంకార మమకారాలను పూర్తిగా పీలుస్తాడు. పూతనను వధించినట్లుగా మన అవిద్యను లేకుండా చేస్తాడు.

## 2. శకటాసుర వధ :

కంసునిచే పంపబడిన శకటాసురుడు అనే అసురుడు బండి రూపంలో వచ్చి శ్రీకృష్ణునిపై పడి అతనిని వధించాలని ప్రయత్నం చేశాడు. కానీ "పొన్నచ్చగడ ముద్దైత్తాయ్" అని గోదాదేవి పలికినట్లుగా తన శ్రీచరణాలతో ఆ శకటాసురుని తాకి, సంహరించాడు శ్రీకృష్ణుడు.

ఈ వృత్తాంతంలో మనం గ్రహించవలసిన తత్త్వం ఏమి? శకటాసురుని రూపంలో ఉండేది మన జన్మ పరంపరయే. బండి గిరగిరా దొర్లుతూ వచ్చేటట్లుగా మన జన్మ పరంపర కూడా పరిభ్రమిస్తూ మన మీదకు వస్తుంది. "పునరపి జననం పునరపి మరణం" అని చెప్పినట్లుగా జన్మ మరణ చక్రం నిరంతరంగా కొనసాగుతుంది. శ్రీకృష్ణుని చరణాలను మనం ఆశ్రయిస్తే, శకటం భగ్నమైనట్లుగా, ఆ సంసారచక్రం భగ్నమై, జన్మ పరంపర లేకుండా పోతుంది – అనే సత్యం ఈ వృత్తాంతంలో వ్యక్తమవుతున్నది.

## 3. తృణావర్త సంహారం :

యశోదాదేవి శ్రీకృష్ణుని తన ఒడిలో పెట్టుకుని కూర్చుని ఉన్న సమయంలో, తటాలున ఒక సుడిగాలి రూపంలో ఒక అసురుడు వచ్చి శ్రీకృష్ణుని పైకి తీసుకొని పోయాడు. అతడే తృణావర్తుడు. ఇతడు కంసుని చేత పంపబడిన వాడు. అయితే శ్రీకృష్ణుడు క్రమక్రమంగా బరువు పెరగడం ప్రారంభించాడు. అతని బరువును మోయలేక ఆ అసురుడు భూమిపై పడి చనిపోయాడు.

ఈ వృత్తాంతంలో మనకు తెలుస్తున్న తత్త్వం ఏమి? అసురులలో సహజంగా ఉండే రజోగుణమే ఈ తృణావర్తుడు. ఈ రజోగుణం వల్ల అధికమైన కోపం, కామం కలుగుతాయి. రజోగుణ స్వరూపుడైన తృణావర్తుడు శ్రీకృష్ణుని పైకి వేగంగా తీసుకుని పోయినట్లే, రజోగుణం వల్ల ఏర్పడే కామం, క్రోధం అనేవి మనకు కల సద్గుణాలను, భక్తిని మన నుండి ఒక్కక్షణంలో అపహరించుకునిపోతాయి. శ్రీకృష్ణుని చరణాలను మనం ఆశ్రయించినట్లయితే, తృణావర్తుని అతడు వధించినట్లుగా, మనకు గల రజోగుణాన్ని ఆ భగవానుడు లేకుండా చేసి మన మనసులోని మంచి గుణాలు, భక్తి ప్రకాశించేటట్లు మనలను అనుగ్రహిస్తాడు.

## 4. నవనీత చౌర్య వృత్తాంతం :

వెన్న అనేది మన మనసును తెలుపుతుంది. వెన్నను కల కుండ ఆ మనసును కలిగిన శరీరాన్ని తెలుపుతుంది. మన శరీరం అనే కుండనుండి మనసు అనే వెన్నను శ్రీకృష్ణుడు అపహరించే అందాన్ని తిరుప్పాణ్ ఆళ్వారులు "కోవలనాయ్ వెణ్ణెయ్ ఉండ వాయన్ ఎన్నుళ్ళమ్ కవర్ న్దానై" "గోపాలుడై వెన్నను భుజించిన నోటిని కల స్వామి నా మనస్సును అపహరించాడు) అని కీర్తించారు. "ఆనాడు వ్రేపల్లెలో గోపికల ఇళ్ళలో వెన్నను దొంగిలించి భుజించిన స్వామి ఇప్పుడు శ్రీరంగనాథుడై శ్రీరంగంలో శయనించి ఉన్నాడు. అక్కడ వ్రేపల్లెలో బాన ఉన్నది. వెన్న మాత్రం కనపడలేదు. ఇక్కడ శ్రీరంగంలో నా శరీరం మాత్రం ఉన్నది. నా మనసు మాత్రం కనపడలేదు. ఎందుకంటే కుండనుండి వెన్నను శ్రీకృష్ణుడు అపహరించినట్లుగా నా శరీరం నుండి నా మనసును ఈ శ్రీరంగనాథుడు కొల్లగొట్టాడు" – అని ఈ పాశురంలో చాలా హృద్యంగా ఆళ్వారులు పలికారు.

వెన్నవలె తెల్లని పవిత్రమైన భక్తుల మనసులను అపహరించి గ్రహించే భక్తమానస చోరుడుగా శ్రీకృష్ణుడు ప్రకాశించడాన్ని ఈ లీల ద్వారా తెలియవచ్చు. అయితే వెన్న కాని, మన శరీరం కాని, మనసు కాని, ప్రాణం కాని ఇవి అన్నీ అతని సొత్తే కదా. తన సొత్తును తాను గ్రహించడాన్ని ఎందుకు దొంగతనం అని చెప్పాలి? అని అంటే శ్రీకృష్ణుడు వెన్నను దొంగిలించడం వల్ల గాని, మన మనసులను ఆత్మలను దొంగిలించడం వల్ల గాని అతనిని దొంగ అని మనం అనడం లేదు. మరి దేనిని ఆ శ్రీకృష్ణుడు దొంగిలిస్తున్నాడు? అని అంటే, వాదిరాజు అనే భక్తుడు ఒక శ్లోకంలో ఈ క్రింది విధంగా సమాధానం చెప్పారు.

**"స్వభక్తబృందార్జిత పాపబృందం**
**దివానిశం చాహరతి స్మ బాలః"**

శ్రీకృష్ణుడు వెన్నను పాలను దొంగిలించిన వృత్తాంతాన్ని ఎవరు ఆలకిస్తున్నారో, వారి పాప సమూహాలను శ్రీకృష్ణుడు సదా అపహరిస్తున్నాడు. మనం చేసిన పాపాలు అన్ని మనం సంపాదించుకున్న సొత్తే గదా. మన సొత్తు అయిన పాపాలను అతడు దొంగిలించి లేకుండా చేయడం వల్ల అతడు చోరుడు అని చెప్పబడుతున్నాడు అని ఈ శ్లోకంలోని తాత్పర్యం.

## 5. రుక్మిణీ కళ్యాణమ్ :

భీష్మకుని పుత్రిక అయిన రుక్మిణి శ్రీకృష్ణుని వివాహం చేసుకోవాలని కోరింది. అయితే ఆమెకు గల ఐదుగురు సహోదరులు రుక్మి, రుక్మరదుడు, రుక్మకేశుడు, రుక్మబాహువు, రుక్మమాలి అనే ఐదుగురు ఆమెను శిశుపాలునకు ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయించారు. అప్పుడు రుక్మిణి ఒక బ్రాహ్మణుని ద్వారా శ్రీకృష్ణుని దగ్గరకు తనను పరిగ్రహించి వివాహమాడవలసినదిగా ప్రార్థిస్తూ ఒక లేఖను పంపుతూ, దానిని ద్వారకలో ఉండే శ్రీకృష్ణునకు ఇవ్వమని కోరింది. ఆ బ్రాహ్మణుడు కూడా రుక్మిణి ఇచ్చిన లేఖను తీసుకొని పోయి, శ్రీకృష్ణుని దగ్గరకు ఇచ్చాడు. ఆ లేఖ ద్వారా శ్రీకృష్ణుడు రుక్మిణి అభిప్రాయాన్ని తెలుసుకొని వచ్చి, ఆమె సహోదరులను ఓడించి, రుక్మిణిని వివాహం చేసుకున్నాడు.

ఈ వృత్తాంతంలో గ్రహించవలసిన పరమార్థం ఏమిటంటే, రుక్మిణి అంటే జీవాత్మయే. శ్రీకృష్ణుడు పరమాత్మ. శిశుపాలుడు ఈ లోకంలోని జీవనం. జీవాత్మకు తోడబుట్టినవారు ఐదుగురు ఉన్నారు. వారు కన్ను, ముక్కు, చెవి, నాలుక, చర్మం అనే ఐదు ఇంద్రియాలు. రుక్మిణి అనే జీవాత్మ భగవంతుని చేరాలని కోరినప్పటికీ ఆ జీవాత్మకు తోడబుట్టినటువంటివారైన ఐదు ఇంద్రియాలు శిశుపాలుడు అనే లౌకిక జీవితంలో జీవాత్మను బలవంతంగా లాగుతారు. అప్పుడు రుక్మిణి కోసం ఒక బ్రాహ్మణుడు శ్రీకృష్ణుని దగ్గరకు దూతగా వెళ్ళినట్లుగానే జీవాత్మ కోసం గురువు భగవంతుని దగ్గరకు దూతగా వెళ్ళి, భగవంతుని అనుగ్రహాన్ని జీవాత్మ పొందేటట్లు చేస్తాడు. రుక్మిణి సహోదరులను శ్రీకృష్ణుడు జయించి ఆమెను వివాహం చేసుకున్నట్లే, ఈ ఇంద్రియాల ప్రభావాన్ని లేకుండా చేసి జీవాత్మను భగవంతుడు స్వీకరిస్తాడు. ఈవిధంగానే శ్రీకృష్ణ పరమాత్మ చేసిన ప్రతి లీలలోను ఎంతో వేదాంతార్థాలు ఇమిడి ఉంటాయి.

## 6. శ్రీకృష్ణుడు వ్రేపల్లెలో దెబ్బలు తినడం :

శ్రీకృష్ణుడు ఒకరోజు ఒక గోపిక ఇంటిలోకి వెళ్ళి, అక్కడ ఆమె

దాచి పెట్టిన పాలను దొంగతనంగా ఆరగించాడు. శ్రీకృష్ణుడు పాలను దొంగతనంగా తాగడానికి చూసిన ఆ ఇంటి గోపిక ఒక బెత్తంతో శ్రీకృష్ణుని కొట్టింది. అప్పుడు ఏమి జరిగిందో పిళ్ళైప్పెరుమాళ్ అయ్యంగార్ అనే తమిళ కవి ఒక పాశురంలో అద్భుతంగా వర్ణిస్తారు.

కరిచే చంద్రవంకవలె చాలా పదునైన కోరలను కలిగిన కాళీయుని తలలపై నర్తనమాడిన శ్రీరంగనాథుడు శ్రీకృష్ణావతారంలో వ్రేపల్లెలో సువాసనతో పరిమళించే పాలను దొంగతనం చేసినప్పుడు చూసిన గోపిక కోపాన్ని పొంది శ్రీకృష్ణుని కొట్టగా, అప్పుడు 14 లోకాలకు దెబ్బలు తగిలాయి.

ఆ గోపిక శ్రీకృష్ణుని నడుముపై బెత్తంతో దెబ్బలు కొట్టగానే శ్రీకృష్ణునికి దెబ్బలు తగలలేదు. బాధ కలగలేదు. కానీ పాతాళ లోకం నుండి సత్యలోకం వరకు ఉండే లోకాలలో చీమల దగ్గర నుండి బ్రహ్మ వరకు ఉండే అందరు జీవాత్మలకు ఆ దెబ్బలు తగిలాయట. శ్రీకృష్ణుని కొట్టిన ఆ గోపికకు కూడా ఆ దెబ్బలు తగిలాయట. ఈ విధంగా అందరికీ దెబ్బలు తగలడానికి కారణం ఏమి? ఇందులో ఉండే తత్త్వం ఏమి? లోకాలకు అన్నిటికీ భగవంతుడు అంతర్యామి. అందరూ ఆ పరమాత్మకు శరీరం అనే వేదాంత తత్త్వాన్ని ఇక్కడ శ్రీకృష్ణ భగవానుడు వ్యక్తం చేశాడు.

'యస్య పృథివీ శరీరం, యస్య ఆత్మా శరీరమ్'' అని అంటూ చేతనా చేతనాలు అన్నీ భగవంతునకు శరీరం అనే విషయాన్ని బృహదారణ్యకోపనిషత్తు తెలుపుతున్నది. ''జగత్ సర్వం శరీరం తే'' అని రామాయణం తెలుపుతున్నది. ''తాని సర్వాణి తద్వపుః'' అని విష్ణుపురాణం అంటున్నది. ''సోఽభిధ్యాయ శరీరాత్ స్వాత్'' అని మనుస్మృతి పలుకుతున్నది. వేదాలను ద్రావిడీకరించిన నమ్మాళ్వార్లు కూడా తిరువాయ్ మొళి ప్రబంధంలో ''ఉడన్ మిశై ఉయిరెన కరందెంగుమ్ పరందుళన్'' అని అన్నారు. జగత్తుకు, పరమాత్మకు మధ్య ఉండే శరీర శరీరి భావం అనేది ఈ లీల ద్వారా చాలా సులభంగా తెలుసుకునేటట్లుగా శ్రీకృష్ణుడు ప్రదర్శించాడు.

## 7. రోటికి బంధింపబడిన కథ :

వ్రేపల్లెలో వెన్నను, పాలను, పెరుగును దొంగిలించే శ్రీకృష్ణుని చూచి యశోద కోపించి, అతనిని రోటికి కట్టి వేసింది. ఆమె కట్టిన కట్టుకు శ్రీకృష్ణుడు కట్టుబడ్డాడు. దుర్యోధనుడు మొదలైనవారు శ్రీకృష్ణుని బంధించాలని ప్రయత్నించినప్పుడు శ్రీకృష్ణుడు విశ్వరూపాన్ని ప్రదర్శించి అందరినీ జయించాడు. అటువంటి శ్రీకృష్ణుడు ఒక అబల గోపిక చేతిలో కట్టుబడటానికి ఏమి కారణం? అని అంటే తనను ప్రేమించే, అభిమానించే భక్తుల విషయంలో ఉండే ప్రేమయే కారణం. ఎవరి శౌర్య పరాక్రమాలకు, శక్తికి భగవంతుడు లొంగడు. భక్తుడు చూపించే ప్రేమకు మాత్రం సులభంగా లొంగిపోతాడు – అనే తత్త్వం ఇక్కడ ఆవిష్కరింపబడింది. దీనిని నమ్మాళ్వారులు కూడా ''పత్తుడై అడియవర్ క్కు ఎళియవన్ పిఱర్ కళుక్కు అఱియ విత్తకన్ మలర్ మకళ్ విరుంబుమ్ నమరుమ్ పెఱలడికళ్, మత్తఱు కడై వెణ్ణెయ్ కళవినిల్ ఉరవిడై యాప్పుండు ఎత్తిఱ మురలినోడు ఇణైం దిరుందు ఏంగియ వెళివే'' (భగవంతుడు భక్తిని కలిగినవారికి సులభుడు ఇతరులకు దుర్లభుడు, లక్ష్మీనాథుడై, పరాత్పరుడై ఉండే ఆ పరమాత్మ ఒక గోపిక రోటికి కట్టిన కట్టుకు కట్టుబడి, ఆ కట్టునుండి విడిపించుకోలేక వెక్కి వెక్కి ఏడ్చిన సౌలభ్య ప్రకారం, ఆహా! ఎంత గొప్పది) అని ఈ వృత్తాంతంలో భగవంతుడు ప్రదర్శించిన సౌలభ్య గుణాన్ని అనుభవించి, నమ్మాళ్వారులు ఆరు నెలల కాలం మూర్ఛపోయారట.

## 8. మద్దిచెట్ల జంటను కూల్చడం :

యశోదా దేవి శ్రీకృష్ణుని రోటికి కట్టి వేసింది. అప్పుడు శ్రీకృష్ణుడు ఆ రోటిని లాగుకుంటూ పాకుతూ వెళ్ళడం ఆరంభించాడు. దారి మధ్యలో రెండు మద్ది చెట్లు అడ్డు వచ్చాయి. ఆ రెండు మద్ది చెట్ల మధ్య నుండి శ్రీకృష్ణుడు దోగాడుతూ వెళ్ళాడు. శ్రీకృష్ణుడు వెళ్ళగలిగాడు కానీ, అతని నడుముకు కట్టిన రోలు అడ్డుపడింది. అప్పుడు శ్రీకృష్ణుడు రోటిని బలంగా ముందుకు లాగాడు. ఆ రెండు మద్దిచెట్లు విరిగి కింద పడ్డాయి. ఆ రెండు మద్దిచెట్ల రూపంలో ఉన్నవారు కుబేరుని కుమారులైన నలకూబరుడు, మణిగ్రీవుడు అనేవారు. వారు శాపవశం చేత ఈ విధంగా మద్దిచెట్ల రూపాన్ని పొందారు. శ్రీకృష్ణుని పాదస్పర్శను పొంది ఆ శాపం నుండి విముక్తిని పొంది, నిజస్వరూపాన్ని పొందగలిగారు. కృష్ణుని స్తుతించి వారు దేవలోకానికి వెళ్ళిపోయారు.

ఈ వృత్తాంతం ద్వారా ఏ తత్త్వం వ్యక్తమవుతున్నది? అని అంటే ఈ రెండు మద్దిచెట్లు మనకు కల కామం, క్రోధం అనే రెండు దోషాలు. ఇవి ఆ మద్ది చెట్ల వలె మన మనసులో చాలా బలంగా నాటుకుని పోయి చాలా ఉన్నతంగా పెరిగిపోతాయి. మనం వాటిని పోగొట్టుకోవాలని ఎంతగా ప్రయత్నించినప్పటికీ అది సాధ్యం కాదు. భగవంతుడు మన మనసులో ఉండే ఆ కామం, క్రోధం అనే రెండు మద్దిచెట్ల మధ్యలోకి వచ్చి ప్రవేశించినట్లయితే అంటే రెండు మహావృక్షాలుగా మన మనస్సుల్లో పెరిగి ఉండే కామ క్రోధాల మధ్యకు వచ్చినట్లయితే అవి ఆ రెండు మద్దిచెట్లు విరిగి నశించినట్లు నశిస్తాయి. ఇందులో ఏ సందేహం లేదు – అనే విషయం ఇక్కడ తెలియజేయబడింది.

## 9. సప్తవృషభ భంజనమ్ :

శ్రీకృష్ణుని మేనమామ కుంభుడు. అతని పుత్రిక నీళాదేవి. ఈమెకు ద్రావిడ భాషలో నప్పిన్నై అని పేరు. ఈమె నీళాదేవి అవతార విశేషంగా భావింపబడుతున్నది. తన దగ్గర



ఉన్న ఏడు పొగరుటెద్దులను ఎవరు స్వాధీనం చేసుకుని నియంత్రించగలుగుతారో వారికే తన కుమార్తెను ఇచ్చి వివాహం చేస్తానని కుంభుడు ప్రకటించాడు. అప్పుడు శ్రీకృష్ణుడు ఒక్కడే వెళ్ళి ఆ ఏడు ఎద్దులను అణచి నీళాదేవిని వివాహం చేసుకున్నాడు.

ఈ వృత్తాంతంలో ఏ తత్త్వం వ్యక్తమవుతున్నది? అంటే, నీళాదేవి జీవాత్మ. శ్రీకృష్ణుడు పరమాత్మ. జీవాత్మకు కల ఐదు ఇంద్రియాలు, మనస్సు, శరీరం అనే ఏడు పొగరుటెద్దులు. ఇవి జీవాత్మను భగవంతుని చేరనీయకుండా అడ్డుపడతాయి. పరమాత్మ అయిన శ్రీకృష్ణుడు ఈ ఏడు పొగరుటెద్దులను అణచి, జీవాత్మను తనను పొందేటట్లు అనుగ్రహిస్తాడు – అనే అర్థమే ఈ చరిత్రలో తెలుస్తున్నది.

## 10. కాళియ మర్దనమ్ :

కాళియుడు అనే విషసర్పం మన మనసును తెలుపుతుంది. ఎందుకంటే, పాము ఏ విధంగా వంకర టింకరగా సంచరిస్తుందో, ఆవిధంగానే. మన మనసు కూడా ఋజువుగా వెళ్ళదు. వక్రంగానే సంచరిస్తుంది. మనం ఎంత ప్రయత్నించినప్పటికీ అది మన స్వాధీనంలో ఉండదు. ఋజువుగా వర్తించదు. కాళియుడు విషాన్ని కక్కి కాళిందీ నదిలోని జలాన్ని అంతటినీ ఎవరికీ పనికిరాకుండా పాడు చేశాడు. ఆ విధంగానే మన మనసు అనేది చెడ్డ ఆలోచనలనే విషాన్ని కక్కి మనలను పాడు చేయటమే కాకుండా ఇతరులకు కూడా హాని కలిగిస్తుంది.

ఇటువంటి కాళియుని వంటి సర్పాన్ని ఏ విధంగా స్వాధీనం చేసుకోవడం? శ్రీకృష్ణుని మనం మన మనసులో నిలుపుకొని భావించినట్లైతే ఆ స్వామి, కాళీయుని తలలపై ఎక్కి నాట్యం ఆడినట్లే, మన మనసు అనే కాళియుని తలలపై నాట్యమాడి దాన్ని మన వశం అయ్యేటట్లు చేస్తాడు.

## 11. గోవర్ధన పర్వతాన్ని ఎత్తడం :

వ్రేపల్లెలో ఉండే గోపాలురు అందరూ ప్రతి సంవత్సరం ఇంద్రునికి పూజ చేసి ఆరాధించడం అలవాటు. శ్రీకృష్ణుడు వారు చేసే ఇంద్ర పూజను అడ్డుకుని దానికి బదులుగా వ్రేపల్లెలో ఉండే అందరికీ జీవనాధారం అయిన గోవర్ధన పర్వతానికి ఆరాధన చేయమని చెప్పాడు. ఆవిధంగానే వారు ఇంద్రుని పూజించడం మానివేసి గోవర్ధన పర్వతానికి పూజ చేశాడు. అప్పుడు ఇంద్రునికి కోపం వచ్చి వ్రేపల్లెపై వడగళ్ళ వానను కురిపించాడు. శ్రీకృష్ణుడు గోవర్ధన పర్వతాన్ని తన చిటికెల వేలితో పైకెత్తి గొడుగుగా పట్టుకొని వ్రేపల్లెలో ఉండే గో గోపీ గోప జనాలను అందరినీ కాపాడాడు. వడగళ్ళ వాన నుండి రక్షించాడు.

ఈ వృత్తాంతంలో ఏ తత్త్వం మనకు వ్యక్తమవుతున్నది? ఈ లౌకికమైన జీవితంలో ఆధ్యాత్మికం, ఆధిభౌతికం, ఆధిదైవికం అనే మూడు విధాలైన తాపాలు మనకు కలుగుతాయి. అవే వడగళ్ళ వర్షం వంటివి. మన శరీరం వల్ల మనకు ఏర్పడే ఆపదలు ఆధ్యాత్మికం అని పేరు. దైవాల వల్ల ఏర్పడే ఆపదలు ఆధిదైవికం అని పేరు. పాములు, పులులు మొదలైన ఇతర ప్రాణుల వల్ల ఏర్పడే ఆపదలకు ఆధిభౌతికం అని పేరు. వడగళ్ళ వానం వంటి ఈ మూడు విధాలైన బాధల నుండి మనకు విముక్తి ఏవిధంగా కలుగుతుంది? ఆనాడు వ్రేపల్లెలో ఉండే అందరూ శ్రీకృష్ణుని శరణు పొందినట్లే, మనం కూడా శ్రీకృష్ణుని శరణు పొందినట్లయితే పర్వతం వలె ఉన్నతంగా ఉండే తన కళ్యాణ గుణాలనే గొడుగుగా పట్టుకుని, వడగళ్ళ వాన వంటి మనకు ఏర్పడే ఆధ్యాత్మిక ఆధిభౌతిక ఆధిదైవికాలైన తాపాలను అన్నిటినుండి రక్షిస్తాడు అనే తత్త్వమే ఇక్కడ ఆవిష్కృతమైనది.

## 12. రాసలీల :

శరత్కాలంలో సాయంకాలం వేళ చంద్రోదయం అయిన తరువాత ఒక సంపెంగ చెట్టు సమీపంలో శ్రీకృష్ణుడు వేణుగానాన్ని చాలా మధురంగా చేశాడు. ఆ మధుర ధ్వని విన్న వ్రేపల్లెలోని గోపికలు అందరూ పరుగు పరుగున వచ్చి శ్రీకృష్ణుని చేరారు. ఆ రాత్రివేళ శ్రీకృష్ణుడు ఆ గోపికలతో కలిసి బృందావనంలో రాసక్రీడ అని చెప్పబడే ఒక అద్భుతమైన లీలను చేశాడు. గోపికలందరూ మైమరచిపోయి శ్రీకృష్ణునితో పాటు ఆ క్రీడను ఆడి, బ్రహ్మానందాన్ని పొందారు.

ఈ లీలలోని తత్త్వం ఏమి? జీవాత్మకు, పరమాత్మకు మధ్య నవవిధ సంబంధాలు ఉన్నాయి. వీనిని మనకు అష్టాక్షరి మహామంత్రం తెలుపుతున్నదని మన పూర్వాచార్యులు వివరించారు. అవి పితాపుత్ర భావం, రక్ష్య రక్షక భావం, శేష శేషి భావం, భర్తృభార్యాభావం, జ్ఞాతృజ్ఞేయ భావం, స్వ స్వామిభావం, ఆధార ఆధేయ భావం, ఆత్మ ఆత్మీయ భావం, భోగ్య భోక్తృభావం అనేవి. ఈవిధంగా ఉండే తొమ్మిది విధాలైన సంబంధాలలో అతి ముఖ్యమైన భర్త్ర భార్యా భావాన్ని శ్రీకృష్ణ భగవానుడు రాసలీల ద్వారా వ్యక్తం చేశాడు.

ఈవిధంగా తాను చేసిన ప్రతి లీలలోను శ్రీకృష్ణుడు వేదాంత తత్త్వాలను వ్యక్తం చేశాడు. ఉదాహరణ కోసం కేవలం కొన్ని లీలలను మాత్రం ఇక్కడ ప్రస్తావించడం జరిగింది.

# త్యాగయ్య జీవితము



త్యాగరాజు వారు జీవితంలో ఎన్నడూ ఉద్యోగం చేయలేదు. ఒకరి దగ్గరకు వెళ్ళి చేయి చాపలేదు. తెల్లవారి లేస్తే సంధ్యావందనం చేసుకోవడం, కావేరీ నది ఒడ్డుకు వెళ్ళడం, అక్కడి నుంచి వచ్చి భాగవత, రామాయణాలు, భగవద్గీతలు చదువుకోవడం, మధ్యాహ్నమైన తరువాత కీర్తనలు చేసుకుంటూ ఉంఛవృత్తి చేసుకోవడం. అంటే తన వద్ద ఇంట్లో ఎంతమంది శిష్యులు సంగీతం నేర్చుకోవడానికి వచ్చారో వారి ఉదర పోషణకు సరిపడా పదార్థాల్ని సేకరించడానికి ఎన్ని ఇళ్ళముందుకు వెళ్ళి చేయి చాపవలసి వస్తే అన్ని ఇళ్ళ వద్దకు వెళ్ళి కీర్తనలు చేయడం, పెట్టిన వారూ ఒకటే, పెట్టనివారూ ఒకటే. పదర్థాలు సరిపడా సమకూరాయని అనిపించగానే తిరిగి వచ్చి భార్య కమల (పెద్ద భార్య పార్వతి శరీరం విడిచి పెట్టిన తరువాత తల్లి బలవంతం మీద ఆమె చెల్లెలు కమలను చేసుకున్నారు. వారికి ఒకే సంతానం. సీతామహాలక్ష్మి) వాటిని వండి సిద్ధం చేసేది. దానిని త్యాగరాజు గారు రామచంద్రమూర్తికి నివేదించి తాను, తన కుటుంబం, శిష్యులు స్వీకరించేవారు.

చెట్టును ఆశ్రయిస్తే గోత్ర నామాలు అడగకుండా నీడ ఎలా ఇస్తుందో అలా ఆయన పాదాలను ఆశ్రయించిన ప్రతి వారికి సంగీత విద్యను నేర్పేవారు. అలా జీవించిన త్యాగరాజు వారికి ఏం లోటు. ఎందరో మహారాజులు ఎలాగైనా వారిని తమ సన్నిధానానికి తెచ్చుకోవడానికి విశ్వప్రయత్నాలు చేశారు. తంజావూరు మహారాజు అయితే మారువేషంలో వచ్చి ఆయన కీర్తనలు విని ఆనందిస్తుండేవారు. ఒకరోజు ఆయన జోలెపట్టి వెడుతుంటే దానిలో బంగారు కాసులు వేశారు ఏం చేస్తారో చూద్దామని. బంగారు కాసుల పడడం చేత ఈవేళ ఈ ఆహారం తినడానికి అయోగ్యమయిందని త్యాగరాజు దానిని మొత్తం తీసుకెళ్ళి చెత్తకుప్పలో వేశారు. నిధి చాల సుఖమా, రాముని సన్నిధి చాల సుఖమా అని కీర్తన చేశారు. ఈయన పక్కింట్లోనే అన్నగారు జపేశుడు ఉండేవారు. ఎంతసేపటికీ ఈ విగ్రహాలు పెట్టుకుని మహారాజులు బహుమతులు ఇచ్చినా పుచ్చుకోనంటున్నాడని కోపమొచ్చి ఆ విగ్రహాలు పోతే తప్ప తమ్ముడికి బంగారం మీద మమకారం కలగదని ఎవరూ చూడకుండా వాటిని తీసుకెళ్ళి కావేరీ నదిలో పారేశాడు.

వాటికోసం త్యాగయ్య రాత్రింబవళ్ళు పరితపించిపోయి నిన్ను ఎందని వెదకను హరీ... అని కీర్తన చేశారు.

తన ఇష్టదైవం కలలో కనపడి కావేరీ నది దగ్గరికి రమ్మనమని ఆదేశిస్తే అక్కడ నదిలో తేలియాడుతూ వచ్చాయి విగ్రహాలు. వంద రెండొందల సంవత్సరాల క్రితం నాటివి ఈ జరిగిన సంఘటనలు. పరమేశ్వరుడు ఉన్నాడనటానికి ప్రత్యక్ష నిదర్శనాలు వీరి జీవితాలు. మనమైతే ఇంట్లో విగ్రహాన్ని పెట్టి పూజచేస్తే కేవలం విగ్రహంగానే చూస్తాం. దీపం వెలిగించేటప్పుడు పొరపాటున చెయ్యి తగిలి కిందపడ్డా తిరిగి నిలబెట్టి పూజ చేసుకుని వస్తాం. త్యాగరాజు వారు అలా కాదు. ఆ విగ్రహాలు కావేరీ నది మీద తేలుతూ వస్తే సుకుమార రఘువీర రారా మా ఇంటికి అని ఆర్తితో కీర్తనను ఆలపిస్తూ తీసుకెళ్ళారు. త్యాగరాజు వారి కుమార్తె వివాహం జరుగుతుంటే దక్షిణ భారత దేశం నుండి ఒక స్నేహితుడు ఆయనకు రామచంద్రమూర్తి విగ్రహాలను తెచ్చి బహూకరించాడు. అది చూసి కన్నీటి పర్యంతమైన త్యాగయ్య నాకోసం అంత దూరం నుంచి నడిచి వచ్చావా స్వామీ. నీ కాళ్ళెంత సొక్కిపోయాయో అంటూ నను పాలింపగ నడిచి వచ్చితివా అని కీర్తన చేశారు.

భక్తి అంటే అది. త్యాగరాజు వారు, వారిలాంటి మహానుభావులు మనకు తెలిసినవారు, తెలియనివారు ఎంతమందో.

**ఆచార్య దివ్య తిరువడి గళే శరణమ్**

# మోక్షము నెట్లు పడయ తగును?

## జిజ్ఞాసువు – శ్రీమతి మాదంశ్రేష్ఠి రాధమ్మగారు, విజయవాడ.

ప్రశ్న – మోక్షమనెడు పురుషార్థ స్వరూపమెట్టిది?

"సమాధానము"

"శ్రీమన్నారాయణ"

వ్యాసమహర్షికి సర్వేశ్వరుని సంకల్పముచే యజ్ఞార్థమై అగ్ని మథనము చేయుచుండగా ఘృతాచి అనునొక అప్సరసా సందర్శనముచే అరణి యందు రేతస్థలన మాయెను. వ్యాసుడు దానిని మథించగా అందుండి పంచభూతముల ధిక్కరించు మహాయోగి యగు శ్రీ శుకుడు పుట్టెను. వ్యాసుడతనికి వేద-వేదాంగ-వేదాంత-ఇతిహాస-పురాణముల పఠింపచేసి మోక్ష పురుషార్థ స్వరూప జ్ఞానమునకై తన శిష్యుడగు జనకుని వద్దకు పంపెను.

జనకుడు చక్రవర్తి, గృహస్థుడు, ప్రవృత్తి మార్గములో నున్నవాడు. అయినను ఆయన మనస్సు నిష్కల్మషమై సదా శ్రీహరి యందే తగుల్కొని యుండెను. సరస్సున బుట్టి, దాని నాశ్రయించుకొనియుండి, దానివలననే పెరుగుచున్న తామరాకు ఆ నీటి సంబంధము లేనిదై యుండు నటులనే జనక చక్రవర్తి కూడా ప్రకృతిలో లీనుడై యున్నప్పటికినీ, నివృత్తిమార్గ నిష్ఠాగరిష్ఠుడై కేవల మోక్ష ధర్మానుష్ఠాన పరుడై యుండెను. మహామహులగు మహర్షులకు సహితము శక్యము గాని జ్ఞానానుష్ఠానములు జనకునియందు వెల్లుంగుచుండెను. కనుకనే వ్యాసమహర్షి సహితము తన ఏకైక పుత్రరత్నమును ఆయన కడకు పంపెను. జనకుడు శ్రీ శుకుని అనేకవిధముల పరీక్షించి చివరకిటుల నుపదేశించెను.

"మోక్షమార్గము ననుసరించుటకు శాస్త్ర జ్ఞానము, లౌకిక జ్ఞానము యుండవలయును. ఈ జ్ఞానము కేవలము గురూపదేశముచే మాత్రమే కలుగును. మరేవిధమునను కలుగజాలదు.

రాజస – తామస దోషముల వర్జింపవలెను. సాత్త్వికమార్గము ననుసరించి ఆత్మను దెలుసుకోవలెను. సర్వభూతముల యందు ఆత్మయున్నది, అన్ని ఆత్మల స్వరూపములు నొక్కటియే గాన సర్వభూతములయందు తన్నును, తనయందు సర్వభూతములను లెస్సగా కనుగొనుచు జలమందలి జంతువుల వలె, వానియందు తగులు లేకుండగ నుండవలయును. ప్రతి జీవియందును పరమాత్మ నివసించుచున్నాడు. పరమాత్మ లేని జీవి యనునిది లేనేలేదు. సమాహిత చిత్తము గల ప్రతివాడు పరమాత్మను దర్శింపగలడు. ఈ దర్శనమున గాని శాంతి కలుగదు. శాంతి లేనివానికి ముక్తి లేదు.

ఎవ్వని వలన పరులు భయపడరో, పరుల వలన నెవ్వడు భయపడడో, ఎవ్వడు నీ పక్కదానిని కోరకయు, ద్వేషింపకయు నుండునో అట్టివాడు పరమాత్మను తెలుసుకొనగలడు. మనస్సు చేతగాని, వాక్కు చేతగాని, కర్మము చేతగాని ఎపుడు సర్వభూతముల యందు పాపమగు భావన లేకుండునో యపుడు పరమాత్మను తెలుసుకొనగలడు.

మనస్సును మోహపెట్టినట్టి అసూయను విడిచి, కామమును మోహమును త్యజించినచో పరమాత్మను తెలుసుకొనగలడు. చెవికిని, గంటికిని మరియు తక్కిన ఇంద్రియములకును విషయములగు వానియందెల్లను, మరియు సర్వభూతములయందును సముడై ద్వంద్వముల నెపుడు వీడునో యపుడు పరమాత్మను తెలుసుకొనగలడు.

స్తుతిని–నిందను; బంగారమును – ఇనుమును; సుఖమును–దుఃఖమును; చలువను–వేడిని; అర్థమును–అనర్థమును; ప్రియమును–అప్రియమును, జీవితమును–మరణమును సమముగా నెపుడు భావించగలడో యపుడు పరమాత్మను తెలుసుకొనగలడు.

తాబేలు తన అవయవములను తనలోనికి ముడుచుకొనునటుల ఎవడు తన మనస్సును, ఇంద్రియములను విషయముల నుండి నుపసంహరించుకొనగలడో అట్టివాడు పరమాత్మను తెలుసుకొనగలడు.

చీకటి గ్రమ్మిన ఇంటిని దీపముచే స్పష్టముగా చూడగలిగినటుల బుద్ధియనెడి దీపముచే తన లోపల యాత్మను చూడ శక్యమగును.

ఇట్టివాడు తనయందలి పరమాత్మను తెలుసుకొని దానిని దర్శించి, సదా దానినే స్మరించుచుండవలెను. దీనిచే వీని హృదయమందలి గ్రంథులన్నియు ఛిన్నాభిన్నములగును. సర్వ సంశయములు పటాపంచలగును. సమస్త కర్మములు సమూలముగ నశించును. దివ్యజ్ఞానము కలుగును. అట్టి పరమాత్మను నిరంతరము ధ్యానించుము. ఆత్మ–ఆత్మీయుల నాతనికి సమర్పణము చేయవలెను. దీనిచే పరమాత్మ ప్రీతికై పాత్రుడై ఆయన యొక్క నిర్హేతుక జాయమాన కటాక్షమునకు పాత్రుడై శరీరావసనమున మోక్షమును పొందగలడు. ఏ యోగమవలంబించినను ఈ పైన తెలిపిన జ్ఞానానుష్ఠానములున్న గాని మోక్షప్రాప్తి లేదు. అన్ని యోగములు ఇట్టి స్థితికై మాత్రమే ఉపకరించును.

★ ★ ★



తిరుమలలో జూన్ 19 నుంచి 21 వరకు జ్యేష్ఠాభిషేకం

# సకల శ్రేయోదాయకం జ్యేష్ఠాభిషేకం

- డా. ఐ.ఎల్.ఎన్. చంద్రశేఖర రావు

**నిత్యకల్యాణం, పచ్చతోరణంగా విరాజిల్లే తిరుమల క్షేత్రంలో జరిగే అనేక సేవల్లో ఒకటి - జ్యేష్ఠాభిషేకం"!**

మన కళ్ళెదుట భూలోక వైకుంఠంగా విరాజిల్లుతూ వున్న క్షేత్రం - 'తిరుమల. ఈ క్షేత్రంలోని ఆనందనిలయంలో కొలువుదీరిన దేవదేవుడు - శ్రీ వేంకటేశ్వరస్వామి! స్థిరంగా నిలిచివున్న ధృవమూర్తి అయిన మూలవిరాట్టు ప్రతిబింబం - ఉత్సవమూర్తి అయిన..శ్రీమలయప్పస్వామి! మలయప్ప స్వామికే ఉత్సవ బేరం : సత్యబేరం.. అని పేర్లు! ఈ స్వామే మూలవిరాట్టు ప్రతినిధిగా వివిధ సేవలను, పూజలను అందుకుంటాడు.

ప్రతి సంవత్సరం జేష్ఠ మాసం లో జ్యేష్ఠా నక్షత్రానికి ముగిసేలా మూడు రోజుల పాటు జరిగే ఉత్సవమే – ‘‘జ్యేష్ఠాభిషేకం!!’’

**జ్యేష్ఠాభిషేకం ఎందుకు**

సంవత్సరం పొడవునా 365 రోజుల్లో 470కి పైగా ఉత్సవాలు తిరుమలలో జరుగుతాయి. వీటిల్లో అధిక సంఖ్యలో పాల్గొనే శ్రీమలయప్పస్వామి వారికి వివిధ సేవల్లో భాగంగా అభిషేకాలు, స్నపన తిరు మంజనాలు జరుగుతాయి. అందువల్ల అంగ (నేత్రాలు, ముక్కు, చెవులు వంటివి). మహాంగ (శిరస్సు, కంఠం, ఉదరం, బాహువులు, జంఘం వంటివి) ఉపాంగ (కేశములు, నఖములు వంటివి), ప్రత్యాంగ (శంఖు చక్రాలు, మకుటము, భూషణం, పీఠం వంటివి) ములు తరుగుదలకు, క్షీణతకు గురయ్యే అవకాశం వుంది. ఈ విధంగా జరగకుండా చూసేందుకు మూలవిరాట్టు ప్రతి బింబమైన ఉత్సవ మూర్తిని రక్షించే ప్రక్రియను భృగువు క్రియాధికారంలో వివరించారు. ఆ రక్షించే ప్రక్రియే " జ్యేష్ఠాభిషేకం '. దీనికే- 'సుగంధతైల సమర్పణోత్సవం', 'అభిదేయక అభిషేకం' అని పేర్లు. చంద్రుడు జ్యేష్ఠా నక్షత్రంతో కలసివున్నమాసంలో విష్ణువుకు విశేషమైన

సుగంధ తైల సమర్పణం చేయాలని భృగువు ప్రకీర్ణాధికారంలోని క్రియాధికారంలో వివరించాడు. ఈ ప్రక్రియ చేయడం వల్ల విష్ణుమూర్తి దివ్య తేజస్సుతో వెలుగొందుతాడు అని భృగువు పేర్కొన్నాడు. దీని ప్రకారం తిరుమలలో జ్యేష్ఠాభిషేకం 90వ దశకంలో ప్రారంభింపబడి ప్రతి సంవత్సరం నిర్వపింపబడుతూవుంది.

**నిజరూప దర్శనం**

మనకు నిత్యం వివిధ సేవలు ఉత్సవాలను జరిపించుకుంటూ దర్శనమిచ్చే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామివారు కవచాన్ని ధరించి వుంటారు. కేవలం జ్యేష్ఠాభిషేకం సమయంలోనే కవచాన్ని తొలగిస్తారు. ఈ సమయంలోనే మనకు స్వామి వారు నిజరూపంలో దర్శన మిస్తారు. మిగతా సంవత్సరమంతా స్వర్ణకవచంతో దర్శనమిస్తారు.

**మూడురోజుల ఉత్సవం**

జ్యేష్ఠాభిషేకం ప్రారంభంనాడు యధావిధిగా సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన, నైవేద్యం, రెండవ అర్చన, రెండో నివేదన జరిగిన అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారు ఆనందనిలయ గర్భాలయం నుండి బయలుదేరి నిత్యకల్యాణం జరిగే శ్రీ వేంకటరమణ కల్యాణ మండపానికి చేరుకుంటారు. స్వామివారిని వేంచేపు చేసి ముందుగా యాగశాలలో శాంతిహోమం నిర్వహిస్తారు. శతకలశ ప్రతిష్ట, తర్వాత నవకలశ ప్రతిష్ట, ఆవాహనపూజలు చేస్తారు. తర్వాత నివేదనలు, హారతులు సమర్పించి కంకణప్రతిష్ట చేస్తారు.

అనంతరం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్ప స్వామి వారికి ఆర్ఘ్య పాద్య ఆచమనంలను నిర్వహించి కంకణ ధారణచేస్తారు. తర్వాత హోమాన్ని పూర్తి చేసి హోమ తిలకాన్ని స్వామి వారలకు



ధరింప చేస్తారు. ఆ తర్వాత స్నపన తిరుమంజనం (అభిషేకం) చేస్తారు.

వేదపండితులు శ్రీ సూక్తం, పురుషసూక్తం, భూసూక్తం వంటి పంచసూక్తాలను పఠిస్తూ వుండగా జియ్యంగార్లు బంగారు శంఖాలతో అర్చక స్వాములకు శుద్ధ జలాలను అందిస్తూ వుండగా ఆ జలం తో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్ప స్వామి వారికి అభిషేకం చేస్తారు. ముందుగా శుద్ధజలం, తర్వాత పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు వంటి వాటితోనూ అభిషేకం చేస్తారు. వాటి మధ్యలో శతకలశాలలోని నీటితో అభిషేకాన్ని చేస్తారు. చివరగా చందనాన్ని కిరీటం మెదలుకుని స్వామివారికి, అమ్మవార్లకు అద్ది, తిలకధారణ చేసి తులసి మాలలను అలంకరింపజేస్తారు. అనంతరం బంగారు జల్లేదను స్వామివారి తల పైభాగంలో వుంచి అందులోనవ కలాశాల్లోని నీటిని పోస్తారు. అంటే బంగారు జల్లేడు నుంచి సహస్ర ధారలతో స్వామివారు, అమ్మవార్లకు అభిషేకం చేస్తారు. అభిషేకం పూర్తి చేసి అభిషేక జలాన్ని ముందుగా అర్చకస్వామి శిరస్సుపై చల్లుకుని తర్వాత భక్తులందరిపైన "పుతోభవ" అని చిలకరిస్తారు. తర్వాత శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామి వారికి వస్త్రాలంకరణ చేసి నివేదనలు సమర్పించి హారతులు సమర్పిస్తారు.

ఈ విధంగా రెండవ రోజు, మూడో రోజు కూడా స్నపన తిరుమంజనం జరుపుతారు. ఇక జ్యేష్ఠాభిషేకం చివరి రోజు స్వామి వార్లకు నూతన స్వర్ణ కవచాలను ధరింప జేస్తారు . ఈ కవచాలు సంవత్సరమంతా అలాగే ఉంటాయి. తిరిగి సంవత్సరం జ్యేష్ఠాభిషేకం ముందు తొలగిస్తారు. కాగా, ఉత్సవమూర్తులు అరుగుదల, క్షీణతకు గురికాకుండా ఉండేందుకే కవచ సమర్పణ చేస్తారు.

కాగా, జ్యేష్ఠాభిషేకం సమయంలో మాత్రమే స్వామి వారికి అన్ని ద్రవ్యాలతో శిరస్సునుంచి అభిషేకం జరుగుతుంది. సంవత్సరం పొడువునా జరిగే మిగతా అభిషేకాల్లో కేవలం శుద్ధజలంతో మాత్రమే శిరస్సు నుంచి అభిషేకం చేస్తారు. పాలు, పెరుగు, తేనె, కొబ్బరి నీళ్ళు పాదాలకు మాత్రమే సమర్పిస్తారు.

ఈ ఉత్సవాలను కంకణ ధారణ చేసి నిర్వహించే అర్చకుడ్ని – "కంకణ భట్టర్' అని అంటారు. తిరువీధుల మెరిసీ....

జ్యేష్ఠాభిషేకం జరిగే మూడు రోజులు స్వామివారు సాయంత్రం నాలుగు మాడ వీధులలో శ్రీదేవి, భూదేవి సమేతులై ఊరేగుతారు. మొదటి రోజు స్వామివారలు వజ్ర కవచాన్ని ధరించి.... రెండవ నాడు ముత్యపు కవచాన్ని ధరించి, మూడో నాడు స్వర్ణకవచాన్ని ధరించి దేదీప్యమానంగా వెలుగొందుతూ తిరువీధులలో ఊరేగుతూ భక్తులకు దివ్యదర్శన భాగ్యాన్ని ప్రసాదిస్తారు.

జ్యేష్ఠాభిషేకంలో దివ్యరూపుడైన స్వామి వారి దర్శనం సకల శ్రేయోదాయకం !!

★★★

# పుష్ప యాగ మహోత్సవము

-డా. దేవులపల్లి పద్మజ, 9849692414

**వారాహవేష భూలోకం లక్ష్మీ మోహన విగ్రహం!**
**వేదాంతగోచరం దేవం వేంకటేశం భజామహే!!**

కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వరునికి చేయు అనేక విశిష్ట సేవలలో పుష్పయాగము ప్రత్యేకము. ఈ పుష్పయాగ దర్శనము అదృష్టము ఉంటేనే సాధ్యము. శ్రీవేంకటేశ్వరుడు అలంకార ప్రియుడు. పుష్పాలతోనే కాక నవరత్న ఖచిత వజ్రవైఢూర్యాలతో అలంకరింపబడతాడు. పరిమళపుష్ప ద్రవ్యాలతో స్నపన తిరుమంజనాలతో మలయప్ప ఉభయ దేవేరులతో కూడి వైభవోపేతంగా పుష్పయాగ మహోత్సవము జరిపించుకుంటాడు. బ్రహ్మోత్సవాలలో తెలిసీ తెలియక చేసిన దోషాలను క్షమించి ఉపశమనం కలిగించమని వేడుకుంటూ చేసే పుష్ప కైంకర్యమే పుష్పయాగము.

కార్తీక శ్రవణానక్షత్ర పర్వదినం సందర్భంగా 15వ శతాబ్దంనుంచి ఆచరణలో ఉన్న శ్రీవారికి పుష్పయాగ మహోత్సవం జరుగుతూ వస్తోంది. దేశం సుభిక్షంగా ఉండాలని, సస్యశ్యామలం కావాలని ఈ ఉత్సవం చేసేవారని శాసనాల ద్వారా తెలుస్తోంది. శ్రీదేవి, భూదేవిలతో కూడిన మలయప్పస్వామికి పాదాలనుంచి, హృదయం వరకూ పుష్పాలతో చేసే ఆరాధనే పుష్పయాగం. ఇలా ఇరవై ఏడు సార్లు సుగంధ పుష్పజాతులతో పుష్పకైంకర్యం జరిపించడం శుభకరం.

ఆలయంలోని యాగశాలలో ఈ పుష్పయాగానికి అంకురార్పణ శ్రవణానక్షత్రం వున్న ముందురోజు జరిపిస్తారు. కంకణధారులైన ఆచార్యులు శ్రీవారి ఆలయంలో మూలవిరాట్టుకు ఎదురుగా ఆచార్య ఋత్విక్ వరణం చేస్తారు. వైదిక కార్యక్రమాల నిర్వహణ కోసం స్వామివారే ఆజ్ఞాపించినట్లు భావించి ఆచార్యులు విధులు నిర్వహిస్తారు. అంకురార్పణ కొరకు శ్రీవారి సేనాధిపతియైన శ్రీ విష్వక్సేనుల వారిని ఆలయంనుండి వసంత మండపానికి ఊరేగింపుగా తీసుకొని వెళతారు. అక్కడ మృత్ సంగ్రహణం, ఆస్థానం నిర్వహించి తిరిగి శ్రీవారి ఆలయానికి చేరుకుంటారు. ఈ సేవకు పుష్పాలను ఉదయమే ఉద్యానవన కార్యాలయ విభాగము నుండి శ్రీవారి ఆలయం వరకు గోవింద నామ స్మరణతో ఊరేగిస్తూ ఆలయం వద్దకు చేరుస్తారు.

స్నపన తిరుమంజనంలో పాలు, పెరుగు, తేనె, నెయ్యి, నారికేళ జలం, పసుపు, చందనం, కుంకుమపువ్వు, ఒట్టివేర్లతో కలసిన సుగంధ జలంతో అభిషేకిస్తారు. ప్రతీ అభిషేక అనంతరం స్వామివారికి హారతి, ధూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. పిదప పట్టు వస్త్రాలతో అలంకరించి వేద మంత్రాల మధ్య పుష్ప కైకర్యం ప్రారంభిస్తారు.

సంకీర్తనాచార్యుడైన అన్నమయ్య తన రచనలలో పుష్పయాగాన్ని ఈ విధంగా వర్ణించాడు –

**పూవుబోణుల కొలువే పుష్ప యాగము**
**పూవక పూచె నీకిట్టె పుష్ప యాగము**
**కలువరేకులవంటి ఘనమైన కన్నుల**
**పొలతుల చూపులె నీ పుష్ప యాగము**
**తలచి తలచి నిన్ను దమమేనుల బొడమే**
**పులకజొంపములె నీ పుష్ప యాగము**
**కరకమలములను కందువగోపికలెల్లా**
**పొరసి నిను జూపుటే పుష్పయాగము**
**సరసపుమాటలే సారెనాడి తమనవ్వు**
**పొరి నీపై జల్లుటే పుష్ప యాగము**
**గాటపుగొలనిదండగాంతలు సిగ్గున నిన్ను**
**బూటకానకు దిట్టుటే పుష్పయాగము**
**యీటున శ్రీ వెంకటేశ యిట్టె యలమేలుమంగ**
**పూటపూటరతులివి పుష్పయాగము**

ఇరు దేవేరులతో కలసిన మలయప్ప స్వామికి 27 రకాల పుష్పాలతో పాదములనుండి పైవరకు పుష్ప కైంకర్యం చేస్తారు. ఒక్కొక్క పుష్ప సమర్పణ అనంతరం ధూపదీప నైవేద్యములు చేస్తూ సుమారు 15 టన్నుల పుష్పాలను స్వామికి సమర్పిస్తారు. దాతలు ఆంధ్ర, తమిళనాడు మరియు కర్నాటక రాష్ట్రాలనుంచి సమర్పించిన పుష్పాలను వేద పండితుల ఆధ్వర్యంలో ఆగమోక్త ప్రకారం కార్యక్రమ నిర్వహణ జరుగుతుంది. స్వామివారి దర్శన భాగ్యముచేత పునర్జన్మ ఉండదని భక్తుల విశ్వాసము.

లోకపావని, శ్రీమహాలక్ష్మి పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాల అనంతరం ఏకాంత పుష్పయాగము నిర్వహిస్తారు. ఈ సమయంలో తొలుత అమ్మవారి మూలమూర్తికి పుష్పార్చన చేస్తారు. పుష్పయాగములో ఉపయోగించే పుష్పాలకు విశేష ప్రాధాన్యత, ఫలితాలు ఉంటాయి.

సంపంగి పూలు అనుగ్రహం కోసం, కనకాంబరం పూలు

నిరాడంబరత మరియు ప్రశాంతత కోసం, తామర పూలు ఐశ్వర్యం కోసం, మరువం ఆకర్షణ కోసం, దవనం దయాగుణం కోసం, మల్లిపూలు పరస్పర స్నేహం కోసం, మందారం శక్తిసామర్థ్యాల కోసం, జాజి పూలు త్యాగ గుణం కోసం, గులాబీలు సౌందర్యం కోసం, చామంతులు ప్రసన్నగుణం కోసం, కదిరిపచ్చ ఆయుష్షు కోసం, బిల్వదళాలు మోక్షసాధనకు, కమలములు సకల ఐశ్వర్యములకు, మొగలి పూలు పరాక్రమ శక్తికి మరియు మనోరంజనమునకు, నందివర్ధనం పూలు స్వచ్ఛతకు, లక్ష్మితులసి ధృఢమైన బంధానికి, కృష్ణతులసి లక్ష్మీనారాయణుని అనుగ్రహం కోసం ఈ పుష్పయాగాన్ని ఘనంగా జరిపిస్తారు,

మధ్యాహ్న సమయంలో తిరుచానూరు కోర్టుహాలునుంచి అధికారులు లాంఛనాలతో పుష్పాలను, పత్రాలను ఊరేగింపుగా శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయానికి తీసుకొని వెళ్ళి సమర్పిస్తారు. సుమారు 15 టన్నుల పుష్పాలను వినియోగిస్తారు.

స్నపనతిరుమంజనం అనంతరం అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో నవరత్నాలు పొదిగిన స్వర్ణాభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి శ్రీకృష్ణస్వామి ముఖమంటపానికి వేంపుచేసి,సాయంత్రం వివిధ రకాల పరిమళ భరిత పుష్పాలతో వేదమంత్రోచ్చారణల నడుమ పుష్ప యాగం భక్తులకు నయనానందకరంగా నిర్వహిస్తారు. ఈ కార్యక్రమానికి పలువురు భక్తులు 18 రకాల పుష్పాలను సమర్పించగా, లోకకళ్యాణం కోసం పుష్పాంజలి సేవ ఘనంగా నిర్వహిస్తారు. ఆ పుష్పయాగములో పునీతమై చెంతకు చేరే పుష్పాల వివరాలు – సంపంగి, కనకాంబరం, తామర, మరువం, దవనం, మల్లి, మందారం, జాజులు, గులాబీలు, చామంతులు, కదిరిపచ్చ, బిల్వము, కమలం,మొగలి, మనోరంజని, నందివర్ధనం, లక్ష్మితులసి, కృష్ణతులసి, కాలనంద, అగ్రకర్ణిక మొదలైన పుష్పాలతో మలయప్పస్వామికి ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాలనుంచి సమర్పించబడ్డ పుష్పాలు, తులసీదళాలు యాగ కైంకర్యానికి వినియోగిస్తారు. ఈ పుష్పాలను స్వామి మరియు దేవేరుల పాదాలవద్ద సమర్పిస్తారు.

ఈ సందర్భంగా వేద పండితులు ఋగ్వేదం, శుక్ల యుజుర్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణవేదాలను పఠించి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీనివాసుని ప్రసన్నం చేసుకుంటారు. దేవేరులతో కూడిన స్వామి వారికి జరిపించే పుష్పయాగం లోకకళ్యాణార్థం జరిపిస్తారు.

# మీ ప్రశ్న - మా సమాధానం

**నిర్వహణ: డా. మరింగంటి లక్ష్మణాచార్యులు**

**1. సుఖ శాంతులతో ఉండాలంటే ఏం చెయ్యాలి? – సతీష్, హబ్సీగూడ, రోడ్ నెం. 8**

జవాబు – 5 సూత్రాల్ని పాటిస్తే మనకి జీవితంలో సుఖశాంతులు లభిస్తాయి.

1. జీవితంలో ఏది లభించినా దాన్ని భగవత్ప్రసాదంగా భావించాలి. విజయం లభిస్తే ఆనందం, లభించకపోతే ఒక అనుభవం, ఒక గుణపాఠం, ఒక హెచ్చరికగా భావించాలి.
2. ఆలోచన, ఆచరణ ఒక్కటిగా, చక్కగా లోకహితంగా కూడా ఉండాలి.
3. (సు) జ్ఞానం లభించే సత్సంగాలకు, ప్రవచనాలకు వెళ్ళాలి.
4. కుటుంబ సభ్యులతోను, సమాజంలోని ఇతరులతోను ప్రేమగా వ్యవహరించాలి. మానవ విలువలతో జీవించాలి.
5. రోజూ ధ్యానం, యోగా చేయాలి.

**2. జీవితం అంటే మరియు జీవన్ముక్తి అంటే ఏమిటో దయచేసి వివరించండి? – పద్మజ, విజయవాడ**

జవాబు – మనిషికి జీవితం అనేది పరమాత్మ అందించిన ఒక అమూల్యమైన వరం. ఆయన కృప ఉంటేనే దుర్లభమైన ఈ జీవితం మనకు లభిస్తుంది. పశు ప్రవృత్తి నుండి మానవత్వం గుండా దైవత్వం వైపు నడవడమే జీవితం. మనిషి తన వ్యక్తి భావాన్ని బ్రహ్మ భావంగా మార్చుకోగలగాలి. అలా బ్రహ్మభావనలో ఉండే మనిషి తాను జీవించి ఉండగానే ముక్తుడై జీవితకాలంలోనే ముక్తి, ఆనందం పొందగలుగుతాడు. ''నేను'', ''నాది'' నుండి బయటపడి మనది, మనం అనే భావనతో జీవించి, జీవిత తత్త్వాన్ని పెద్దల ద్వారా, జ్ఞానుల ద్వారా గ్రహించి, పరమాత్మతో తనకున్న సంబంధం తెలుసుకుని జీవితకాలంలోనే బంధాల్ని తెంచుకుంటూ పోయి బ్రహ్మ భావనలో ఉన్నప్పుడే జీవన్ముక్తి లభిస్తుంది.

**"పూర్ణమదః పూర్ణమదం పూర్ణాత్ పూర్ణముదచ్యతే**
**పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే"**

అదీ, ఇదీ (పరమాత్మ – జీవాత్మ) కూడా పూర్ణమే యని, పూర్ణం నుండే పూర్ణం ఏర్పడి, చివరికి పూర్ణము పూర్ణములోనే కలిసిపోతుందని, పూర్ణము పూర్ణత్వాన్ని తనలోనే కలిపేసుకుంటుందని గ్రహించాలి. సత్స్వరూపం తెలుసుకుని ఆ సత్యం, జ్ఞానం అనంతరూపమైన బ్రహ్మములో కలిసేట్టు చేయమని పరమాత్మను ప్రార్థించాలి.

**జిజ్ఞాస కలిగిన ఆధ్యాత్మిక ప్రశ్నలకు సమాధానాలు. భక్తులు తమ ప్రశ్నలను మా పత్రికకు రాయగలరు. – ఎడిటర్, శ్రీవేంకటేశం**

## శ్రీ వేంకటేశ్వర మహామంత్రపీఠం ఆధ్వర్యంలో

# శ్రీనివాస కళ్యాణాలు

**ఉచిత శ్రీనివాస కళ్యాణాలను నిర్వహించండి!**
**శ్రీవారి కృపకు పాత్రులుకండి!!**



**తిరుమల శ్రీవేంకటేశ్వరుని కరుణా కటాక్షములు అందరికీ లభించాలని 'కరోనా' లాంటి మహమ్మారి నుండి లోకాన్ని స్వామివారు రక్షించాలనే ఉద్దేశ్యంతో, భగవంతునికి మరియు ఆయన భక్తులకు సేవచేయాలన్న లక్ష్యంతో 'శ్రీనివాస కళ్యాణాలు' అనే కార్యక్రమమును చేపట్టాము.**

కలియుగ దైవమైన తిరుమల శ్రీవేంకటేశ్వరునికి ప్రతి సంవత్సరం 7 కళ్యాణాల కంటే తక్కువ కాకుండా కనీసం 111 కళ్యాణాలను వివిధ ప్రాంతాలలో ఉచితంగా నిర్వహించాలని సంకల్పించాము.

ఆహ్వానించిన భక్తుల ప్రాంతములో అనగా వారి వారి ఊరు, అపార్టుమెంట్ లేదా ఇంటివద్దనే నిర్వహించెదము. శ్రీవారి కళ్యాణమును శాస్త్రోక్తంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు అనగా విగ్రహాలను, బ్రాహ్మణులను, ఇతర సామగ్రిని మేమే ఏర్పాటు చేసెదము. కళ్యాణముతో పాటు వీలైతే అన్నమయ్య కీర్తనలు, ప్రవచనములను కూడా ఏర్పాటు చేయగలము. భక్తులలో శ్రీవేంకటేశ్వరస్వామి పట్ల భక్తి భావమును, శరణాగత తత్త్వమును ప్రోత్సహించుచు, స్వామివారి సేవాభాగ్యమును మరియు ఆశీస్సులను అందించుటే మా లక్ష్యం.

**శ్రీవారి కళ్యాణమును తమ ప్రాంతము, ఊరు, ఇంటి వద్ద నిర్వహించుటకు ఆసక్తికల భక్తులు మమ్మల్ని సంప్రదించవలెనని మనవి. భక్తులకు అనువైన రోజున 'నమో వేంకటేశాయ' రథం యుక్తంగా విచ్చేసి శ్రీనివాస కళ్యాణమును నిర్వహించుదుము. (హైదరాబాద్ మరియు పరిసర ప్రాంతాలలో మాత్రమే)**

**శ్రీవేంకటేశ్వర మహామంత్రపీఠం**

శ్రీవేంకటేశ్వర పాదసేవకుడు
**పుల్లగూర్ల సాయిరెడ్డి**
(గోవిందదాసు)

ఫోన్: 040-27175050
సెల్: 93482 12354
E.mail: srivenkatesham@gmail.com
Website:Srivenkatesham.org

# రాశి ఫలితములు

## మేషరాశి

అశ్వని 1,2,3,4 పాదములు, భరణి 1,2,3,4 పాదములు, కృత్తిక 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఉద్యోగస్తులకు ప్రమోషన్, ఆకస్మిక ధనలాభం. తీర్థయాత్రలు చేయగలరు. గృహ అవసరమైనవి సమకూర్చుకొనుట. ఇష్ట కార్యసిద్ధి. పిల్లలు ఆనందము. విద్యార్థులకు సంతృప్తి. అఖండ దీపారాధన చేసి లక్ష్మి సరస్వతి విఘ్నేశ్వర పూజలు చేయండి.

## వృషభరాశి

కృత్తిక 2,3,4, రోహిణి 1,2,3,4 పాదములు, మృగశిర 1,2 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు చేయు వ్యాపారవృత్తులలో ప్రతి విషయంలో చాకచక్యముగా ముందుకు సాగండి. సంతాన లాభం కలిగి ఉన్నారు. ఉన్నత పదవులు కలిగి ఉన్నారు. అనారోగ్య సమస్యలు కలిగి ఉన్నారు. మీ ధైర్యమే మిమ్ములను ఉన్నత స్థితికి చేర్చును. నవగ్రహ ప్రదక్షిణలు చేయండి.

## మిథునరాశి

మృగశిర 3, 4 పాదములు, ఆరుద్ర 1,2,3,4 పాదములు, పునర్వసు 1, 2, 3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు ఆర్థికముగా కొంత వెసులుబాటు తక్కువగా ఉంటుంది. అనారోగ్య సూచనలు కలిగి ఉన్నారు. ప్రయాణములలో ప్రత్యేకముగా చాలా శ్రద్ధ కలిగి ఉండండి. కొన్ని విషయములలో రెండవ వారం నుండి అనుకూలంగా ఉంటుంది. నరసింహస్వామి వారి దర్శనం చేసుకోండి.

## కర్కాటకరాశి

పునర్వసు 4వ పాదము, పుష్యమి 1,2,3,4 పాదములు, ఆశ్లేష 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అనేక విషయములో విజయం వరించగలదు. ప్రత్యర్థులను ఇట్టే బోల్తా కొట్టించగలరు. ఇతరులు సానుభూతి చూపగలరు. శత్రువులు మిత్రులుగా ఉంటారు. ధన రాబడి ఉంటుంది. ఆభరణములు సమకూర్చుకొనగలరు. విష్ణు సహస్ర నామము చేయండి.

## సింహరాశి

మఘ 1,2,3,4 పాదములు, పుబ్బ 1,2,3,4 పాదములు, ఉత్తర 1వ పాదము

ఈ రాశి స్త్రీ పురుషులకు ఉన్న డబ్బంత ఖర్చు చేస్తారు. చాలా జాగ్రత్తగా ఏది కొనాలన్నా పరిపరి విధాల ఆలోచన చేయండి. మాకు దొరికిందే చాలు అనుకుంటే నష్టం రాగలదు. వాస్తు గురించి ఆలోచనతో, సూర్య ఆరాధనతో నష్టములు తీరును. సూర్యదేవాలయం దర్శనం చేసుకోండి.

## కన్యారాశి

ఉత్తర 2,3,4 పాదములు, హస్త 1,2,3,4 పాదములు, చిత్త 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు వివాదములకు దూరంగా ఉండండి. చేయు వృత్తి ఉద్యోగములందు అనుకూలత. దూర ప్రయాణములు కలిసి రాగలవు. ఆకస్మిక ధనయోగం ఉన్నది. అధిక ఖర్చులు చేయగలరు. ఆధ్యాత్మిక విషయ పరిజ్ఞానములు, యోగ, ధ్యానంలందు శ్రద్ధ పెట్టండి.

## తులారాశి

చిత్త 3,4 పాదములు, స్వాతి 1,2,3,4 పాదములు, విశాఖ 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు అనుకూలమైన రోజులు. ఆర్థికంగా చాలా బాగుంటుంది. ప్రతి విషయంలో తక్కువగా మాట్లాడగలరు. పెద్దల సలహాలు తీసుకొనగలరు. ఆవేశానికి సమయం కాదు. ఉద్రేకం వలన అనారోగ్యం కలిగి ఉన్నారు. ధనవ్యయం ఉన్నది ప్రశాంతంగా ఉండండి. నవగ్రహ ఆరాధన చేయుట, సత్యదేవుని వ్రతం చేయండి.

## వృశ్చికరాశి

విశాఖ 4వ పాదము, అనూరాధ 1,2,3,4 పాదములు, జ్యేష్ఠ 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు శత్రుశేషం పెరిగి ఉన్నది. మిత్రులు కూడా మీరు మాట్లాడే తీరు వల్ల శత్రువులుగా మారగలరు. ప్రయాణములు వాయిదా వేయుట మంచిది. తప్పనిసరి అనుకుంటే శకునం చూసుకుని శుభ ఘడియల్లో బయలుదేరండి. విష్ణు సహస్ర నామ పారాయణ చేయండి.

## ధనూరాశి

మూల 1,2,3,4 పాదములు, పూర్వాషాఢ 1, 2, 3, 4 పాదములు, ఉత్తరాషాఢ 1వ పాదము.

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా అనుకూలంగా ఉంటుంది. ఆకస్మిక ధనలాభములు. ప్రతి విషయంలో ఇంట్లో వారందరూ మద్దతు తెలుపగలరు. పిల్లల విషయంలో శ్రద్ధ తీసుకొనగలరు. కార్యరంగంలో సమర్థులుగా ఉంటారు. అధిక ప్రసంగములు చేయరాదు. లక్ష్మీనారాయణ పారాయణం చేయండి.

## మకరరాశి

ఉత్తరాషాఢ 2,3,4 పాదములు, శ్రవణం 1,2,3,4 పాదములు, ధనిష్ట 1,2 పాదములు

ఈ రాశి స్త్రీ పురుషులకు చాలా జాగ్రత్తగా ముందుకు సాగండి. ప్రతి విషయంలో ఆచితూచి ఆలోచనలతో ముందుకు సాగండి. పై అధికారుల దగ్గర అనుకూలంగా ఉన్నట్లుగా ఉంటుంది. చాలా జాగ్రత్తగా మాట్లాడగలరు. సుబ్రహ్మణ్యేశ్వర హోమము చేయండి.

## కుంభరాశి

ధనిష్ట 3,4 పాదములు, శతభిషం 1,2,3,4 పాదములు, పూర్వాభాద్ర 1,2,3 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉంటుంది. పట్టుదలతో ముందుకు సాగండి. మీరు ఏ విషయంలో నిరాశ చెందరాదు. ఆరోగ్య విషయంలో కొన్ని జాగ్రత్తలు పాటించగలరు. ప్రత్యేకంగా మీరు అనుకున్న విషయములలో ఆలస్యంగా ఉంటుంది. సుబ్రహ్మణ్యేశ్వర పూజలు, నవగ్రహ ప్రదక్షిణలు, దానాలు, జపాలు, శివారాధనలు చేయండి.

## మీనరాశి

పూర్వాభాద్ర 4వ పాదము, ఉత్తరాభాద్ర 1,2,3,4 పాదములు, రేవతి 1,2,3,4 పాదములు.

ఈ రాశి స్త్రీ పురుషులకు సామాన్యంగా ఉన్నట్లుగా ఉంటుంది. ఆర్థిక విషయంలో చాలా అనుకూలంగా ఉంటుంది. ఆదరాభిమానంగా స్పందించగలరు. మనస్ఫూర్తిగా ఉంటారు. ఎదుటివారిని గమనించండి. నవగ్రహ ఆరాధన జపములు ప్రదక్షిణలు చేయండి.

# మీ విజ్ఞానం

నిర్వహణ: **డా.పి. లలితవాణి**



శ్రీ వేంకటేశం
ఆధ్యాత్మిక మాసపత్రిక
ఇం.నెం. 1-1-53, వీధి నెం.1,
హబ్సీగూడ, హైదరాబాద్-500007,
ఫోన్: 040-27175050
Email: srivenkatesham@gmail.com

ఈ ప్రశ్నలన్నింటికీ ఇదే పేపరు మీద కొట్టివేతలు లేకుండా సమాధానాలు రాసి ఈనెల 20వ తేదీలోగా మాకు పంపగలరు. మీ చిరునామాను స్పష్టంగా రాయాలి. సరియైన సమాధానాలు వ్రాసిన వారిలో లక్కీడిప్ ద్వారా ఒకరిని ఎంపిక చేసి వారికి 'శ్రీవారి పాదాలు' బహుమతిగా ఇవ్వబడతాయి.

## ఈ క్రింది ప్రశ్నల జవాబుల కోసం గత నెల సంచికను పరిశీలించండి

1. హనుమంతుని జన్మనక్షత్రమేది?
2. సక్తుప్రస్థుని కథ చెప్పిన ముంగిస ఎవరు?
3. యవక్రీతుడు ఎవరి కొడుకు?
4. శచీదేవిని అపహరించిందెవరు?
5. నైమిశారణ్యం ఎక్కడుంది?
6. తిరుప్పన్ ఆళ్వార్ ఎవరి అంశ?
7. సూరదాసుని గురువు ఎవరు?
8. తిరుప్పన్ ఆళ్వార్ కి బిరుదు ఏమిటి?
9. తన కళ్ళను తానే పెరికికొని, అంధ మహాకవిగా పేరొందిన భక్తకవి ఎవరు?
10. 81 యోగినీ రూపాలు కొలువున్న ఆలయం ఏది?
11. పూతన పూర్వజన్మలో ఎవరు?
12. శ్రీకృష్ణుడు పడద్రోసిన వృక్షాలు ఎవరు?
13. స్వామివారి విమానాన్ని నిర్మించిందెవరు?
14. కుంతీ మాధవుడు ఎక్కడ ప్రతిష్ఠించబడ్డాడు?
15. గవ్వలను ఎవరి రూపాలుగా భావిస్తారు?

1. ______
2. ______
3. ______
4. ______
5. ______
6. ______
7. ______
8. ______
9. ______
10. ______
11. ______
12. ______
13. ______
14. ______
15. ______

## గత నెల ప్రశ్నలకు కరెక్టు సమాధానాలు

1. శ్రుతకీర్తి, 2. మోహినీ రూపంలోని విష్ణువు, 3. పేలపిండి, 4. త్రిజట, 5. దేవదేవి, 6. ముంగిస, 7. మేరు పర్వతం, 8. దుర్వాస మహర్షి – దిలీపునకు, 9. పులస్త్య మహాముని, 10. స్వామివారి కౌస్తుభమణి, 11. అభంగాలు, 12. 1008, 13. సైంధవుడు, 14. ఘటోత్కచుని, 15. పిఠాపురంలో

## సరైన సమాధానాలు రాసినవారు

1. చిల్లర సీతారామారావు, 2. చింతలపాటి శివశంకరశాస్త్రి, 3. ప్రవీణ్‌కుమార్, 4. లావణ్య

పేరు: ______

చిరునామా: ______

______

______

______

పిన్‌కోడ్: ______

ఫోన్: ______

## లక్కీడిప్ ద్వారా స్వామివారి పాదాలు పొందిన విజేత

**చింతలపాటి శివశంకర శాస్త్రి**



Postel Registration No: HSE/879/2022-2024

Published on 28th and Licenced to Post On 29th & 30th of Every Month

RNI No.: APTEL/2008/23122

# శ్రీ వేంకటేశం

ఆధ్యాత్మిక మాసపత్రిక



If Un delivered please return to:

**SRI VENKATESHAM, (Sri Venkateshwara Maha Mantra Peetham)**

H.No: 1-1-53, Street No. 1, Habsiguda, Hyderabad-500007. Ph: 040-27175050.

డిజిటల్ పాఠకుల కోసం పూర్తిగా కలర్ పేజీలు https://www.srivenkatesham.org లో చదవండి

Srivenkatesham Magazine in Google Drive https://drive.google.com/drive/folders/1jOWBeoUHjF4Qhn4wl-d9eUGlh6kVYyLq